
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవాతములతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు
జాతీయ తెలుగు దిన పత్రిక
website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :96 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | శనివారం 15 ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల రూ5 /-


# గ్రేటర్ పోరులో పార్టీలు...

**హైదరాబాద్, ఆగస్టు 14:**తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టాయి. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పార్టీలు సంస్థాగతంగా బలోపేతం కావాలని నిర్ణయించడం గమనార్హం. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ఇదే వ్యూహంతో ముందుకు సాగుతున్నాయి. వాస్తవానికి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు క్షేత్రస్థాయిలో బలంగానే ఉన్నాయన్న వాదన ఉంది. బీజేపీకి మాత్రమే హైదరాబాద్ సహా.. కొన్ని జిల్లాల్లో బలం ఉన్నా.. రాష్ట్ర వ్యాప్తంగా వెనుకబడే ఉంది బీజేపీ సంస్థాగతంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముఖ్యంగా పార్టీ పెద్దలు.. వచ్చే ఎన్నికల్లో తెలంగాణను దక్కించుకునేందుకు రెడీగా ఉన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో వారి అంచనాలకు అనుగుణంగా కార్యకర్తలు బలోపేతం కావడం లేదు. పార్టీ నాయకుల మధ్య కూడా సఖ్యత కనిపించడం లేదు. ఈ పరిణామాలను సరిదిద్దుకునేందుకు బీజేపీ సంస్థాగతంగా బలోపేతం కావడంపై దృష్టి పెట్టింది. ఈ మేరకు పార్టీ చీఫ్ రామచందర్‌రావు.. చర్యలు




చేపట్టారు.ఇక, సంస్థాగతంగా బాగానే ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ లు కూడా.. ఈదిశగానే అడుగులు - మిగతా3లో



## తెలంగాణలో ఆటోలు, క్యాబ్‌లు బంద్

**హైదరాబాద్, ఆగస్టు 14:**తెలంగాణలో ఆటో, క్యాబ్, స్కూల్ వ్?యన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23 అర్ధరాత్రి (24) నుంచి బంద్ చేస్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. తెలంగాణ ఆటో, యాప్ ఆధారిత ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య కళానిలయంలో సమావేశం నిర్వహించారు. మొత్తం 17 కార్మిక సంఘాల నేతలు పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు.. ఈ నెల 23 నుంచి బంద్‌కు పిలుపునిచ్చారు.తమకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ముఖ్యమంత్రి నివాసంతోపాటుగా అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడిస్తామన్నారు కార్మిక సంఘాల నేతలు. హైదరాబాద్‌ను లక్షల ఆటోలతో దిగ్బంధం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆటో, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు - మిగతా3లో

## జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఆవిష్కరించిన సీఎం రేవంత్..



**హైదరాబాద్:** మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. భాగ్య నగరంలోని నెక్లెస్ రోడ్డులో ఏర్పాటు చేసిన విగ్రహాలను ఆయన ఇవాళ (శుక్రవారం) ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, ఆర్.కృష్ణయ్య, సురేశ్ షెట్కర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, మందుల సామేల్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంత రావు, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ హాజరయ్యారు.



## హిందూ కుటుంబాలను వేధిస్తూ.. మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?

రాంచందర్ రావు ఫైర్
పాతబస్తీలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని రేవంత్ చెప్పారన్న రాంచందర్ రావు
విద్యుత్ బిల్లులు చెల్లించని మైనార్టీలపై సానుభూతి ఎందుకని ప్రశ్న
ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు

పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన... కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు. ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ... మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 14** : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది.ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే




ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ

**హైదరాబాద్:**శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అందుకు సంబంధించి అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించింది. గతంలో రాష్ట్రంలో 2 కోట్ల 81 లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులుంటే.. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. కొత్తగా కుటుంబీకుల పేర్లను కూడా నమోదు చేసింది. 62 లక్షల మందికి కొత్తగా లబ్ధి చేకూర్చింది. రాష్ట్రంలో ఈరోజుకు మొత్తం 3 కోట్ల 42 లక్షల మంది రేషన్ లబ్ధిదారులున్నారు. వీరికి స్మార్ట్ కార్డుల జారీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.




గత ఏడాది నిర్వహించినట్లే.. ఈ ఏడాది కూడా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 - మిగతా3లో

## బావమరిది కుటుంబాన్ని పరామర్శించిన కేసీఆర్



**హైదరాబాద్:**అనారోగ్యంతో మరణించిన తన బావమరిది శ్రీనివాసరావు పార్థివ దేహానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుష్పాంజలి ఘటించి, నివాళులర్పించారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## తెలంగాణలోనూ మఖానా సాగు..

**హైదరాబాద్, ఆగస్టు 14 :**వ్యవసాయ రంగంలో పరస్పర సహకారం కోసం తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు ముందుకు వచ్చాయి. తెలంగాణలో విజయవంతమైన ఆయిల్‌పామ్ సాగు విధానాన్ని అధ్యయనం చేయడానికి బిహార్ ఆసక్తి చూపగా.. బిహార్‌లో ప్రసిద్ధి చెందిన మఖానా సాగు, ప్రాసెసింగ్ విధానాలపై తెలంగాణ ఆసక్తి వ్యక్తం చేసింది. సెక్రటేరియట్‌లో తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బిహార్ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా భేటీ అయి.. ఉత్తమ వ్యవసాయ పద్ధతులు, పంటల వైవిధ్యీకరణపై చర్చించారు. ఈ రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మధ్య చోటుచేసుకున్న ఈ పరిణామం నూతన వ్యవసాయ సహకారానికి మార్గం సుగమం చేస్తోంది.ఈ మేరకు బిహార్ - మిగతా3లో








# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల్లో కనిపించని జెన్ జీ

ఆధునిక రాజకీయాల్లో జెన్ జీ ఓటర్లు అత్యంత కీలకమైన శక్తిగా మారుతున్నారు. జెన్ జీ వీధుల్లోకి వచ్చి ప్రభుత్వాలను గడగడలాడించిన దృశ్యాలను చూసి, తెలుగు రాష్ట్రాల రాజకీయ పార్టీలు కూడా ఈ తరాన్ని తమవైపు తిప్పుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. అయితే, గడిచిన కొద్దికాలంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే.. పార్టీలు ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జెన్ జీ కార్డు క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా జెన్ జీ ఆధారిత ప్రచారాన్ని తీవ్రంగా నడిపే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజినీరింగ్ చదువుల్ని క్రిమినల్ వేస్ట్ అని సంబోధించడంతో యువ ఇంజనీర్లందర్నీ అలా అన్నారని కేటీఆర్ క్యాంపెయిన్ చేశారు. క్రిమినల్ వేస్ట్ , అన్ ఫిట్ వంటి హ్యాష్ట్యాగ్‌లు, మీమ్ కల్చర్‌తో యంగ్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూశారు. అయితే, ఈ మీమ్స్ సోషల్ మీడియాలో ఎంటర్‌టైన్‌మెంట్‌గా మాత్రమే మిగిలిపోయాయి తప్ప, నిరుద్యోగ యువతను లేదా కాలేజీ విద్యార్థులను రోడ్లపైకి తెచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాస్ ప్రొటెస్ట్‌గా మార్చడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైంది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరోలా ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీని పునర్నిర్మించే క్రమంలో యువతను ఆకట్టుకునేందుకు వినూత్నంగా ప్రయత్నించింది. అయితే, నిజమైన తటస్థ జెన్ జీ యువతను భాగస్వాములను చేయడం కంటే, ఇప్పటికే పార్టీలో ఉన్న తమ అనుబంధ విద్యార్థి విభాగం, ఐటీ సెల్ కార్యకర్తలకే జెన్ జీ అనే కొత్త ల్యాబెల్ వేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం కనిపించింది. డీఎస్సీ పోరాటాల్లో ఈ పద్ధతి ఎక్కువగాఉంది. కేవలం పార్టీ ప్రచార పత్రాలు పట్టుకుని ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్‌లలో హల్‌చల్ చేయడం వల్ల అది కేవలం ఆర్గనైజ్డ్ పార్టీ ప్రచారంగానే మిగిలిపోయింది తప్ప, ఏపీలోని సాధారణ యువతలో ఎలాంటి పొలిటికల్ అప్‌రైజింగ్‌ను తీసుకరాలేకపోయింది. తెలుగు యువతలో అత్యధిక శాతం మంది ఐటీ ఉద్యోగాలు, యూఎస్/యూకే ఉన్నత చదువులు, గ్రూప్స్. సివిల్స్ , ఇతర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలోనే నిమగ్నమై ఉన్నారు. డిజిటల్ స్పేస్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తపరిచినా, రోడ్లెక్కి నిరసన తెలిపితే నమోదయ్యే క్రిమినల్ కేసులు తమ భవిష్యత్తు, వీసా అవకాశాలను దెబ్బతీస్తాయనే హెచ్చరిక వారిని వెనక్కి లాగుతోంది. నేటి తరం రాజకీయ వ్యతిరేకతను లేదా మద్దతును రీల్స్, మీమ్స్, ఎక్స్ , స్పేసెస్, డోపమైన్ ఇచ్చే డిజిటల్ కంటెంట్ రూపంలోనే చూపిస్తోంది. వీధి పోరాటాల కంటే డిజిటల్ ట్రోలింగ్‌నే వారు సౌకర్యవంతమైన యాక్టివిజంగా భావిస్తున్నారు. రాజకీయ పార్టీలు జెన్ జీ మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడంలో పొరబడుతున్నాయి. నాయకులు వేసే మీమ్స్ లేదా వాడే జార్గన్స్ చూసి తమను వారు ప్రతిబింబిస్తున్నారని యువత భావించడం లేదు. పార్టీలు ప్రదర్శించే ప్రచా కృత్రిమమైనది గా ఉండటంతో యువత సులభంగా గుర్తిస్తోంది. ఉపాధి అవకాశాలు, క్వాలిటీ ఎడ్యుకేషన్, గిగ్ ఎకానమీ కార్మికుల సమస్యలు, స్టార్టప్ ఈకోసిస్టమ్, ప్రాజెక్టుల పురోగతి వంటి నిజమైన ఎజెండా వదిలేసి.. కేవలం వ్యక్తిగత దూషణలు, రాజకీయ ట్రోలింగ్ చుట్టూ తిరిగే కంటెంట్‌ను జెన్ జీ లైట్ తీసుకుంటోంది. రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేయనంత మాత్రాన తెలుగు జెన్ జీకి రాజకీయ స్పృహ లేదనుకోవడం పార్టీల పెద్ద పొరపాటే అవుతుంది. వారు నిశ్శబ్దంగా గమనించే సైలెంట్ ఓటర్లు . బూత్ లెవల్‌కి వచ్చి ఓటు వేసే సమయంలో సాంప్రదాయ కుల, ప్రాంతీయ సమీకరణల కంటే.. వ్యక్తిగత స్వాతంత్ర్యం, ఉద్యోగ కల్పన, పారదర్శక పాలన అందించే నాయకులకే ప్రాధాన్యత ఇస్తారు. ఏదైనా ఒక రాజకీయ పార్టీ తమ సొంత ప్రయోజనాల కోసం తమను పొలిటికల్ టూల్ గా వాడుకోవాలని చూస్తే తిరస్కరించడంలో ఈ తరం ముందే ఉంటుంది. నాయకులు కేవలం మీమ్స్‌కే పరిమితం కాకుండా, వారి భవిష్యత్తుకు భరోసానిచ్చే విజన్‌ను చూపినప్పుడే ఈ తరం ఓటర్లు నిజమైన మద్దతుదారులవుతారు.

## 80 ఏళ్ల భారతవని...
# ఎన్నో మార్పులు... అయినా.. ఇంకా...

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకుంటున్న తరుణంలో, ప్రజల ఆర్థిక అలవాట్లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రాథమిక అవసరాలకే పరిమితమైన కుటుంబాలు, ఇవాళ ప్రీమియం ఉత్పత్తులు, విదేశీ ప్రయాణాలు, వినోదంపై ఖర్చు చేస్తున్నాయి. స్థిరత్వం కోసం బ్యాంకు డిపాజిట్లపై ఆధారపడే స్థాయి నుండి, సంపద సృష్టి కోసం ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టే స్థాయికి భారతీయ మధ్యతరగతి వర్గం అద్భుతంగా ఎదిగింది. భారత్ 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం పొందినప్పుడు, పేదరికం, నిరక్షరాస్యత, ఆహార అభద్రత ఎక్కువగా ఉండేవి. ఆ కాలంలో సగటు కుటుంబాల ఇంటి వినియోగం కేవలం నిత్యావసరాలకు మాత్రమే పరిమితమై ఉండేదని ఆర్థికవేత్తల అంచనాలు చెబుతున్నాయి. కానీ 79 ఏళ్ల ఈ చారిత్రక ప్రయాణంలో భారతీయ ఆర్థిక వ్యవస్థ ఎంతో వృద్ధి చెందింది. ఒకప్పుడు స్కూటర్ కొనాలని ఆశపడిన కుటుంబం, ఇప్పుడు ఆధునిక ఎలక్ట్రిక్ కార్ల కోసం చూస్తోంది. ఇప్పుడు ప్రజల ఆర్థిక ఆకాంక్షలు స్థిరత్వాన్ని పొందడం నుండి, పెట్టుబడుల ద్వారా చురుకుగా సంపదను సృష్టించడం వైపు గణనీయంగా మారాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.




**కొరత నుండి ఎంపిక వరకు...**

ఒకప్పుడు సగటు భారతీయుడి ఆర్థిక ఆకాంక్షలు కేవలం కూడు, గుడ్డ, ఇల్లు సంపాదించడంపైనే కేంద్రీకృతమై ఉండేవి. ఇవాళ పెరుగుతున్న ఆదాయాలు, వేగవంతమైన పట్టణీకరణ, డిజిటల్ వేదికల కారణంగా కుటుంబాలకు అనేక రకాల ఆప్షన్లు అందుబాటులోకి వచ్చాయి. తాజా సర్వే గణాంకాల ప్రకారం, గ్రామీణ, పట్టణ కుటుంబాల ఖర్చుల మధ్య అంతరం కూడా వేగంగా తగ్గుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేవలం కడుపు నిండా తినడానికి చేసే ఖర్చుల వాటా క్రమంగా తగ్గి, మిగిలిన డబ్బును రవాణా, వినోదం, గృహవసతి, మెరుగైన ఆరోగ్య సంరక్షణ, ఎలక్ట్రానిక్స్ వస్తువుల కోసం ఉపయోగిస్తున్నారు.

**సామూహిక వినియోగం నుండి ప్రీమియం వరకు...**

ఆటోమొబైల్ రంగంలో సైతం వినియోగదారుల ఆలోచనా విధానంలో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వినియోగదారులు కేవలం అత్యంత చౌకైన ఎంట్రీ-లెవల్ వాహనాల కోసం చూడకుండా, వాడిన కార్ల మార్కెట్‌లో కూడా ప్రీమియం వేరియంట్లు , మెరుగైన సౌకర్యాలున్న ఎస్‌యూవీలను కొనుగోలు చేయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్ల విషయంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. ఉదాహరణకు, రూ.30 వేలుపైబడిన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ల మార్కెట్ వాటా 2020లో 20% ఉండగా, 2025 నాటికి అది 26%కి గణనీయంగా పెరిగింది.

**పెరుగుతున్న ప్రయాణాలు, వినోద ఖర్చులు**

ఒకప్పుడు కేవలం కొద్దిమందికి మాత్రమే పరిమితమై, విలాసంగా భావించిన అంతర్జాతీయ విదేశీ ప్రయాణాలు.. ఇప్పుడు మధ్యతరగతి ప్రజలకు సాధారణ ఖర్చుగా మారిపోయాయి. పర్యాటక శాఖ లెక్కల ప్రకారం 2025లో భారత పౌరులు రికార్డు స్థాయిలో 32.83 మిలియన్ల విదేశీ పర్యటనలు చేశారు. మరోవైపు సంగీత కచేరీలు, క్రీడా కార్యక్రమాలు, లైవ్-ఈవెంట్స్ కోసం కూడా ప్రజలు ఇప్పుడు చాలా ఎక్కువ డబ్బును వెచ్చిస్తున్నారు.

**పొదుపు నుండి పెట్టుబడుల వైపు...**

దశాబ్దాలుగా సంప్రదాయ భారతీయ కుటుంబాలు బ్యాంకు డిపాజిట్లు, స్థిరాస్తులు , బంగారంపై మాత్రమే ఎక్కువగా ఆధారపడేవి. కానీ ఇప్పుడు గృహ ఆర్థిక ఆస్తులలో ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్ల వాటా భారీగా పెరుగుతోంది. నెలవారీ సిప్ కంట్రిబ్యూషన్‌లు ఖీ17లో రూ.4,000 కోట్ల కంటే తక్కువగా ఉండగా, ఖీ26 ఏప్రిల్-నవంబర్ నాటికి ఏకంగా రూ.28,000 కోట్లకు పైగా అద్భుతంగా వృద్ధి చెందాయి. పెట్టుబడిదారుల సంఖ్య కూడా 2020లో 3.1 కోట్లు ఉండగా, 2025 నాటికి 11 కోట్లకు పైగా విస్తరించింది. భవిష్యత్తులో భారతీయ వినియోగ కథ కేవలం ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి పెద్ద మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, టైర్-×× , టైర్-××× నగరాలకు కూడా వేగంగా విస్తరించనుంది. భారతదేశ జనాభాలో 31% మంది ఉన్న మధ్యతరగతి వర్గం.. ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టిస్తూ, మారుతున్న ఆధునిక భారతదేశ ముఖచిత్రానికి ప్రతీకగా నిలుస్తోంది.

# యోగి బాటలో సువేందు

**కోల్ కత్తా, ఆగస్టు 14:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో దశాబ్దాలుగా నెలకొన్న ధోరణులను సవాలు చేస్తూ సువేందు అధికారి తన పాలనను ఆరంభించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలు అనుసరించిన కఠినమైన, చట్టబద్ధమైన విధానాన్ని ఆయన అనుసరిస్తున్నారని విశ్లేషకులు గమనిస్తున్నారు. అధికారంలోకి వచ్చి మూడు నెలల్లోనే పాత సమస్యలపై దృష్టి సారించడం ఈ విధానం ప్రధాన లక్షణం. యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌లో మాఫియా నెట్‌వర్క్‌లను అణచివేయడం, మహిళలపై దాడులు చేసేవారిపై కఠిన చర్యలు, అక్రమ నిర్మాణాలపై బుల్డోజర్ చర్యలు, అల్లర్ల సమయంలో రాష్ట్రాన్ని శాంతియుతంగా ఉంచడం వంటి అంశాలు గుర్తుంచుకోదగినవి. సువేందు అధికారి కూడా ఇలాంటి సమస్యలపై దృష్టి సారించారు. ఏడు దశాబ్దాలుగా పరిష్కారం కాని అంశాలను త్వరగా అందుకోవడం ఆయన పాలనలో కనిపిస్తోంది. కోల్‌కతా విమానాశ్రయం సమీపంలోని నిర్మాణం విమానాల కదలికకు అడ్డంకిగా మారిన సందర్భంలో కఠిన నిర్ణయం తీసుకోవడం ఇందుకు ఉదాహరణ. ఇలాంటి చర్యలు రాష్ట్రంలో చట్ట పాలనను బలోపేతం చేస్తాయని మద్దతుదారులు వాదిస్తున్నారు. ప్రజా ప్రదేశాల్లో మసీదులు, ఆలయాలు, చర్చిల నుంచి వచ్చే అధిక శబ్దం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా ఉందని గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి సమస్యపై యోగి ప్రభుత్వం తీసుకున్న చర్యలను అనుసరిస్తూ, అవసరమైన చోట్ల మైకుల తొలగింపు జరుగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో మదరసాలు, మసీదుల వద్ద ఏర్పడే గందరగోళాన్ని తగ్గించే ప్రయత్నం కూడా కొనసాగుతోంది. మంత్రి అగ్నిమిత్ర పాల్ త్వరలో ఫలితాలు కనిపిస్తాయని సూచించారు. ఇది మతాల మధ్య సమాన నియమాలను అమలు చేసే ప్రయత్నంగా చూడవచ్చు. ఈ చర్యలపై ముస్లిం అనుకూల పార్టీలు, కొన్ని మసీదు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సెక్యూలర్ ఫ్రంట్ ఎమ్మెల్యే నౌసాద్ సిద్దీఖి కుటుంబం నిర్వహించే దర్గా సంబంధిత వ్యక్తులు, కోల్‌కతాలోని నకుడా మసీదు ప్రతినిధులు మైకుల తొలగింపును వ్యతిరేకించారు. సీఎంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం తన విధానంపై స్థిరంగా ఉండటం గమనార్హం. ఇలాంటి వ్యతిరేకత రాజకీయ ధ్రువీకరణకు దారితీసే అవకాశం ఉంది. అయితే చట్టం ముందు అందరూ సమానమనే సూత్రాన్ని నొక్కి చెప్పడం ఈ విధానం యొక్క ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. సువేందు అధికారి పాలన ఇప్పటికే యోగి, హిమంత మాదిరిగా చట్టం, శాంతి, అభివద్ధి నినాదంపై దృష్టి సారించింది. కొన్ని నెలల్లోనే పాత సమస్యలపై చర్యలు తీసుకోవడం ప్రజల్లో ఆశను కలిగించవచ్చు. అయితే దీర్ఘకాలిక విజయం చట్ట అమలు సమానత్వం, పక్షపాత రహిత విధానం, సామాజిక సామరస్యం కాపాడటంపై ఆధారపడి ఉంటుంది. వ్యతిరేక పార్టీలు, మత సంస్థల నుంచి వచ్చే ఒత్తిడిని సమర్థవంతంగా నిర్వహించగలిగితే బెంగాల్ రాజకీయాల్లో కొత్త ధోరణి నెలకొనే అవకాశం ఉంది.



# సెలబ్రెటీలకు ఫుడ్ సేఫ్టీ వార్నింగ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:** కొన్ని సంస్థలు, కంపెనీలు ప్రచారం చేసుకునేందుకు సోషల్ మీడియాను ఎంచుకుంటున్నాయి. ఇందులోని ఇన్ ఫ్లుయెన్సర్స్ సైతం ఆదాయం పెంచుకునేందుకు కొన్ని ప్రత్యేక ప్రొడక్ట్స్ ను విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. చాలా మంది ఇలా వాటి గురించి తెలుసుకొని వస్తువులు, ఆహార పదార్థాలు కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రచారం చేసేవారిని 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా హెచ్చరించింది. ఉత్పత్తుల గురించి పూర్తిగా తెలుసుకోకుండా ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. దీని గురించి పూర్తి వివరాల్లోకి వెళితె..కొందరు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆహార పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. అయితే ఉత్పత్తుల గురించి ధ్రువీకరించని ఆరోగ్య ప్రయోజనాలను ప్రచారం చేయొద్దని స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆహారపదార్థాల్లోని 'ఇమ్యూనిటీ' 'పోషకాలు అధికంగా ఉన్నాయి' వంటి వాటి గురించి నిజానిజాలను పరిశీలించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ హెచ్చరించింది. ఒక ఉత్పత్తిని ప్రమోట్ చేస్తున్నప్పుడు దాని ప్యాకేజింగ్‌పై ఉన్న వివరాలు, పోషక విలువలు, తయారీదారు చేస్తున్న ఆరోగ్య క్లెయిమ్స్ వంటి అంశాలను ఇన్‌ఫ్లుయెన్సర్లు పరిశీలించాలి. కేవలం బ్రాండ్ చెప్పిందని లేదా డబ్బులు తీసుకుని నిర్ధారణ లేని ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు చెప్పకూడదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనల ప్రకారం ఫుడ్‌కు సంబంధించిన క్లెయిమ్స్ నిజమైనవి, స్పష్టమైనవి, అర్థవంతమైనవి, వినియోగదారులను తప్పుదోవ పట్టించనివిగా ఉండాలి. ఒక ఆహార పదార్థం లేదా దానిలోని ఏదైనా పదార్థం ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని చెప్పే హెల్త్ క్లెయిమ్స్‌కు తగిన శాస్త్రీయ ఆధారాలు ఉండాలి. గతంలో కూడా ఫుడ్ ప్రొడక్టులపై తప్పుడు లేదా అతిశయోక్తి ఆరోగ్య క్లెయిమ్స్ అనుమతించబోమని స్పష్టం చేసింది. ఒక ఉత్పత్తిలో ప్రొటీన్, విటమిన్లు లేదా మరేదైనా పోషక పదార్థం ఉన్నంత మాత్రాన దాన్ని మొత్తం ఆరోగ్యకరమైన ఆహారంగా చిత్రీకరించడం సరైనది కాదు. ఇదొక్కటే 'ఆరోగ్యకరమైనది'గా చూపకుండా, సమతుల్య ఆహారం, పండ్లు, కూరగాయలు, శారీరక శ్రమ వంటి అంశాలతో కలిపి ఆహారాన్ని చూడాల్సి ఉంటుంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు లక్షలాది మంది ఫాలోవర్లు ఉంటారు. వారు ఒక ఫుడ్‌ను ఇమ్యూనిటీ పెంచుతుంది.. ప్రొటీన్ లోపాన్ని తీరుస్తుంది లేదా ఆరోగ్యానికి ఎంతో మంచిది అని చెబితే, చాలామంది వినియోగదారులు దాన్ని నిపుణుల సలహాగా భావించే అవకాశం ఉంటుంది. అందుకే ఫాలోవర్లను ప్రభావితం చేసే వ్యక్తులు ఉత్పత్తి గురించి చెప్పే ప్రతి ఆరోగ్య క్లెయిమ్ విషయంలో మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.




## మహబూబ్‌నగర్‌లో..
# బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

**మహబూబ్ నగర్, ఆగస్టు 14:** మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి పరిధిలో 416.18 ఎకరాల భూమిని గుర్తించి సర్వేలు నిర్వహిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చర్చల తర్వాత ఈ ప్రాజెక్టుపై ముందడుగు పడింది. ఈ యూనిట్ ద్వారా స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో రక్షణ రంగానికి సంబంధించిన ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్ ఏర్పాటు ప్రక్రియ వేగం పుంజుకుంటోంది. దేవరకద్ర మండలంలోని మూడు గ్రామాల్లో ఈ యూనిట్ కోసం - మిగతా3లో



# ఓటుకు నోటు కేసులో స్పెషల్ బెంచ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 14:**కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో.. పకడ్బందీ ప్రణాళికతో.. ఏసీబీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడంతో వారు అప్పటి టిడిపి ఎమ్మెల్యే రేవంత్ రెడ్డిని పట్టుకున్నారు. ఓటుకు నోటు కేసులో అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత తెలంగాణలో రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రకే పరిమితం కావలసి వచ్చింది. నాడు జరిగిన ఈ సంఘటన తెలంగాణ రాజకీయాలను సమూలంగా మార్చేసింది.నాడు నమోదైన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది. అనేక ప్రకంపనాలను సృష్టించింది. చివరికి ఈ కేసులో ఇప్పుడు మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసు విచారణలో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసు విచారణను మళ్లీ మొదటికి తీసుకువచ్చింది. గతంలో ఈ కేసును ధర్మాసనం విచారించింది. తీర్పును రిజర్వ్ చేసింది.. అనేక రకాలుగా వాదనాల విన్న ఈ ధర్మాసనంలోనే న్యాయమూర్తులు ఇటీవల పదవి విరమణ చేశారు. నిబంధనల ప్రకారం చూసుకుంటే ఈ కేసు వాదనలను మళ్లీ మొదటి నుంచి వినాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరించారు. ఈ క్రమంలో ఈ కేసు మళ్లీ విచారణకు వస్తుందని సమాచారం.పది సంవత్సరాల క్రితం ఓటుకు నోటు కేసు నమోదయింది. నాడు ఈ కేసు పై నమోదైన పిటిషన్ల పై



సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా విచారణ కొనసాగింది. ఈ వాదనలను విన్న ధర్మాసనంలోని న్యాయమూర్తులు పదవీ విరమణ చేశారు. ఫలితంగా సాంకేతిక కారణాల నేపథ్యంలో విచారణ కొంత పరిధిలో ఆగిపోయింది. రోస్టర్ ప్రక్రియలో భాగంగా ఈ కేసు ఇటీవల సీజేఐ ముందుకు వచ్చింది. న్యాయ ప్రక్రియ.. ఇతర నియమాల నేపథ్యంలో పాత వాదనలను తాము లెక్కలోకి తీసుకోలేమని సూర్యకాంత వివరించారు. ఈ ప్రకారం కొత్త బెంచ్ ఈ కేసును విచారించాల్సి ఉంటుంది. ఈ కేసులో మొదటి నుంచి వాదనలు వింటామని సిజెఐ ప్రకటించారు. మరోవైపు ఈ కేసు రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం ఉన్నది. అందువల్ల దీనిని వేగంగా విచారించడానికి ప్రత్యేకమైన ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు సిజెఐ వెల్లడించారు. నూతన ధర్మసనం ఏర్పాట తర్వాత.. వాదులు.. ప్రతిభాదులు తరపున న్యాయవాదులు మళ్లీ తమ వాదనలు వినిపించాల్సి ఉంటుంది. ఇన్నాళ్లపాటు ఈ కేసులో ఎటువంటి కదలిక లేదు. ఈ క్రమంలో ఈ కేసులో సర్వోన్నత న్యాయస్థానం రీ హియరింగ్ కు వస్తున్నామని సంకేతాలు ఇవ్వడంతో.. పొలిటికల్ గా హీట్ పెరిగింది.ఈ కేసు సంబంధించి మీడియా నుంచి అనేక రకాలుగా ప్రస్తుతం ముఖ్యమంత్రి కి ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆ ప్రశ్నలకు ఆయన నేరుగాని సమాధానం చెప్పారు. తనను ఏ విధంగా ఇరికించారు.. దాని వెనుక ఉన్న మనుషులు ఎవరు.. వారి ప్రయోజనాలు ఏంటి అనే విషయాలను రేవంత్ రెడ్డి అనేక పర్యాయాలు వివరించారు. ఈ కేసు కు సంబంధించి తనలో ఎటువంటి ఆందోళన లేదని.. తీర్పు తనకు అనుకూలంగానే వస్తుందని అనేక సందర్భాల్లో రేవంత్ చెప్పారు. ఇప్పుడు సుప్రీంకోర్టు ముందుకు ఈ కేసు మళ్ళీ వస్తున్న నేపథ్యంలో.. రేవంత్ వర్గీయులు పెద్దగా ఆందోళన చెందడం లేదు. కంగారు పడడం లేదు. నాటి ప్రభుత్వం ఏకపక్షంగా ఈ కేసు నమోదు చేసిందని.. ఇందులో స్థాయికి మించి వ్యవహరించిందని.. పొలిటికల్ గా రేవంత్ రెడ్డికి నష్టం చేయాలని చూశారని.. చివరికి వారే నష్టపోయారని రేవంత్ రెడ్డి వర్గీయులు అంటున్నారు.

## ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల ద్వారా

# వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 14:**తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలను మాన్యువల్ విధానం నుంచి ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లకు మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలి దశలో 15 ఏటీఎస్‌లను ఏర్పాటు చేయనున్నారు. ట్రక్కులు, బస్సులు, కార్లు, జీపులు తదితర వాహనాలను సెన్సర్ల ద్వారా పరీక్షిస్తారు. బ్రేకింగ్ సామర్థ్యం, ఇంజిన్ పనితీరు, కాలుష్య ఉద్గారాలు, ఇతర సాంకేతిక ప్రమాణాలను మెషీన్లు ఆటోమెటిక్‌గా అంచనా వేస్తాయి. ఫలితాలను కేంద్ర వాహన్ పోర్టల్‌లో నేరుగా నమోదు చేస్తారు. కాగా, ఈ ఏటీఎస్ కేంద్రాలను 37 ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో వాహనాల రోడ్డు ఫిట్‌నెస్ పరీక్షల విధానంలో కీలక మార్పు రానుంది. ఇప్పటివరకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో మాన్యువల్‌గా నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ టెస్టుల స్థానంలో ఇకపై ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) అందుబాటులోకి రానున్నాయి. వాహనం రోడ్డుపై నడవడానికి సురక్షితంగా ఉందా లేదా అన్నది ప్రత్యేక సెన్సర్లు, యంత్రాల ద్వారా శాస్త్రీయంగా పరీక్షించి ధ్రువీకరణ పత్రం జారీ చేయనున్నారు. రవాణా శాఖ తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 15 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వీటి ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు రవాణా శాఖ వర్గాలు వెల్లడించాయి. తొలి దశలో ఏర్పాటు చేసే కేంద్రాలను డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్



కార్యాలయాల పరిధిలో రెండు క్లస్టర్లుగా ఏర్పాటు చేయనున్నారు. అనంతరం ఈ నెట్‌వర్క్‌ను మొత్తం 37 ప్రతిపాదిత ప్రాంతాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది.ఏటీఎస్‌లో వాహనాన్ని ప్రత్యేక సెన్సర్లతో కూడిన పరికరాలపై నడిపిస్తారు. ఈ ప్రక్రియలో బ్రేకులు ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయి, ఇంజిన్ పనితీరు ఎలా ఉంది, వాహనం నుంచి వెలువడుతున్న కాలుష్య ఉద్గారాలు నిర్ణీత ప్రమాణాల్లో ఉన్నాయా వంటి అంశాలను ఆటోమేటిక్‌గా పరీక్షిస్తారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన ఇతర సాంకేతిక ప్రమాణాలను కూడా యంత్రాల ద్వారా పరిశీలిస్తారు. భారీ, మధ్యతరహా వాహనాలతో పాటు లైట్ మోటార్ వెహికల్స్ కూడా ఏటీఎస్ పరిధిలోకి రానున్నాయి. ట్రక్కులు, బస్సులు వంటి హెవీ, మీడియం వాహనాలతో పాటు కార్లు, జీపులు తదితర తేలికపాటి వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. దీంతో వాహన రకం ఆధారంగా అవసరమైన సాంకేతిక ప్రమాణాలను సమగ్రంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు మాన్యువల్‌గా జరుగుతున్నాయి. ఈ విధానంలో కొన్నిసార్లు వాహనాన్ని పూర్తిస్థాయిలో సాంకేతికంగా పరిశీలించకుండానే పైపైనే చూసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనం నిజంగా రోడ్డు ప్రయాణానికి సురక్షితమైనదేనా అన్న అంశంపై మరింత కచ్చితమైన అంచనా అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫిట్‌నెస్ పరీక్షలను ఆటోమెటిక్ చేయం ద్వారా పారదర్శకతను పెంచాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీఎస్‌లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు నేరుగా కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖకు చెందిన వాహన్ పోర్టల్‌లో అప్‌లోడ్ అవుతాయి. దీంతో పరీక్షల రికార్డులు డిజిటల్‌గా నమోదవుతాయి. వాహనం ఫిట్‌నెస్‌కు సంబంధించిన సమాచారాన్ని భవిష్యత్‌లో సులభంగా పరిశీలించే అవకాశం ఉంటుంది.

# టీటీడీ ఎస్వీబీసీకి కొత్త ఛైర్మన్ శ్రీధర్ వర్మ

**తిరుమల, ఆగస్టు 14:**టీటీడీ ఎస్వీబీసీ (శ్రీవేంకటేశ్వర భక్తి ఛానల్)కి ఛైర్మన్‌గా శ్రీధర్ వర్మ నియమితులయ్యారు. తిరుపతికి చెందిన ఆయన టీడీపీ స్టేట్ మీడియా కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. శ్రీధర్ వర్మ ఇవాళ టీటీడీ ఈవో రవిచంద్ర నుంచీ నియామకానికి సంబంధించి ఉత్తర్వులను అందుకోబోతున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈనెల 22వ తేదీన ఎస్వీబీసీ ఛైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. పార్టీకి విధేయుడిగా ఉన్న శ్రీధర్ వర్మకు ఎస్వీబీసీ ఛైర్మన్ పదవి దక్కింది.. గతవారమే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.తిరుమల శ్రీవారి చెంత సేవ చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తిరుమల శ్రీవారికి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని పార్టీ పెద్దల్ని కోరానని.. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో పాటు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్వీబీసీపై అవగాహన పెంచుకుని ఛానల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పలువురు టీడీపీ నేతలు శ్రీధర్ వర్మను కలిసి సత్కరించారు.శ్రీధర్ వర్మ తండ్రి ఎన్టీఆర్ రాజుగా అందరికి సుపరిచితం. ఆయన అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘాల అధ్యక్షుడిగా పనిచేశారు.

## స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా రేషన్ కార్డుదారులకు

# స్మార్ట్ కార్డులను పంపిణీ..

- మొదటి పేజీ తరువాయి

నిర్వహణకు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సదస్సు నిర్వహించాలని ప్రాథమికంగా తేదీలను నిర్ణయించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి అధ్వర్యంలో సబ్ కమిటీతో పాటు సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత ఏడాది తెలంగాణ రైజింగ్ 2047 విజన్ను ఆవిష్కరించినట్లే.. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ థీమ్ తో సదస్సు నిర్వహణకు ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీ ప్లాన్ ఆవిష్కరించనుంది. ప్రధానంగా మన రాష్ట్రంలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మా రంగాల్లో పరిశ్రమలు, పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈసారి సదస్సు జరుగుతుంది. వివిధ రంగాల్లో ఇప్పటికే తెలంగాణ స్టార్టప్ లు, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణలకు సంబంధించి ఎగ్జిబిషన్, స్టాళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. వానాకాలం పంటకు సంబంధించి ఏడు రకాల సన్న ధాన్యం సాగును ప్రోత్సహించి, ఆ ఏడు రకాల సాగును పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీ భవనాలు, రైతు వేదికల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది నుంచి ఈ ఏడు రకాల సన్నాలకే రూ.500 బోనస్ చెల్లించాలని కేబినేట్ తీర్మానించింది. యాసంగి ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి 81.16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులకు కనీస మద్దతు ధర చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అందులో 63.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కేంద్ర ప్రభుత్వం సేకరిస్తుంది. మిగతా 17.54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినేట్ ఆమోదం తెలిపింది. ఇటీవల మొక్కజొన్న వేలంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం రాబట్టుకున్న నేపథ్యంలో ఈ మిగులు ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.2389 బేసిక్ ప్రైస్ నిర్ణయించి.. ఈ వేలం (వ-ూబఫ్ఱశీఅ) ద్వారా ధాన్యం అమ్మాలని కేబినేట్ నిర్ణయించింది. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలు సాంకేతిక విద్యా శాఖ పరిధిలో ఉన్నాయి. వీటిని తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ నుంచి తొలగించి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (×ూఖ) పరిధిలో చేర్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రస్తుతం పరిశ్రమల శాఖ పరిధిలో ఉన్న వీటన్నింటినీ ఇకపై శక్తి శాఖ పరిధిలోకి విలీనం చేసేందుకు క్యాబినెట్ తీర్మానించింది. ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, బోథ్, సిర్పూర్, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో తొలివిడతగా 113 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈరోజు కొత్తగా ఆమోదించిన 7 స్కూళ్లతో కలిపి ఇప్పటివరకు 86 యంగ్ ఇండియా రెసిడెన్సియల్ స్కూల్ కాంప్లెక్స్ లకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వీలైనంత తొందరగా స్థల సేకరణ చేసి, నిర్మాణాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన చోట వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో కాలుష్యాన్ని నియంత్రించి.. హైదరాబాద్ ను గ్రీన్ సిటీగా మార్చేందుకు రాష్ట్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్లో ప్రస్తుతం 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలున్నాయి. వీటిని ఈవీ (విద్యుత్తు వాహనాలుగా) మార్చేందుకు రూ.200 కోట్లతో ప్రత్యేక పథకం (తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్) అమలుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన ఆటో డ్రైవర్లకు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా రూ.1 లక్ష 50 వేలు సబ్సిడీ అందిస్తారు. ప్రస్తుతం ఉన్న ఆటోకు విద్యుత్ కిట్ అమర్చుకోవటం లేదా పాత వాహనాన్ని స్క్రాప్ చేసి కొత్త విద్యుత్ ఆటో కొనుగోలు చేసుకునేందుకు ఈ పథకం ద్వారా అవకాశం కల్పించనున్నారు. హైదరాబాద్ సిటీ పరిధిలో ఉన్న కాలుష్య కారక పరిశ్రమలను సిటీ శివార్లకు తరలించేందుకు ఉద్దేశించిన ఎ×ూ పాలసీ దరఖాస్తుల గడువును మరో 3 నెలలు పొడిగించేందుకు కేబినెట్ నిర్ణయం. దరఖాస్తుదారుల విజ్ఞప్తుల మేరకు అక్టోబర్ 31 వరకు అప్లై చేసుకునేందుకు అవకాశం కల్పించింది. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఫేజ్-×× పనుల కోసం రూ. 2,100 కోట్ల అంచనా వ్యయానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో దాదాపు లక్ష ఎకరాలకు సాగు నీరు, ఆ ప్రాంతంలో తాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు ఈ ఎత్తిపోతల నుంచి అందుతుంది. గూడెం దొడ్డి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.19 టీఎంసీ నుంచి 15 టీఎంసీలకు పెంచటంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెంట్ ను నియామకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది

## గ్రేటర్ పోరులో పార్టీలు...

- మొదటి పేజీ తరువాయి

వేయడం ఏంట నేది చర్చకు దారితీస్తోంది. దీనికి ప్రధానంగా ఒకపార్టీపై మరో పార్టీ చేసుకుంటున్న విమర్శలు.. వేసుకుం టున్న నిందలే కారణమని అంటున్నారు పరిశీలకులు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయడం లేదని, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను కూడా నీరు గారుస్తోందని, రైతులు ఉసూరుమంటున్నారని.. బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్న విషయం తెలిసిందే. దీని నుంచి తమను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇక, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం.. ముఖ్యంగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధిపతి కేసీఆర్ కేంద్రంగా సాగుతున్న విమర్శలకు అడ్డుకట్ట వేయాలన్నది బీఆర్ఎస్ వ్యూహంగా ఉంది. ఇక, ఉమ్మడి సమస్యల విషయానికి వస్తే.. క్షేత్రస్థాయిలో చిన్నా చితకా పార్టీల ఆవిర్భావం.. వాటి వల్ల తమ ఓటు బ్యాంకు ప్రభావితమయ్యే పరిస్థితిని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు లెక్కలు వేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు.. క్షేత్రస్థాయి కార్యకర్తలను కాపాడుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టాయి

## తెలంగాణలో ఆటోలు, క్యాబ్‌లు బంద్

- మొదటి పేజీ తరువాయి

చేయాలన్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని.. అందుకు తగిన విధంగా ఆటో మీటరు ఛార్జీలనూ పెంచాలంటున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఓలా, ఉబర్, ర్యాపిడోలకు బదులుగా కొత్త యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న రూ.12 వేలు పథకం అమలు అంశాన్ని పరిశీలించాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం పెద్దల్ని ఆటో డ్రైవర్ల సమస్యలపై ఇప్పటికే పలుమార్లు కలిసి విజ్ఞప్తులు చేశామని కార్మిక సంఘాల నేతలు గుర్తు చేశారు. గతంలో తాము ఒకరోజు సమ్మెకు దిగితే తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చినా ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు కాలేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ నెల 23 నుంచి ఆటో, క్యాబ్, స్కూల్ వ్యాన్ డ్రైవర్లు బంద్‌కు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో ఆర్టీసీ, కార్పొరేట్ సంస్థలకు ఈవీ ఆటోలు అందించే ప్రతిపాదనను వెంటనే నిలిపివేయాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 7.5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో సుమారు 2.5 లక్షల మంది ఉన్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం కొనసాగతుందున్నారు. మరి తెలంగాణ ప్రభుత్వం ఈ బంద్ అంశంపై ఎలా స్పందిస్తుందో చూడాలి

## తెలంగాణలోనూ మఖానా సాగు..

- మొదటి పేజీ తరువాయి

వ్యవసాయ శాఖ మంత్రి విజయ్‌కుమార్ సిన్హా హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో వ్యవసాయంలో అత్యాధునిక సాంకేతికత వినియోగం, రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు, కొత్త పంటల సాగు, ప్రాసెసింగ్ పరిశ్రమలు, మార్కెటింగ్ విధానాలపై విస్తృతంగా చర్చించారు. తెలంగాణలో ఆయిల్‌పామ్ సాగు విస్తరణ, నర్సరీల అభివృద్ధి, పామాయిల్ ప్రాసెసింగ్ మిల్లుల ఏర్పాటుపై బిహార్ మంత్రి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. రాష్ట్రంలో 2025--26లో సుమారు 3.1 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరిగి 74 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ ఉత్పత్తి అయినట్లు అధికారులు వెల్లడించారు. ఈ నమూనాను పరిశీలించేందుకు బిహార్ నుంచి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని పంపనున్నారు.మరోవైపు బిహార్‌లో విస్తృతంగా సాగయ్యే మఖానా పంటపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ముడి ఉత్పత్తిగా కాకుండా ప్రాసెసింగ్, బ్రాండింగ్, విలువ జోడింపుతో మార్కెట్ చేయడంపై బిహార్ అనుభవాన్ని అధ్యయనం చేయాలని తెలంగాణ భావిస్తోంది. బిహార్‌లో పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాల కోసం ప్రత్యేక పంట క్లస్టర్లను అభివృద్ధి చేసిన విధానాన్ని ఆ రాష్ట్ర అధికారులు వివరించారు. ఈ పరస్పర సహకారం వల్ల రెండు రాష్ట్రాల రైతులకు కొత్త పంటలు, సాంకేతికతలు, ప్రాసెసింగ్ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. తెలంగాణకు మఖానా వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుకు మార్గం సుగమం కాగా.. బిహార్‌కు ఆయిల్‌పామ్ వంటి వాణిజ్య పంటను విస్తరించే అవకాశం లభిస్తుంది. ఇరు రాష్ట్రాల శాస్త్రవేత్తలు, రైతుల బృందాల పర్యటనల ద్వారా ఉత్తమ పద్ధతుల మార్పిడి మరింత వేగవంతం కానుంది.

## మహబూబ్‌నగర్‌లో.. బ్రహ్మోస్ మిస్సైల్ యూనిట్

- మొదటి పేజీ తరువాయి

416.18 ఎకరాల భూమిని అధికారులు గుర్తించి, క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూముల సర్వే విజయవంతంగా పూర్తికాగా.. ప్రస్తుతం పట్టా భూముల పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో రక్షణ రంగ తయారీ కేంద్రం ఏర్పాటు దిశగా ఇది అత్యంత కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు.గత ఏడాది జూలైలో డీఆర్‌డీవో అధికారులు మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించి భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. రవాణా సదుపాయాలు, రోడ్డు, రైలు మార్గాలు అనుకూలంగా ఉండటంతో పాలమూరు ప్రాంతం బ్రహ్మోస్ యూనిట్ ఏర్పాటుకు సరిగ్గా సరిపోతుందని భావించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సమావేశమై ఈ ప్రాజెక్టుపై ప్రత్యేకంగా చర్చించారు. కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించడంతో రాష్ట్ర యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి భూసేకరణ ప్రక్రియను ముమ్మరం చేసింది.దేవరకద్ర మండలంలోని జీనుగురాల, చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల్లో 416.18 ఎకరాలను గుర్తించి తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. చౌదర్‌పల్లిలో సర్వే నంబర్లు 295, 296 సహా బస్వాయిపల్లి, జీనుగురాల గ్రామాల్లో పట్టా భూముల వివరాలను సేకరించారు. సర్వేకు ముందే గ్రామ పంచాయతీల ద్వారా రైతులకు సమాచారం అందించి వారి సమ్మతితోనే పరిశీలనలు జరుపుతున్నారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి రైతులకు ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్ని నిర్ణయించనున్నారు.పాలమూరులో బ్రహ్మోస్ తయారీ కేంద్రం ఏర్పాటైతే ఈ ప్రాంత ఆర్థిక రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ప్రధాన యూనిట్‌తో పాటు అనుబంధ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, లాజిస్టిక్స్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఐటీఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, నాణ్యతా ప్రమాదాల విభాగాల్లో సాంకేతిక నిపుణులతో పాటు అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల్లో స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## బతికుండగానే భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకున్న భార్య

**విజయవాడ, ఆగస్టు 14:**వితంతు పింఛన్ కోసం ఓ భార్య బతికున్న తన భర్త పేరు మీదే డెత్ సర్టిఫికెట్ తీసుకుంది. అయితే, ఈ విషయం బతికున్న భర్తకు తెలియడం.. అధికారుల వరకూ ఈ విషయం వెల్లడంతో ఖంగుతిన్నారు. అసలు భర్త ఎలా చనిపోయాడో చెప్పాలంటూ ఓ ఆరు ప్రశ్నలతో కూడిన నోటీసులను భార్యకి అధికారులు అందజేశారు. దాంతో చేసిన తప్పును ఆమె ఒప్పుకోక తప్పలేదు. అయితే, దీన్ని సీరియస్‌గా తీసుకున్న అధికారులు ఆమెపై కేసు నమోదు చేయాలంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఈ ఘటన కృష్ణా జిల్లా పెనమలూరులో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది.సమాజం రోజురోజుకూ దారుణంగా మారిపోతుంది. మనకు కావాల్సిన దాని కోసం జనాలు ఎంతకైనా తెగిస్తున్నారు. ఇక్కడో భార్య వితంతు పింఛన్ కోసం భర్త బతికుండగానే డెత్ సర్టిఫికెట్ తీసుకుంది. భార్యే వచ్చి తన భర్త చనిపోయాడు అనడంతో అధికారులు కూడా మరణ ధ్రువీకరణ పత్రం అందించారు. అయితే, చివరకు ఆ భర్త వచ్చి నేనెక్కడ చనిపోయానంటూ అధికారులను అడగడం.. క్రాస్ వెరిఫికేషన్ చేయడంతో ఆ భార్య చేసిన పని బయటపడింది.కృష్ణా జిల్లా పెనమలూరులోని కానూరు శివాలయం రోడ్డులో నివసించే యర్రంశెట్టి రమాదేవి, మురళీకృష్ణ భార్యభర్తలు. రమాదేవి తన భర్త మురళీకృష్ణ మరణించాడు అంటూ తాడిగడప పురపాలికలో మరణ ధ్రువీకరణ పత్రం కోసం అర్జీ పెట్టుకున్నారు. అక్కడి అధికారులు కూడా భార్యే వచ్చి అర్జీ చేసుకోవడంతో సర్టిఫికెట్ కూడా ఇచ్చారు.అయితే ఈ వ్యవహారం భర్త మురళీకృష్ణకు ఇటీవలే తెలియడంతో అతను అధికారులకు విషయం చెప్పాడు. దాంతో తాడిగడప పరపాలక సంఘం అధికారులు మురళీకృష్ణ ఏ పరిస్థితుల్లో మరణించారో తెలపాలంటూ ఆరు ప్రశ్నలతో కూడిన నోటీసులను రమాదేవికి అందజేశారు. అయితే, భర్త బతికుండటం.. అక్రమంగా డెత్ సర్టిఫికెట్ తీసుకోవడంతో ఏం చేయాలో తెలియన రమాదేవి తప్పును ఒప్పుకొందని అధికారులు తెలిపారు.ఈ వ్యవహారంపై తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్ నజీర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యంతో కలిసి ఎస్ఐ ఉషారాణికి ఫిర్యాదు చేశారు. రమాదేవిపై కేసు నమోదు చేయాలంటూ కమిషన్ కోరారు. తాను తప్పు చేసినట్లు రమాదేవే నేరుగా ఒప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేయాలని కోరారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేస్తామని ఎస్సై ఉషారాణి తెలిపారు.

వార్తాతరంగాలు



## ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారు

**ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**



**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం బాధాకరమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు. రవీంద్రభారతిలో కళాకారుడు ఏపూరి సోమన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానంపై రూపొందించిన పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి రాజగోపాల్‌రెడ్డి హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసారిగా గళం విప్పింది తానేనని, అందుకే అప్పటి సీఎం కేసీఆర్ తనను లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. మునుగోడు ఉపఎన్నికలో తనను ఓడించేందుకు 100 మంది ఎమ్మెల్యేలను రంగంలోకి దించినా, దానిని కూడా తాను ఒక విజయంగానే భావిస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లక్షల కోట్ల రూపాయలను దోచుకుంటోందని ఆయన ఆరోపించారు. ఏపూరి సోమన్న పాడిన 'ఎవరి పాలైందిరో తెలంగాణ' పాటలో ప్రస్తావించిన పరిస్థితులే నేటికీ కొనసాగడం బాధాకరమన్నారు. సోమన్న రూపం, గళం చూస్తే దివంగత ప్రజాగాయకుడు గద్దర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు. ఏపూరి సోమన్న వంటి కళాకారులు, ఉద్యమకారులకు తాను అండగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో సోమన్న చట్టసభల్లో అడుగుపెడతారని రాజగోపాల్‌రెడ్డి అన్నారు. రాజకీయాలను మార్చే శక్తి తనకు ఉందని, నిజాయితీ కలిగిన వారు తన వెంట నిలిస్తే తమిళనాడు తరహాలో రాజకీయ మార్పు తీసుకురాగలమని ధీమా వ్యక్తం చేశారు. తాను గెలిపించిన ఓ ఎమ్మెల్యే కులం కార్డును అడ్డుపెట్టుకుని అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. పదవులు కిరీటాలు కావని, ప్రజలకు సేవ చేసే అవకాశం మాత్రమేనని రాజగోపాల్‌రెడ్డి హితవు పలికారు.

## దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో దంచికొడుతున్న వర్షాలు..



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వానలు దంచికొడుతున్నాయి. ఒడిశాలోని మయూర్భంజ్ జిల్లాలో 24 గంటలుగా ఎడతెరిపి లేని వాన కురుస్తోంది. భారీ వర్షాలతో ఒడిశాలోని పలు ప్రాంతాల్లో వరదలు పోటెత్తాయి. జమ్మూ కశ్మీర్లోని భదర్వాలో వడగండ్లతో కూడిన భారీ వర్షం కురుస్తోంది. ఆకస్మిక వర్షంతో 'శ్రీనగర్-లేహ్' హైవేపై కొండచరియలు విరిగిపడ్డాయి. అటు, హిమాచల్ప్రదేశ్లోని ధర్మశాలలో భారీ వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు రికవరీ

**హైదరాబాద్:** పాతబస్తీ ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితుల ఫిర్యాదు రావడంతో అ ఫిర్యాదు పై ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, ఛత్రినాక డిఐ, కృష్ణమూర్తి నాయుడు, డిటెక్టివ్ ఎస్సై, మహమ్మద్ మాజీద్ అలీ, తో పాటు క్రైమ్ టీం సిబ్బంది కలిసి ,మొబైల్ ఫోన్ యొక్క ఐ,ఎం,ఈ, ఐ ,నెంబర్ ప్రకారం కొత్తగా వచ్చిన (సి,ఐ,ఆర్ )ప్రోటల్ ద్వారా (21)ఫోన్లను రికవరీ చేసి వాటికి సంబంధించిన వ్యక్తులను ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, డిఐ, కృష్ణమూర్తి నాయుడు చేతుల మీదుగ (21) మంది బాధితులకు సెల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఛత్రినాక ఇన్ స్పెక్టర్ కోటేశ్వరరావు, మాట్లాడుతూ ప్రజలు పోగొట్టుకున్న వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడం వల్ల ద్వారా రికవరీ చేయడం సులభంగా అవుతుందని అన్నారు.

## రేషన్ బియ్యం పంపిణీ సొమ్మొకడిది సోకొకడిది అన్నట్టు ఉంది.

**రేషన్ కార్డులపై ఫోటోలు లేకుండా పంపిణీ చేయాలి.**

**లేదంటే ప్రధానమంత్రి ఫోటో కూడా పెట్టాలి.**

**రేషన్ బియ్యానికి ఎక్కువ డబ్బులు ఇస్తుంది కేంద్రమే.**

**ఎంపి ఈటల రాజేందర్**



బీజేపీ తెలంగాణ ఎంపీలుగా మేము కేంద్రమంత్రులను కలిసి అనేక సమస్యల మీద వినతులు అందించాం. జవహర్ నగర్ డంప్ యార్డు, హైదరాబాద్ మెట్రో, నేషనల్ హైవేలు, ట్రిపుల్ ఆర్ ల నిర్మాణం వేగవంతం చేయాలని కోరాము. రైల్వే మంత్రిని కలిసి రైలుపట్టాల మీద ప్రమాదాలు జరగకుండా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, =ాదీ, =ఖదీ సంఖ్య పెంచాలని కోరాము. ఫుట్ ఓవర్ బ్రిడ్జులు సాధ్యమైనన్ని ఎక్కువ నిర్మాణం చేయాలని కోరాము. దేశవ్యాప్తంగా కూడా ఈ సమస్య పరిష్కారం చేస్తామన్నారని ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.డబుల్ బెడ్ రూం ఇళ్ళ నిర్మాణం కోసం కేంద్రం డబ్బులు ఇస్తే కూడా కేసీఆర్ తీసుకోకుండా అహంకారపూరితంగా వ్యవహరించారు. రేవంత్ రెడ్డి డబ్బులు తీసుకున్నాడు కానీ ఇందిరమ్మ బొమ్మ మాత్రమే వేసుకుంటాడట. ఒక వైపు నిధులకోసం డిల్లీకి పోతున్నారు.. తెచ్చుకుంటున్నారు. కానీ కేంద్రం ఇస్తుంది అని మాత్రం బయటికి చెప్పడం లేదు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ కింద దేశవ్యాప్తంగా బిపిఎల్ కింద ఉన్న ప్రజలకు రేషన్ బియ్యం అందిస్తుంది. మన రాష్ట్రంలో 57 లక్షల రేషన్ కార్డులు.. 1 కోటి 91 లక్షల మందికి 9 లక్షల 55 వేల మెట్రిక్ టన్నులు బియ్యం ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున 49.4 లక్షల రేషన్ కార్డులకు 1 కోటి 50 లక్షల మందికి 9 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇస్తుంది. రాష్ట్రం కంటే కేంద్రం ఎక్కువ మందికి బియ్యం ఇస్తుంది. మోడీ ప్రభుత్వం బియ్యం ఉచితంగా ఇస్తుంటే.. కార్డులు మాత్రం రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలు పెట్టి ఇస్తారట.. ఇదేం సంస్కారం. మీ తాత జాగీరా ? ఈ కార్డులు ఇవ్వడానికి ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టారు. మీరు పోయి కొత్త ప్రభుత్వం వస్తె మళ్ళీ కార్డులు ఇస్తారా ? కార్డులు శాశ్వతంగా ఉంటాయి మీ ప్రభుత్వం కాదు. ఇప్పుడు కార్డులు లేకపోయినా బియ్యం ఇస్తున్నారుగా.. ఎందుకు ఇంత ఖర్చు పెట్టడం మీ ఫోటోల కోసమా ? భారత ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర ప్రభుత్వం సహాయంతో అని రాసి ఫోటోలు లేకుండా కార్డులు ఇవ్వండని సూచించారు.

## కోడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో అవకతవకలు, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ రికార్డుల తారుమారు

**లోకాయుక్తకు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల ఫిర్యాదు**

**హైదరాబాద్:** కోడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణలో అవకతవకలు, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ రికార్డుల తారుమారు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఎస్. రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. నారాయణపేట జిల్లా కలెక్టర్, నారాయణపేట ఆర్డీవోపై తెలంగాణ లోకాయుక్త చట్టం-1983లోని సెక్షన్ 9(2) కింద ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూసేకరణ నోటిఫికేషన్లు, లబ్ధిదారుల జాబితాల్లో మార్పులు చేయడంతో పాటు రెవెన్యూ, సర్వే రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నించిన రెవెన్యూ అధికారులను బదిలీ చేశారని, ప్రభావిత రైతులకు వారి భూముల సేకరణ, నష్టపరిహారంపై సరైన సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు.

# ఈ కేవైసీకి మరో రోజే...

**హైదరాబాద్, ఆగస్టు 14:** దేశవ్యాప్తంగా లిక్విడ్ పెట్రోలియం గ్యాస్ గ్యాస్ వినియోగదారులు ఈ కేవైసీ పూర్తి చేయాల్సింది. అయితే ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఇప్పటి వరకు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా మొబైల్ ఫోన్ నుంచి ఫేస్ అథెంటికేషన్ ద్వారా ఈ-కేవైసీ చేసుకునే సదుపాయాన్ని చమురు కంపెనీలు కల్పిస్తున్నాయి. ఎల్‌పీజీ కనెక్షన్ అసలైన వినియోగదారుడిదేనా? అనే విషయాన్ని ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధ్రువీకరణ ద్వారా నిర్ధారించడం ఈ-కేవైసీ ఉద్దేశం. ముఖ్యంగా ఉజ్వల పథకం వంటి ప్రయోజనాలు పొందుతున్న వినియోగదారులకు ఆధార్ ఆధారిత ధ్రువీకరణ ప్రాధాన్యత కలిగి ఉంది. ప్రభుత్వం గతంలో స్పష్టం చేసిన ప్రకారం.. ఈ ప్రక్రియను డెలివరీ సిబ్బంది ద్వారా, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ వద్ద లేదా సంబంధిత కంపెనీ మొబైల్ యాప్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.మొబైల్ ద్వారా ఈ-కేవైసీ చేయాలంటే మీ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇండేన్ వినియోగదారులు'ఇండియన్ ఆయిల్ వన్' యాప్, భారత్ గ్యాస్ వినియోగదారులు 'హలో బీపీసీఎల్', హెచ్‌పీ గ్యాస్





వినియోగదారులు 'హెచ్ పీ పే' యాప్‌ను ఉపయోగించవచ్చు. వీటితో పాటు ముఖ గుర్తింపు ద్వారా ఆధార్ ధ్రువీకరణ కోసం 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ అవసరం అవుతుంది.ఉదాహరణకు ఇండేన్ వినియోగదారులు అయితే ముందుగా 'ఇండియన్ ఆయిల్ వన్' యాప్‌ను ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అయిన తర్వాత 'ఈ కేవైసీ' అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అవసరమైన వివరాలను పరిశీలించిన తర్వాత నిబంధనలకు అంగీకారం తెలిపి ఫేస్ స్కాన్ ప్రారంభించాలి. ఆ సమయంలో 'ఆధార్ ఫేస్ ఆర్ డీ' యాప్ తెరుచుకుంటుంది. స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటిస్తూ కెమెరా ముందు ముఖాన్ని చూపిస్తే ఫేస్ అథెంటికేషన్ పూర్తవుతుంది. అనంతరం ఈ-కేవైసీ అభ్యర్థనను సబ్మిట్ చేయాలి. మిగతా గ్యాస్ వినియోగదారులు కూడా ఇలాగే పూర్తి చేసుకోవచ్చు.ఫేస్ అథెంటికేషన్ సమయంలో మొబైల్ కెమెరా స్పష్టంగా పనిచేసేలా చూసుకోవాలి. ముఖంపై ఎక్కువగా నీడ పడకుండా తగిన వెలుతురు ఉండాలి. కెమెరా ముందు ముఖాన్ని సరిగ్గా ఉంచి స్క్రీన్‌పై కనిపించే సూచనలను పాటించాలి. ఆధార్ బయోమెట్రిక్స్ లాక్ చేసి ఉంటే అథెంటికేషన్‌లో సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. అలాగే ఎల్ పీజీ కనెక్షన్‌కు సంబంధించిన మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు సరిగ్గా ఉండటం కూడా ముఖ్యమే.ఈ-కేవైసీ గడువుపై ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో భిన్నమైన తేదీలు ప్రచారంలో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 16 ఆగస్టు 2026 తేదీలను పేర్కొంటున్నారు. అయితే దీనిపై సంబంధిత డీలర్ ను సంప్రదించడం మంచిది.

# తెలంగాణకు జనసేన ముఖ్యమంత్రి!

**హైదరాబాద్, ఆగస్టు 14:** తెలంగాణ రాజకీయాల్లో జనసేన పాత్రపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పార్టీలకు ప్రత్యామ్నాయంగా జనసేన ఎదిగే అవకాశాలు ఉన్నాయని, వచ్చే మున్సిపల్, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు సూచించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన భవిష్యత్తుపై రాజాసింగ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 2014 నుంచి తెలంగాణ రాజకీయాల్లో శూన్యత నెలకొందని, జనసేన ఆ శూన్యతను భర్తీ చేసే అవకాశాలు ఉన్నాయని రాజాసింగ్ వ్యాఖ్యానించారు తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు ఉండదంటూ బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు రామచంద్రరావు ఇటీవల ప్రకటన చేసిన నేపథ్యంలో తాజాగా రాజాసింగ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. తెలంగాణలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ఆదరణ ఉందని, జనసేన పార్టీకి మద్దతు పెరుగుతోందని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా అత్యంత కీలక పరిణామానికి దారితీసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. రాజాసింగ్ ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనేది స్పష్టంగా తెలియకపోయినా, తెలంగాణ రాజకీయాల్లో జనసేనను ఓ వర్గం కోరుకుంటుంది అనే సంకేతాలు అందుతున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదగాలని తాను కోరుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులను పోటీకి పెట్టేలా జనసేనాని ఇప్పటి నుంచే ప్రణాళికలు రచించాలని రాజాసింగ్ కోరారు. ఇదే సమయంలో ఆయన తెలంగాణ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్షంలోని బీఆర్ఎస్, బీజేపీపైనా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధానంగా పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని రాజాసింగ్ ఆరోపించారు. అదే సమయంలో బీజేపీలో పరిస్థితులు ఏమంత బాగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్ల పెద్దగా ఒరిగిందేమీ లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో జనసేన గట్టిగా పనిచేస్తే తెలంగాణలో అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని సంచలన విశ్లేషణ చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చూసిన జనాలు విసిగిపోయారని, బీజేపీ అంతర్గత రాజకీయాలు వల్ల అధికారంలోకి వచ్చే అవకాశం లేదని



రాజాసింగ్ విశ్లేషించారు. ప్రస్తుతం ఈ అంశంపైనే ఎక్కువ చర్చ జరుగుతోందని, తన అంచనాల ప్రకారం వచ్చే ఎన్నికల్లో జనసేన ముఖ్యమంత్రి అయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా విస్తృత చర్చకు దారితీస్తున్నాయి. గత ఎన్నికల్లో బీజేపీ టికెట్ పై పోటీ చేసిన రాజాసింగ్ గత ఏడాది ఆ పార్టీకి రాజీనామా చేశారు. హిందుత్వవాదిగా ముద్రపడిన ఆయన తాజాగా చేసిన వ్యాఖ్యలతో జనసేనాని పవన్ కు దగ్గరయ్యే సంకేతాలిస్తున్నారని పరిశీలకులు అనుమానిస్తున్నారు.

# టార్గెట్ రేవంత్...


**హైదరాబాద్, ఆగస్టు 14:** తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఆరోపణల పర్వం కొత్త మలుపులు తిరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా నేరుగా విమర్శలు చేయడం కంటే, ఆయన కుటుంబ సభ్యులను, ముఖ్యంగా ఆయన సోదరులను టార్గెట్ చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పక్కా వ్యూహంతో ముందుకు





వెళ్తున్నారు. రేవంత్ రెడ్డి సోదరులు తిరుపతి రెడ్డి, కొండల్ రెడ్డిలు సాధారణంగా తెర వెనుక ఉంటారు. తిరుపతి రెడ్డి ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటుండగా, కొండల్ రెడ్డి వ్యాపార రంగంలో స్థిరపడ్డారు. వీరిద్దరినీ ఇప్పుడు బీఆర్ఎస్ తమ పొలిటికల్ అటాక్‌కు కేంద్రబిందువుగా మార్చుకుంది.తాజాగా ఈ పొలిటికల్ వార్ టెస్సరాక్ట్ అనే కంపెనీకి జరిగిన భూ కేటాయింపుల చుట్టూ తిరుగుతోంది. తెలంగాణ ప్రభుత్వం ఈ కంపెనీకి అత్యంత విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిందని, అసలు ఆ టెస్సరాక్ట్ కంపెనీ కొండల్ రెడ్డి బినామీ సంస్థ అని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ముఖ్యమంత్రి తన అధికారాన్ని ఉపయోగించి సొంత సోదరుడికి భారీగా లబ్ధి చేకూర్చారని ప్రతిపక్ష నేతలు సోషల్ మీడియా, మీడియాల ద్వారా పెద్ద ఎత్తున ప్రచార దాడికి దిగారు. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ స్థాయి స్కామ్‌లకు పాల్పడుతోందంటూ బీఆర్ఎస్ శ్రేణులు నెరేటివ్‌ను బలంగా జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాయి.బీఆర్ఎస్ చేస్తున్న ఈ తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టడంలో కాంగ్రెస్ పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోంది. పార్టీలోని సీనియర్ నేతలు, మంత్రులు ఎవరూ ఈ వివాదంపై పెద్దగా స్పందించకపోవడం ప్రతిపక్షాల ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాత్రమే ఈ అంశంపై స్పందిస్తూ ప్రభుత్వాన్ని డిఫెండ్ చేసే ప్రయత్నం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక విధానం ప్రకారం ఎలాంటి నిబంధనలతో భూములు కేటాయించారో, ఇప్పుడు కూడా సరిగ్గా అదే చట్టబద్ధమైన రూల్స్ పాటిస్తూ పారదర్శకంగా భూములు ఇచ్చామని, ఇందులో ఎలాంటి తప్పిదాలు జరగలేదని ఆయన కుండబద్దలు కొట్టారు. అయితే, ఇక్కడే కాంగ్రెస్ వ్యూహాత్మక లోపం బయటపడుతోంది. పారిశ్రామిక అవసరాల కోసం ఇచ్చిన భూములను కేవలం ఆ నిర్దేశిత ప్రాజెక్టులకు, ఫ్యాక్టరీల నిర్మాణాలకు మాత్రమే ఉపయోగించాలి తప్ప, రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చుకోవడానికి లేదా అమ్ముకోవడానికి చట్టపరంగా అవకాశం ఉండదు. ఈ పాయింట్‌ను కాంగ్రెస్ నేతలు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారు. భూములు ఎవరికి ఇచ్చినా అందులో స్కామ్ చేసే ఆస్కారం లేదని టెక్నికల్‌గా వివరించడంలో అధికార పక్షం విఫలమవుతోంది.సదరు టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ శ్రేణులు కానీ, ప్రభుత్వ ప్రతినిధులు కానీ ధైర్యంగా ఖండించలేకపోతున్నారు. బీఆర్ఎస్ ప్రధానంగా కొండల్ రెడ్డి పేరును వాడుకుని దీనిని ఫ్యామిలీ స్కామ్ గా బ్రాండ్ చేస్తోంటే.. కాంగ్రెస్ మాత్రం కేవలం విధానపరమైన నిబంధనల గురించి మాత్రమే మాట్లాడుతోంది తప్ప, అసలు ఆ కంపెనీ ఓనర్ల వెనుక కొండల్ రెడ్డి ఉన్నారా లేదా అనే దానిపై క్లారిటీ ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కచ్చితమైన ఖండన లేకపోవడం వల్లే బీఆర్ఎస్ తమ ప్రచారంలో మరింత దూకుడు పెంచుతోంది. కేటీఆర్ అండ్ కో ఈ ఇష్యూ ద్వారా రెండు ప్రయోజనాలను ఆశిస్తున్నారు. ఒకటి.. గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ పాలన, అవినీతిపై కాంగ్రెస్ చేసిన ఆరోపణలకు కౌంటర్‌గా, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబం కూడా అదే చేస్తోందని ముద్ర వేయడం. రెండు.. సీఎం ఇమేజ్‌ను డ్యామేజ్ చేసి, ప్రభుత్వంపై నెగెటివిటీ పెంచడం. కాంగ్రెస్ పార్టీ ఈ ఆరోపణల దాడిని కేవలం మంత్రుల ప్రకటనలకే పరిమితం చేయకుండా, వాస్తవాలను డాక్యుమెంట్ల సహా ప్రజల ముందు ఉంచి కౌంటర్ అటాక్ చేయకపోతే.. దీర్ఘకాలంలో ఇలాంటి చిన్న సైజు స్కామ్ ఆరోపణలే ప్రభుత్వ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది.

## 'వరుణ యాగ ప్రత్యేక పూజలు ప్రారంభం'



**ఇంద్రకీలాద్రి:** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులను నివారించి, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని, నదులు, చెరువులు, జలాశయాలు నిండి రైతాంగం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో దేవాదాయ శాఖ కమీషనర్ వారి ఉత్తర్వులు మేరకు ఈరోజు ఉదయం దేవస్థానంలో దీక్షాపూర్వకంగా వరుణ యాగం సంబందించిన పూజలు ప్రారంభం అయ్యాయి.ఈరోజు అనగా 14.08.2026 (శుక్రవారం) ఉదయం 06:15 నుండి శ్రీ దుర్గాస్నానఘాట్లో విఘ్నేశ్వర పూజతో వరుణ యాగ పూజా కార్యక్రమములు ప్రారంభం కాగా ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ )ఈవో వికె శీనా నాయక్ పాల్గొన్నారు. ఆలయ స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పండితులు వరుణ అనువాక సహిత కారక పారాయణలు నిర్వహించారు. ఈ పారాయణలు కొరకు పండితుల బృందం పవిత్ర కృష్ణానదిలో నడుంలోతు నీళ్లలో ఉండి సకాలంలో వర్షాలు పడాలని పారాయణం చేసారు.

## వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై..

**ఈగల్ పోలీసుల ఆపరేషన్**

**హైదరాబాద్:** వాట్సాప్ గ్రూప్ ద్వారా నగరంలో గంజాయి సప్లై పై వచ్చిన సమాచారంలో ఈగల్ పోలీసులు ఆపరేషన్ నిర్వహించారు. బేగంపేట్ ఓల్డ్ ఎయిర్పోర్ట్ వద్ద అనుమానితుడి అరెస్ట్ చేసి, 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కిరణ్, దుర్గాప్రసాద్, కమలాకర్ పేర్లు వెలుగులోకి వచ్చాయి. దాంతో బాలానగర్ రాజీవ్ కాలనీలో నిందితులపై నార్కోటిక్ టీమ్స్ దాడులు నిర్వహించాయి. వచ్చిన పోలీసులపై స్క్రూడ్రైవర్తో దాడికి నిందితుడు కిరణ్ ప్రయత్నించాడు. నాలుగో ఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్య డ్రామా ఆడాడు. కిరణ్ నుంచి 14 కేజీల గంజాయి, ఎయిర్గన్, కారు, బైక్, మొబైల్ ఫోన్లు సీజ్ చేసారు. ఒడిశా నుంచి నగరానికి గంజాయి సరఫరా చేసినట్లు గుర్తించారు. ఒడిశాకు చెందిన ఐదుగురు అదుపులోకి తీసుకున్నారు. ప్యాకెట్ ఫొటోను ముందుగా కస్టమర్కు పంపి.. డెలివరీ అనంతరం స్పాట్ నుంచి ముఠా పరారవుతుంది. 2022 నుంచి ఇప్పటివరకు 203 మందికి గంజాయి సప్లై చేసినట్టు పోలీసులు గుర్తించారు. 40 పోలీస్ టీములతో ఈ భారీ ఆపరేషన్ జరిగింది.

# మండల ప్రజావాణిని సమర్థవంతంగా నిర్వహించాలి

**ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి మండల స్థాయిలో ప్రజావాణి**

**ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి**

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 14(స్కై న్యూస్):**ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు మండల ప్రజావాణి వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ బి.నర్సింగ్ రావు అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు మండల ప్రజావాణి నిర్వహణకు సంబంధించి జిల్లాలోని మండల స్థాయి ఆపరేటర్లు, ప్రజావాణి సూపరింటెండెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అక్కడికక్కడే వేగవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణి వ్యవస్థను మండల స్థాయికి విస్తరించిందన్నారు. ఇప్పటికే ప్రతి సోమవారం జిల్లా, డివిజన్ స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాజాగా మండల స్థాయిలో కూడా ప్రజావాణి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 17వ తేదీ సోమవారం నుంచి అన్ని మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్లాలని సూచించారు. మండల కేంద్రాల్లోనే వినతులు స్వీకరించి వారి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఇందువల్ల ప్రజలకు ప్రయాణ భారంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి,నిర్ణీత విధానాల ప్రకారం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల నమోదు సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, మండల స్థాయి ఆపరేటర్లు, ప్రజావాణి సూపరింటెండెంట్లు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే స్వీకరించి అట్టి ఫిర్యాదులను సంబంధిత శాఖలకు వెంటనే పంపాలని సూచించారు. ప్రజావాణి నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఫిర్యాదుల పరిష్కార పురోగతిని




ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా మండల స్థాయి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ శిక్షణలో డీఆర్డీఓ, ఈ- జిల్లా మేనేజర్లు సంబంధిత సిబ్బందికి ప్రజావాణి నిర్వహణ, ఫిర్యాదుల నమోదు, పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై మండల స్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ముషాయిదా బేగం, ఈడియం శివ, సూపరిడెంట్లు,ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.ఖ

## ప్రతిభా విద్యార్థులకు నేడు సన్మానం

**నాగర్ కర్నూల్ ఆగస్టు 14( స్కై న్యూస్)** జిల్లాలో ఇటీవల జరిగిన 10వ తరగతి వార్షిక పరీక్షలలో ప్రతిభ చాటి మండల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు సన్మానం చేయనున్నట్లు క్లాస్ మెంట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి హాజరవుతున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని 20 మండలాలలో మండల టాపర్ గా నిలిచిన వారిని సన్మానించడం జరుగుతుందని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కూడా సన్మానం చేయనున్నట్లు ఆయన వివరించారు ఈ సమావేశంలో క్లబ్ జిల్లా అధ్యక్షులు నాగం చంద్రమోహన్ రెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి రమణ కుమార్ కోశాధికారి ఎంపీ ఖాజా పాల్గొన్నారు

## బీచుపల్లి ఆంజనేయ స్వామి సన్నిధిలో పార్లమెంటు సభ్యురాలు డికె. అరుణమ్మ ప్రత్యేక పూజలు..

**ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం ప్రారంభించి, హోమం నిర్వహించిన ఎంపీ డీకే అరుణమ్మ**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు14(స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా బీచుపల్లి పుణ్యక్షేత్రంలో స్వామి వారిని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె అరుణమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది .. ఈ సందర్భంగా ఆలయ ఈవో పురేందర్ పూర్ణకుంభ స్వాగతం పలికి ఆంజనేయ స్వామి సన్నిధిలో ఉన్న కళ్యాణ మండపానికి శ్రీ వ్యాసరాయ కళ్యాణ మండపం గా నామకరణం చేసి పుణ్యావచనము, శాంతి హోమం, గణపతి పూజ, నవగ్రహాల పూజ నిర్వహించడం జరిగింది. వివాహాలు జరిగే వారికి సకల శుభాలు కలిగి శుభప్రదంగా ఉండాలని వసంతులన్నీ సమకూర్చి పున ప్రారంభించడం జరిగింది.

# కమీషన్ల కోసమే డిండి ప్రాజెక్టు...

**మంతటిలో భూసేకరణను అడ్డుకుంటాం**

**బిఆర్ఎస్ యువనేత డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 14( స్కైన్యూస్)** కాంట్రాక్టర్ నుండి కమిషన్లు దండుకునేందుకే ఈ ప్రాంతం నుండి డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని మంతటి గ్రామంలో డంపింగ్ యార్డ్ కోసం 125 ఎకరాల భూమిని సేకరించేందుకు చేస్తున్న కుట్రలను అడ్డుకుంటామని రైతుల పక్షాన పోరాటాలకు సిద్ధమని బిఆర్ఎస్ యువనేత డాక్టర్ నాగం శశిధర్ రెడ్డి హెచ్చరించారు పలువురు రైతులు సమస్యలు ఆయన స్వగృహంలో ఆయనను కలిసి వివరించడంతో శుక్రవారం ఉదయం గ్రామంలో పంట పొలాలను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలైన ఎస్ఎల్బీసీ ఉండగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నుండి నీటిని తరలించి రైతులను ముంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని వాటిని ప్రతిఘటించవలసిన



ఈ ప్రాంత ఎమ్మెల్యేలు మంత్రులు ఎమ్మెల్సీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 36 లక్షల ఆయకట్టు ఉన్నప్పటికీ ఎనిమిది లక్షల ఎకరాలకు కూడా సాగునీరు అందడం లేదని అదే నల్లగొండ జిల్లాలో 12 లక్షల ఎకరాలు సాగు భూమి ఉండగా సుమారు 90% ఆయకట్టుకు నీరు అందుతుందని వివరించారు. గ్రామంలో రైతులు రెండు



పంటలు పండించే వ్యవసాయ భూమిలో డంపింగ్ యార్డును ఏర్పాటు చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు అర్థం రవి లక్ష్మయ్య అహ్మద్ సత్యం విష్ణు చారి వెంకటస్వామి తోపాటు గ్రామ రైతులు పాల్గొన్నారు

## ప్రభుత్వ బియ్యం అక్రమ తరలింపుపై రైస్‌మిల్లర్ పై పీడీ యాక్ట్




**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆగస్టు 14 (స్కై న్యూస్):** రూ.15.70 కోట్ల విలువైన ప్రభుత్వ బియ్యం దారి మళ్లించినట్లు ఆరోపణలు ప్రభుత్వానికి అందించాల్సిన కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని అక్రమంగా దారి మళ్లించి, బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించి ఆర్థిక లాభాలు పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్‌మిల్లర్ గంప సంతోష్‌కుమార్‌పై బ్లాక్‌మార్కెటింగ్ నిరోధక,నిత్యావసర వస్తువుల సరఫరా పరిరక్షణ చట్టం--1980లోని సెక్షన్ 3(1),3(2) కింద పీడీ యాక్ట్ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా తెలిపారు.ఈ ఉత్తర్వులను లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్ఐ రాజవర్ధన్ లక్షెట్టిపేట సబ్‌జైలులో ఉన్న నిందితుడికి జైలు అధికారుల సమక్షంలో అందజేసి,అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.గంప సంతోష్‌కుమార్ దండేపల్లి మండలం లింగాపూర్‌లోని ఎం/ఎస్ రామలక్ష్మణ్ ఇండస్ట్రీస్ రైస్‌మిల్ మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ఉన్నారు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న కస్టమ్ మిల్లింగ్ ఒప్పందాల ప్రకారం రబీ 2022--23,రబీ 2024--25 సీజన్లలో మొత్తం 9,244.206 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం పొందారు.ఈ ధాన్యానికి సంబంధించి ప్రభుత్వానికి 6,286.059 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) అందించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,833.511 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించినట్లు అధికారులు గుర్తించారు.ఇంకా 4,452.548 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అందించాల్సి ఉందని, దానికి సమానమైన సుమారు 6,170.643 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని దారి మళ్లించినట్లు కేసు దర్యాప్తులో తేలిందని తెలిపారు.ఈ అక్రమాల వల్ల ప్రభుత్వానికి రూ.15.14 కోట్లకుపైగా నష్టం వాటిల్లినట్లు పౌర సరఫరాల శాఖ అధికారులు పేర్కొన్నారు.గత సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ బకాయిలను కలుపుకుని మొత్తం నష్టం రూ.15,70,36,726గా నిర్ధారించినట్లు తెలిపారు.గంప సంతోష్‌కుమార్‌పై ప్రభుత్వ ధాన్యం దారి మళ్లింపునకు సంబంధించి 2025, 2026 సంవత్సరాల్లో మరో రెండు కేసులు కూడా నమోదయ్యాయి.అవి దండేపల్లి, హాజీపూర్ పోలీస్‌స్టేషన్లలో నమోదైనట్లు తెలిపారు.ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించడం వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారు. సీఎంఆర్ సరఫరాలో కొరత ఏర్పడితే పేదలు,అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీ బియ్యం అందించే వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.గతంలోనూ నిందితుడిపై కేసులు నమోదైనప్పటికీ అక్రమ కార్యకలాపాలు కొనసాగించారని, సాధారణ క్రిమినల్ చట్టాల కింద తీసుకున్న చర్యలు నిరోధక ప్రభావం చూపలేదని తెలిపారు.ప్రస్తుతం దండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడు రిమాండ్‌లో ఉన్నాడని,బెయిల్‌పై విడుదలైతే మళ్లీ ఇదే తరహా అక్రమాలకు పాల్పడే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు నివేదించిన నేపథ్యంలో పీడీ యాక్ట్ కింద నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసినట్లు సీపీ వెల్లడించారు.ప్రభుత్వానికి చెందిన నిత్యావసర వస్తువులను అక్రమంగా దారి మళ్లించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని రామగుండం పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

# వ్యవస్థలో లోపాలు సరిచేయరా..?

**వేములవాడ ఏరియా ఆసుపత్రిలో రోగికి ఎదురైన సమస్యలపై వైరల్‌గా మారిన వీడియో**

**పనిచేయని వైద్య యంత్రాలు.. పరీక్షల కోసం మరుసటి రోజు రావాలంటూ సూచన**

**ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులపై అదనపు భారం.. అధికారుల దృష్టికి సమస్యలు**

**వేములవాడ, ఆగస్టు 14 (స్కై న్యూస్)**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల పనితీరు, పరీక్షల ఫలితాల విషయంలో నెలకొంటున్న సమస్యలు రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో తనకు ఎదురైన అనుభవాన్ని వివరిస్తూ ఓ రోగి స్వయంగా రికార్డు చేసిన సెల్ఫీ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.వేములవాడ రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన సుమారు 40 ఏళ్ల వ్యక్తి గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతూ గురువారం వైద్య సేవల కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వచ్చినట్లు వీడియోలో పేర్కొన్నాడు. ఆసుపత్రిలో ఓపీ నమోదు కోసం సిబ్బంది అందుబాటులో లేకపోయినప్పటికీ, బీపీ పరీక్షించే సిబ్బంది మాత్రం ముందుగానే అందుబాటులో ఉన్నారని ఆయన చెప్పాడు.ఓపీ పత్రం తీసుకున్న అనంతరం వైద్యుడిని సంప్రదించగా, వారం రోజులుగా జ్వరం కొనసాగుతున్న నేపథ్యంలో సీబీపీ, ఆర్‌బీఎస్, వైడల్, డెంగ్యూ తదితర రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించినట్లు రోగి తెలిపాడు.

**సీబీపీ యంత్రం పనిచేయడం లేదంటూ..**

వైద్యుడు సూచించిన పరీక్షల కోసం ల్యాబ్‌కు వెళ్లగా సీబీపీ పరీక్షకు సంబంధించిన యంత్రం పనిచేయడం లేదని, ప్రస్తుతం ఆ పరీక్ష చేయడం సాధ్యం కాదని సిబ్బంది



చెప్పినట్లు రోగి వీడియోలో ఆరోపించాడు. మిగిలిన పరీక్షల ఫలితాలు రాత్రికి ఫోన్‌కు వస్తాయని, మరుసటి రోజు మీసేవ కేంద్రంలో వాటి ప్రింట్ తీసుకుని వచ్చి వైద్యుడికి చూపించుకోవాలని సూచించినట్లు తెలిపాడు.

ఇప్పటికే అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన తనలాంటి రోగి పరీక్షల కోసం మరో రోజు ఆసుపత్రికి రావాల్సి వస్తే ప్రయాణ ఖర్చులు, సమయం, శారీరక ఇబ్బందులు మరింత భారంగా మారతాయని రోగి ఆవేదన వ్యక్తం చేశాడు.

**ప్రైవేట్‌లో గంటల్లో.. ప్రభుత్వ ఆసుపత్రిలో మరుసటి రోజా?**

ప్రైవేట్ ఆసుపత్రుల్లో రక్త పరీక్షల ఫలితాలు కొన్ని గంటల్లోనే అందుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం మరుసటి రోజు రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోందని రోగి ప్రశ్నించాడు. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులే ప్రధాన ఆధారం కాగా, అక్కడే పరీక్షలు, వైద్య సేవలు ఆలస్యమైతే వారు ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించాడు.

పనిచేయని వైద్య పరికరాలను వెంటనే మరమ్మతు చేయడం, ల్యాబొరేటరీ సేవలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచడం, రోగులకు అవసరమైన పరీక్షల ఫలితాలను వీలైనంత త్వరగా అందించడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రోగి కోరాడు.

**వైరల్ వీడియోపై అధికారుల స్పందన ఏంటి?**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఆసుపత్రి యంత్రాంగంపై ఉంది. ఒక రోగి తనకు ఎదురైన సమస్యలను వీడియో రూపంలో సామాజిక మాధ్యమాల్లో వెల్లడించడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.వైరల్‌గా మారిన వీడియోలో పేర్కొన్న ఆరోపణలపై ఆసుపత్రి అధికారులు స్పందించి సీబీపీ యంత్రం ఎందుకు పనిచేయడం లేదు? ఇతర రక్త పరీక్షల ఫలితాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి? రోగులకు పరీక్షల కోసం మళ్లీ రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న చిన్నచిన్న లోపాలు రోగులకు పెద్ద సమస్యలుగా మారకముందే అధికారులు స్పందించి వ్యవస్థలోని లోపాలను సరిచేసి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## విధుల్లో చేరిన జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ

పెద్దపల్లి ప్రతినిధి



**ఆగస్టు 14 (స్కై న్యూస్)** : తెలంగాణ వైద్య విధాన పరిషత్ నూతన నియామకాలలో భాగంగా మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం జనరల్ సర్జన్ డాక్టర్ నికీల్ తేజ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టీవీ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మంథని పట్టణ, పరిసర మండలల ప్రజలు తరచుగా వచ్చే శస్త్రచికిత్స వ్యాధులకు సర్జరీ, లాప్రోస్కోపిక్ సర్జరీలను మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కార్పోరేట్ ఆస్పత్రులకు ధీటుగా మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలను పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## స్పీడ్ బ్రేక్ సులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి: డి వై ఎఫ్ ఐ

**దేవరకద్ర, అమరచింత ఆగస్టు 14 (స్కై న్యూస్);** అమరచింత పట్టణంలో అనవసరంగా వేసిన స్పీడ్ బ్రేక్ లను తొలగించాలని మున్సిపల్ కమీషనర్ నూరల్ నజీబ్ కి శుక్రవారం వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డి వై ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు టీ. రాఘవేంద్ర మాట్లాడుతు అమరచింత మున్సిపాలిటీలి చాలా వార్డులలో అనవసరమైన స్పీడ్ బ్రేక్లు వేయడం వల్ల వృద్ధులను ఏదన్నా పని మీద బస్టాండ్ కి లేదా హాస్పిటల్ కి తీసుకుపోతున్న సందర్భంలో ఉన్న రోగాలకన్నా లేని రోగాలు బాడీ నొప్పులు వస్తున్న పరిస్థితి ఉంది అన్నారు. బాలింతలను హాస్పిటల్ కు తీసుకెళ్లాలని చిన్నపిల్లలను హాస్పిటల్ కు తీసుకెళ్లాలన్నా ఇంటి నుండి బయలుదేరి బస్టాండ్ కి వచ్చేసరికి ఒక 7 లేదా 8 స్పీడ్ బ్రేక్లను దాటుకొని బస్టాండ్ కు వచ్చే పరిస్థితి అన్ని వార్డుల్లో ఏర్పడిందని కాబట్టి వెంటనే మున్సిపల్ కమిషనర్



స్పందించి అనవసరమైనటువంటి స్పీడ్ బ్రేక్ లను గుర్తించి వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు షారుఖ్, తబ్రైస్ షారుఖ్,రాజీక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని వివిధ ఆలయాలను దర్శించుకున్న : ఎమ్మెల్యే జి ఎం ఆర్ దంపతులు

**దేవరకద్ర ఆగస్టు 14 (స్కై న్యూస్);** శ్రావణ శుక్రవారం సందర్భంగా అలంపూర్ జోగులాంబ అమ్మవారి శక్తిపీఠాన్ని ,శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని, ప్రత్యేక పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దంపతులను ఆయా ఆలయాల హర్షకులు స్వాగతం పలికి ఆలయ ఆనవాయితీ ప్రకారంగా తీర్థ ప్రసాదములు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఎమ్మెల్యే దంపతుల తో పాటు కాంగ్రెస్ నాయకులు వివిధ ఆలయాల దర్శించుకున్నట్లు తెలిపారు.





వార్తాతరంగాలు



## స్వతంత్ర దినోత్సవ వేడు కల ఏర్పాట్లను పరిశీలించినకలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట ఆగస్టు 14:( స్మైన్యూస్)** స్వతంత్ర దినోత్సవ వేడుక లను ఘనంగా, విజయవం తంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ మైదా నంలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను, అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్ తదిత ర అధికారులతో కలిసి వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించా రు.స్వతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రజలు, విద్యా ర్థులు, అధికారులు హాజర య్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యార్థులు మరియు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టాల్స్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వేడుకల సందర్భంగా ట్రాఫి క్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు, వీఐపీలు, ప్రజలు, విద్యార్థుల రాకపో కలకు ఎలాంటి ఇబ్బందు లు లేకుండా సమన్వయం తో చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా జరిగేలా ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవం తంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అదన పు ఎస్పీ రియాజ్ హుల్ హక్ పోలీస్ శాఖ తరఫున చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వివరించారు. పరేడ్, ప్రజల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సంబంధిత పోలీ స్ అధికారులకు అవసరమై న సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, తహ సీల్దార్, టౌన్ ఎస్ఐ వెంకటే శ్వర్లు, పోలీస్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్తు...విస్తృత తనిఖీలు

ఎస్పీ వినీత్



**నారాయణపేట ఆగస్టు 14 : (స్మైన్యూస్) ఆగస్టు** 15 స్వాతం త్ర్య దినోత్సవాన్ని పురస్క రించుకొని నారాయణపేట జిల్లాలో ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వ ర్యంలో శు క్రవారం బాంబ్ స్క్వాడ్ పోలీసు బృందం, పోలీస్ జాగిలాలతో విస్తృ త తని ఖీలు నిర్వహించా రు.జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్, జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, కోర్టు ప్రాంగణం, ప్రధాన చౌరస్తా లు, జనసామర్థ్యం అధికం గా ఉండే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టింది. అనుమానా స్పద వస్తువులు, బ్యాగు లు, సంచులు, వాహనాలపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశారు.స్వాతంత్ర్య దినోత్స వ వేడుకలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసు కోకుండా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా పోలీసు బందోబస్తు, నిఘా చర్యల ను ముమ్మరం చేసినట్లు జిల్లా ఎస్పీ వినీత్ తెలిపా రు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద వస్తు వులు, బ్యాగులు, సంచులు లేదా వాహనాలు కనిపించి నా వెంటనే సమీప పోలీసు లకు సమాచారం అందించా లని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసం పోలీసులకు సహకరించా లని కోరారు.

## పేటలో బిజెపి భారీ ర్యాలీ యాత్ర

పాల్గొన్న రాష్ట్ర నేతలు



**నారాయణపేట ఆగస్టు 14: (స్మైన్యూస్)** ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ జిల్లా ప్రధాన కార్య దర్శి లక్ష్మీ శ్యామ్ సుందర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీలక తీతంగా శుక్రవారం ఉద యం 10 గంటలకు భారీ తీరంగా ర్యాలీ నిర్వహిం చారు.ర్యాలీ స్థానిక బసవేశ్వర మందిరం నుంచి చౌక్ బజార్,సెంటర్ చౌక్, విరసావర్కర్ చౌరస్తా గుండా సత్యనారాయణ స్వామి చౌరస్తా వరకు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరా జు, బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురా వు నామాజి,రాష్ట్ర కార్యవ ర్గ సభ్యుడు రతంగ్ పాండు రెడ్డి,సంగారెడ్డి ఇంఛార్జ్ పగడకుల శ్రీనివాసులు సీనియర్ నాయకులు కొండయ్య మాట్లాడుతూ ధర్మ రక్షణ దేశ పటిష్టత కోసం ప్రతి ఒక్కరు జాతీయ జెండా ఆవిష్కరించి ఐక్యత ప్రదర్శించి ప్రధాని నరేంద్ర మోదీ,కేంద్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడురఘురామయ్యా గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి,కౌన్సి లర్ల,జిల్లా మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసు కవాతును పరిశీలించిన అదనపు ఎస్పీ రియాజ్



**నారాయణపేట ఆగస్టు 14 : (స్మైన్యూస్)** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించేందుకు నారాయణ పేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కొనసాగుతున్న పరేడ్ ఫైనల్ ప్రాక్టీస్ కవాతు ను అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్ శుక్రవా రం పరిశీలించారు.ఆగస్టు 15న నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పోలీస్ సిబ్బందితో నిర్వహిస్తున్న పరేడ్ రిహార్సల్స్‌ను మార్చ్ పాస్ట్, కవాతు, బ్యాండ్ సమన్వయం తదితర అంశాలను అదనపు ఎస్పీ పరిశీలించారు.పరేడ్‌లో సిబ్బంది క్రమశిక్షణ, సమ యపాలన, సమన్వయం, ఏకరూపత పాటించాలని అదనపు ఎస్పీ సూచించా రు.ఈ పరేడ్ రిహార్సల్స్ కు ఆర్ఐ విజయ్ భాస్కర్ పరేడ్ కమాండర్ గా నిర్వ హిస్తున్నారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లోకపల్లి లక్ష్మమ్మ ఆయ అభివృద్ధికి 51 వేల విరాళం



**నారాయణపేట ఆగస్టు 14: (స్మైన్యూస్)** నారాయణపేట మండలం శ్రీ లోకపల్లి లక్ష్మమ్మ ఆలయ అభివృద్ధి కోసం శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవారి భక్తుడు రిటైర్డ్ టీచర్ బాలకృష్ణ రూ. 51,000 సమర్పించారు.ఈ కార్యక్ర మాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ పిల్లి నరసింహులు, ఎంపీటీసీ లప్ప అశోక్ ,జయలకంఠ కన్న జగదీష్,లైన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్ గౌడ్ ,ప్రధాన కార్యదర్శి వేముల మధుసూదన్ రెడ్డి కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

# శంకుస్థాపనలకే పరిమితమైన
# మఖ్తల్-నారాయణపేట ఫోర్‌లైన్ రోడ్డు

**రెండుసార్లు శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది**

**రెండు సార్లు శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో ముఖ్యమంత్రి,మంత్రులు ప్రజలకు సమాధానం చెప్పాలి.**

**బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య.**

**మక్తల్ ఆగస్టు 14( స్మై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని మక్తల్ -నారాయణపేట ఫోర్ లైన్ రోడ్డు ను 2025 డిసెంబర్ 1న మక్తల్ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మఖ్తల్-- నారాయణపేట రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అనంతరం 2026 జూలై 13న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి కలిసి రూ.237 కోట్లతో నిర్మించనున్న నాలుగు లైన్ల రోడ్డుకు మరోసారి శంకుస్థాపన చేసి పైలాన్ ఆవిష్కరించారు. రెండుసార్లు శంకుస్థాపన చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? రెండు సార్లు శంకుస్థాపన జరిగినప్పటికీ పనులు ప్రారంభించడంలో ఎందుకు ఆలస్యం అవుతుందో ముఖ్యమంత్రి, మంత్రులు మఖ్తల్ నియోజకవర్గ ప్రజలకు, నారాయణపేట జిల్లా ప్రజలకు సమాధానం చెప్పాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు.నారాయణపేట జిల్లాకు వెళ్లే ప్రధాన రహదారి పరిస్థితిని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోడ్డుపై ఒక్కొక్క గుంత రెండు నుంచి మూడు అడుగుల లోతు వరకు ఉంది. ఇంత ప్రమాదకరమైన పరిస్థితిలో ప్రజలు, వాహనదారులు ఎలా ప్రయాణించాలి ? ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి, మంత్రులు, ముఖ్యంగా మఖ్తల్ నియోజకవర్గ మంత్రి గుర్తించాలి. అని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే రోడ్డు పనులు ఏ తేదీన ప్రారంభిస్తారో, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా ప్రకటించాలని కొండయ్య సవాల్ చేశారు. మఖ్తల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న స్థానిక మంత్రి ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రజలు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా అని కొండయ్య ప్రశ్నించారు.ఈ రోడ్డుపై జిల్లా ఆసుపత్రికి వెళ్లే అంబులెన్సులు, అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ప్రయాణించే సమయంలో రోడ్డు పరిస్థితి కారణంగా తీవ్ర అవస్థలు పడుతున్నారని, అంబులెన్సులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి అభివృద్ధి పనుల అమలులో ఉన్న తేడాను ప్రజలు గమనించాలి అని కొండయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో చేపట్టిన భారత్‌మాల రహదారి పనులకు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుండగా, మఖ్తల్--నారాయణపేట రోడ్డు విషయంలో మాత్రం శంకుస్థాపనలు జరిగినా పనులు ప్రారంభం కాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.శంకుస్థాపన చేసినా



ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రోడ్డు పనులు ముందుకు సాగకపోవడంపై కొండయ్య తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఈ రహదారి విషయంలో ప్రభుత్వం ఇక ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నారాయణపేట రోడ్డు విషయంలో బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు చేయాల్సి వస్తుందని అలాంటి పరిస్థితిని తీసుకురావద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# సింగారంలో పంటల పరి శీలన

**రైతులకు సమగ్ర వ్యవసాయ సూచనలు**

**నారాయణపేట ఆగస్టు 14: (స్మైన్యూస్)** నారాయణపేట మండలం సింగారం గ్రామంలో రైతుల పొలాలను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణ పేట సమన్వయకర్త డా. ఈటెల సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, వ్యవసా య విస్తరణ అధికారి అని ల్ సందర్శించి వరి, పత్తి, కంది పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సంద ర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి పంటల ప్రస్తుత స్థితి, ఎరువుల వినియోగం, కలుపు నివారణ, తెగుళ్లు మరియు చీడపీడల నియం త్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు.

**వరి పంటలో ఎరువుల వినియోగం**

వరి పంటలో నత్రజని ఎరువులను ఒకేసారి కాకుండా పంట దశలను బట్టి విడతలుగా వేయాల ని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరానికి అనుగుణంగా వినియోగిం చాలని సూచించారు. ముఖ్యంగా పైరుకు అవస రమైన సమయంలో నత్రజ ని అందించడం ద్వారా మంచి పెరుగుదల, దిగుబ డి సాధించవచ్చని తెలిపా రు. అధిక మోతాదులో యూరియా వాడకాన్ని నివారించాలని రైతులకు సూచించారు.

**పత్తి పంటలో సమతుల్య పోషక యాజమాన్యం**

పత్తి పంట ప్రారంభ దశలో అవసరమైన ప్రాథమిక ఎరువులతో పాటు, పంట ఎదుగుదల దశను బట్టి నత్రజని,



పొటాష్‌ను విడత లుగా అందించాలని తెలి పారు. అధికంగా యూరి యా వినియోగించడం వల్ల పంటలో అధిక వృక్ష పెరు గుదల ఏర్పడి పూత, కాయల ఏర్పాటుపై ప్రతి కూల ప్రభావం చూపే అవ కాశం ఉందని రైతులకు వివరించారు.

**కంది పంటలో వాడిపోయే తెగులు నివారణ**

కంది పంటను పరిశీలించిన అధికారులు విల్ట్ (ఎండు తెగులు) లక్షణాలను గుర్తించి, వ్యాధి సోకిన మొక్కలను పొలంలో ఉంచకుండా తొలగించి నాశనం చేయాలని సూచించారు. పొలంలో నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, పంట మార్పి డిని పాటించాలని తెలిపా రు. విత్తన శుద్ధి, జీవ నియంత్రణ పద్ధతులు అవసరమైనప్పుడు సిఫా రసు చేసిన శిలీంద్రనాశ కాలను ఉపయోగించడం ద్వారా విల్ట్‌ను నియంత్రిం చవచ్చని వివరించారు.

**కంది పంటలో కలుపు నివారణ**

కంది పంటలో ప్రారంభ దశలోనే కలుపు మొక్కల ను సమర్థవంతంగా నియం త్రించాలని అధికారులు సూచించారు. పంట దశ, నేల పరిస్థితి మరియు కలుపు రకాలను బట్టి సిఫా రసు చేసిన కలుపు నివార ణ మందులను లేబుల్ సూచనల ప్రకారం ఉపయో గించాలని తెలిపారు. అవ సరమైన చోట అంతరకృషి, చేతి కలుపు తగిన హెర్బి సైడ్‌లను సమగ్ర కలుపు యాజమాన్యంలో భాగంగా వినియోగించాలని సూచిం చారు.ఈ సందర్భంగా డా. ఈటెల సత్యనారాయణ మాట్లాడుతూ, రైతులు ఎరువులు, పురుగుమం దులు,కలుపు నివారణ మందులను తమ ఇష్టాను సారం కాకుండా పంట దశ, నేల పరిస్థితి శాస్త్రీయ సిఫారసుల ప్రకారం వినియోగించాలని సూచిం చారు. పంటల్లో సమస్యలు కనిపించిన వెంటనే వ్యవ సాయ శాఖ అధికారులను సంప్రదించి సరైన యాజ మాన్య పద్ధతులను పాటిం చాలని రైతులకు తెలి పారు.రైతుల పొలాలను నేరుగా సందర్శించి పంటల పరిస్థితిని పరిశీలిస్తూ, సమస్యలకు క్షేత్రస్థాయిలో నే శాస్త్రీయ పరిష్కారాలను అందించడం ద్వారా తెలం గాణ రైతు విజ్ఞాన కేంద్రం, నారాయణపేట రైతులకు నిరంతరం సాంకేతిక సహ కారం అందిస్తుందని అధికారులు తెలిపారు.

# తీజ్ వేడుకల్లో గిరిజన సంస్కృతికి పెద్దపీట

## సంప్రదాయాలను కాపాడుకోవాలి: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**వేములవాడ ఆగస్టు14 (స్మై న్యూస్):**గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు తీజ్ పండుగ ప్రత్యేక ప్రతీకగా నిలుస్తోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం భూక్యా రెడ్డి తండాలో నిర్వహించిన తీజ్ వేడుకలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా జరిగాయి.వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై గిరిజన మహిళలు, యువతులతో కలిసి తీజ్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు, యువతతో కలిసి సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**సంస్కృతి పరిరక్షణే బాధ్యత**

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తరతరాలుగా వస్తున్న గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆధునిక కాలంలోనూ తమ మూలాలను మరచిపోకుండా యువత సంప్రదాయాలను కొనసాగించాలని సూచించారు.తీజ్ వంటి పండుగలు కేవలం వేడుకలు మాత్రమే కాకుండా గిరిజన సమాజంలో ఐక్యతను, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక సందర్భాలని పేర్కొన్నారు.

**తండాలో పండుగ సందడి**

తీజ్ వేడుకల సందర్భంగా భూక్యా రెడ్డి తండాలో పండుగ వాతావరణం నెలకొంది. గిరిజన మహిళలు, యువత సంప్రదాయ దుస్తుల్లో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ పాటలు, నృత్యాలతో తండాలో సందడి నెలకొంది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గిరిజన మహిళలు, యువతతో కలిసి వేడుకల్లో పాల్గొనడంతో స్థానికుల్లో ఉత్సాహం కనిపించింది.

**తరతరాలకు వారసత్వాన్ని అందించాలి**




గిరిజనుల ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొన్నారు. తీజ్ వేడుకలు గిరిజన సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి చాటిచెప్పాయి.

# శ్రీశ్రీ శ్రీ హార హార పుత్ర అయ్యప్ప స్వామి దివ్య క్షేత్రం

**శ్రావణ మాసం ప్రత్యేక పూజలకు ఆహ్వానం**

**ఆగస్టు 14 (స్మై న్యూస్ ) ఆత్మకూర్** మున్సిపాలిటీ పరిధిలో పవిత్ర శ్రావణమాసం సందర్భంగా అయ్యప్ప స్వామి వారి దివ్య సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించబడును అయ్యప్ప స్వామి దేవస్థానం నందు ప్రతిరోజు గణపతి హోమం ఉదయం 6:00కు నిర్వహించబడును 13/08/2026 నుండి11/09/2026 శుక్రవారం వరకు వారాంతపు ప్రత్యక పూజలు జరుపబడును 1) ప్రతి శ్రావణం ఆదివారం సూర్యనారాయణ పూజ నవగ్రహ పూజలు నిర్వహించబడును 2) ప్రతి శ్రావణ సోమవారం మహా శివుని రుద్రాభిషేకం 3) ప్రతి శ్రావణం మంగళవారం శ్రీ సుబ్రహ్మణ్య స్వామి వారి అభిషేకం చేయడం జరుగుతుంది4) ప్రతి బుధవారం మహాగణపతి అభిషేకం చేయను 5) అయ్యప్ప స్వామి వారికి పంచామృతాభిషేకం ప్రతి శ్రావణ శుక్రవారం సరస్వతి మాతకు అభిషేకం సాయంత్రం 7:00 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన ప్రతి శనివారం శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి



పంచామృత అభిషేకం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి అభిషేకం చేయడం జరుగుతుంది పవిత్ర శ్రావణమాసం సందర్భంగా నాగుల చవితి నాగుల పంచమి నాడు నాగరాజ స్వామికి సంతాన నాగులకు పాలభిషకం నిర్మించబడును ముఖ్య గమనిక:- మహిళా మార్త మూర్తుల కోసం ప్రతి శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చన నిర్వహించబడును కావున ప్రతి మహిళ మాతృమూర్తి పవిత్ర కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రలు కాగలరు మరియు శ్రావణమాసంలో జరిగే పూజలకి 30 రోజులపాటు తమ గోత్రనామాలతో అభిషేకం మరియు నిత్యం పూజలు జరిపించవలసిందిగా భక్తులకు తెలియజేయడమైనది భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినిగం చేసుకోగలరని దేవాలయ కమిటీ తెలియజేయడమైనది స్వామివారి పాత్రకు తమ పేరు గోత్రనామాలతో అర్చన చేయించుకోవడానికి భక్తులు 316 రూపాయలు చెల్లించి పూజలు చేసుకోవాల్సిందిగా కోరడమైనది

# ఏజెన్సీ చట్టాలకు విద్యుత్ షాక్..

**లక్ష్మీదేవిపల్లి మండలంలో 1/70 చట్టం కనుమరుగు**
**రియల్ మాఫియా గుప్పిట్లో 27 ఎకరాల వ్యవసాయా భూమి..!**
**అక్రమ వెంచర్‌లో విద్యుత్ స్తంభాల కలకలం..**
**అనుమతులిచ్చింది ఎవరు...? పాలకవర్గం వాటా ఎంత..?**
**బహిరంగంగానే రోడ్ల నిర్మాణం.చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు!**
**ఇకనైనా జిల్లా అధికారులు స్పందించేనా...?**







**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 14( స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలంలో గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల భూ లావాదేవీలను పూర్తిగా నిషేధించే 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని లక్ష్మీదేవిపల్లి మండలంలో రియల్ మాఫియా నిలువునా పూడ్చిపెడుతోంది. మొదట్లో మూడు ఎకరాల్లో అక్రమ వెంచర్ వేసినట్లు వచ్చిన కథనం కాస్తా ఇప్పుడు ఏకంగా 27 ఎకరాల భారీ భూ దందాగా రూపాంతరం చెందడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇంత పెద్ద మొత్తంలో గిరిజన వ్యవసాయ భూములు ప్లాట్లుగా మారిపోతుంటే, ఏజెన్సీ చట్టాలను కాపాడాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న మతలబు ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**విద్యుత్ శాఖ అతి ఉత్సాహం.. ఏజెన్సీ చట్టాలు వర్తించవా?**

సాధారణంగా ఒక నిరుపేద కుటుంబానికి లేదా ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఒకే ఒక్క కరెంట్ స్తంభం కావాలన్నా నెలల తరబడి తిప్పించుకునే విద్యుత్ శాఖ అధికారులు.. ఈ అక్రమ వెంచర్ విషయంలో మాత్రం రాత్రికి రాత్రే ఉదారత చాటుకున్నారు. నియమ నిబంధనల ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో ఇలాంటి లే-అవుట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడానికి వీల్లేనప్పటికీ, ఇక్కడ ఏకంగా విద్యుత్ స్తంభాలు వెలిశాయి. సామాన్యుడికి ఒక న్యాయం రియల్ మాఫియాకు ఒక న్యాయమా..? విద్యుత్ శాఖ ఏజెన్సీ చట్టాలకు కట్టుబడి ఉందా లేదా..? అసలు ఈ స్తంభాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది ఏ అధికారి..? అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామ పంచాయతీ వాటా ఎంత? పాలకవర్గం స్వలాభమే పరమావధా?**

వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్మకాలు జరపాలంటే గ్రామ పంచాయతీ నుంచి లే-అవుట్ అనుమతులు తప్పనిసరి. కానీ శేషగిరినగర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఈ దందా చూస్తుంటే అక్కడి గత పాలకవర్గం, అధికారులు రియల్ వ్యాపారులతో పూర్తిగా చేతులు కలిపినట్లు స్పష్టమవుతోంది. గ్రామ పంచాయతీ అభివృద్ధిని పక్కనబెట్టి, కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు స్వలాభం కోసం ఈ అక్రమ లావాదేవీల్లో భారీగా లబ్ధి పొందుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారక అనుమతులు ఉన్న వెంచర్లలో ప్రజల ఉపయోగం కోసం, పిల్లల కోసం క్రీడా స్థలాలు (ప్లే గ్రౌండ్స్), గ్రామ పంచాయతీ పార్కులు కేటాయించడం జరుగుతుంది. కానీ శేషగిరినగర్ లో అక్రమ రియల్ ఎస్టేట్ దందాకు గ్రామ పంచాయతీ అనుమతులు ఉన్నాయంటూ తెలిపేందుకు పల్లె ప్రకృతి వనం, క్రీడా మైదానం, ప్రభుత్వ నిధులతో పార్కు నిర్మాణం చేపట్టడం చూస్తుంటే.. అక్రమ వెంచర్‌కు గ్రామ పంచాయతీ అనుమతులు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వెంచర్ నిర్వాహకులు ఏకంగా బహిరంగంగానే రోడ్లు వేసి, అమాయక ప్రజలను బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఏజెన్సీ చట్టాలకు తూట్లు పొడుస్తోంది ఎవరు..?**

1/70 చట్టం ప్రకారం ఎస్టీ భూములు ఎస్టీలకే చెందాలి. కానీ ఇక్కడ ఎస్టీ వర్సెస్ ఎస్టీ పేరుతో బినామీలను రంగంలోకి దించి వెనుక ఉండి నడిపిస్తున్న ఆ ప్రముఖ విద్యాసంస్థల అధినేత, ఇతర పెద్దల అక్రమాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత బహిరంగంగా భూముల అమ్మకాలు జరుగుతున్నా.. రెవెన్యూ, ఐటీడీఏ అధికారులకు ఎందుకు సోయి (స్పృహ) ఉండటం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి శేషగిరినగర్ పరిధిలోని ఈ 27 ఎకరాల అక్రమ వెంచర్‌పై సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా వేసిన హద్దురాళ్లు, విద్యుత్ స్తంభాలను తొలగించి అమాయక ప్రజలు మోసపోకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి...

**: పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**



**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆగస్టు 14(స్కై న్యూస్):** పోలీసు శాఖలో అప్పగించిన బాధ్యతలను అధికారులు సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిశోర్ ఝూ సూచించారు.ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన టీ.మోహన్, ఎస్.సత్తయ్యలు పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారి భుజాలపై పదోన్నతి చిహ్నాలను అలంకరించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పదోన్నతి అనేది మరింత బాధ్యతతో కూడిన అవకాశమని పేర్కొన్నారు.విధుల్లో ఎల్లప్పుడూ నిజాయితీ,క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేస్తూ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఉన్నతాధికారుల విశ్వాసాన్ని నిలబెట్టుకునే విధంగా విధులు నిర్వహించాలని తెలిపారు.పదోన్నతి పొందిన అధికారులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్,రమేష్, ఆర్ఐలు దామోదర్, రమేష్,ఆర్ఎస్ఐ పోచలింగం,సీసీ హరీష్ పాల్గొన్నారు.

# చుంచుపల్లి మండలంలో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి

**23 శాఖల అధికారులతో ప్రజలకు నేరుగా సమస్యల పరిష్కారం**



**చుంచుపల్లి, ఆగస్టు 14( స్కై న్యూస్):**తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 3 ఌ 4 మార్గదర్శకాల మేరకు, ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే పరిష్కరించేందుకు చుంచుపల్లి మండలంలో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుంది.ప్రతి సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయం (ఎంపిడిఓ కార్యాలయం)లో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుంది.మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంపిడిఓనోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ప్రజల నుండి అందిన ఫిర్యాదులు, వినతిపత్రాలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి, వాటి పరిష్కారంపై సమన్వయం చేస్తారు.23 శాఖల అధికారులు హాజరు.మండల పరిధిలోని 23 సంబంధిత ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలు, ఫిర్యాదులు మరియు వినతులను స్వీకరించాలి. సమస్యలను పరిశీలించి త్వరితగతిన, నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ప్రజావాణి ద్వారా సంబంధిత అధికారులను ఒకే వేదికపై సంప్రదించే అవకాశం కల్పించబడుతుంది.ప్రజలు తమ సమస్యకు సంబంధించిన వినతిపత్రంతో పాటు అవసరమైన ఆధారాలు, పత్రాల ప్రతులను తీసుకువచ్చి ప్రజావాణిలో సమర్పించవచ్చు.ప్రజల సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని ఎంపిడిఓ తెలిపారు.ప్రజల సమస్యలు -- అధికారుల దృష్టికి సమస్యలకు సత్వర పరిష్కారం -- ప్రజల ముంగిట అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని చుంచుపల్లి మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ సుభాషిని కోరారు.

# చేయూత పథకంలో బీడీ కార్మికుల జీవనభృతికి అవకాశం కల్పించాలని డిమాండ్: టి యు సి ఐ

**దేవరకద్ర ఆగస్టు 14 (స్కై న్యూస్);** రాష్ట్ర ప్రభుత్వం చేయూత పథకంలో బీడీ కార్మికుల జీవన భృతికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టి యు సి ఐ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా భవన్, రాష్ట్ర సెక్రటేరియట్ లో వినతి పత్రాల అందజేత హైదరాబాద్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరేందర్, టి యు సి ఐ రాష్ట్ర అధ్యక్ష,



కార్యదర్శులు కే.సూర్యం, ఎస్.ఎల్ పద్మ, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు కే.రాజన్న, అరుణ్ కుమార్ రాష్ట్ర నాయకులు రాజేశ్వర్, సుధాకర్, దేవదానం, వెంకటన్న, బక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఎన్నో ఏళ్ల కల ప్రజాపాలన సీఎం నాయకత్వంలో నెరవేరినది

గట్టు మండలం ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఈరోజు గద్వాల నియోజకవర్గం గట్టు మండలంలో పరిధిలో పెంచికల పాడు గ్రామం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం నూతన గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు.గట్టు మండలంలో పరిధిలో పెంచికల పాడు గ్రామానికి చెందిన కు మాల సుమిత్ర ఌ/శీ మాల రాజు లిమంజూరు కావడం జరిగినది . నేడు ఇల్లు నిర్మాణం చేసుకొని నూతన గృహప్రవేశానికి ఎమ్మెల్యే గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసిన లబ్ధిదారులకు ఎమ్మెల్యే గారు కానుకను అందజేశారు ఎమ్మెల్యే గారికి లబ్ధిదారులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

**ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ ....**

నూతన ఇందిరమ్మ ఇల్లు ను ప్రారంభించిన లబ్ధిదారులకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి కావడం లబ్ధిదారులు నూతన గృహప్రవేశం చేయడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరు పేదలైన ప్రజలకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేయించి వారికి విడతల వారీగా వారి ఖాతాలు డబ్బులను ఐదు లక్షల రూపాయలను నమోదు చేయడం జరిగింది. వాటికి తోడుగా లబ్ధిదారులు మరికొంత డబ్బులను తో ఇంటిని అన్ని వసతులతో ఏర్పాటు చేసుకోవడం జరిగినది. గద్వాల నియోజకవర్గంలో మొదటి విడత లో 3500 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగినది. దాదాపుగా 2000 పైగా ఇండ్లు నిర్మాణం పనులు కొనసాగుతున్న. త్వరగా ఇంటి నిర్మాణం పనులు పూర్తి చేసుకొని గృహ ప్రవేశాలు చేయాలి. ఈ ఇందిరమ్మ రాజ్యంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదింటి ప్రజల సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి తో సాధ్యమైనది అని పేర్కొన్నారు.ప్రజలు ఎవరు కూడా ఆందోళన అపోహాలు పడాల్సిన అవసరం లేదు ఇల్లు కట్టించుకుంటే డబ్బులు రావని అపోహాలు వద్దు ఇల్లు రానివారికి ఎవరు కూడా అపోహ పడవద్దండి. రెండో విడతలో త్వరలో కూడా అర్హులైన లబ్ధిదారులు కు మంజూరు ఏవిధంగా కృషి చేస్తామని తెలిపారు. లిఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి నిర్మాణానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం శ్రీ రేవంత్ రెడ్డి గారికి గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు శ్రీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి గారికి గద్వాల నియోజకవర్గ ప్రజలందరి తరపున ధన్యవాదాలు .....

**ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు మాట్లాడుతూ ...**

ఎన్నో ఏళ్ళు గా మా సొంతింటి కల ప్రజాపాలన సీఎం రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి సారథ్యంలో ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి మాకు చాలా సంతోషంగా ఉన్నది మేము ఎల్లప్పుడూ సీఎం గారికి మంత్రి గారికి మా ఎమ్మెల్యే గారికి రుణపడి ఉంటామని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచులు అధ్యక్షులు రాజశేఖర్, సీనియర్ రామకృష్ణ రెడ్డి, సర్పంచ్ , నాయకులు హనుమంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంతోష్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి







**- జిల్లా కలెక్టర్ ప్రియాంక**

**నారాయణపేట ఆగస్టు 14( స్కైన్యూస్)** ధన్వాడ మండలం కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, మైదానం, మరుగుదొడ్లను పరిశీలించి మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని సర్పంచ్‌ను ఆదేశించారు. వినియోగంలో లేని మూత్రశాలను మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని, 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ గతేడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థిని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, మహిళా సాధికారతకు విద్య ఎంతో కీలకమని సూచించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు, సాంబారు అందించకుండా కేవలం అన్నం , సాంబారు మాత్రమే చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ అమలు చేయించని మెస్ ఇన్‌చార్జ్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**నీట్ , జే ఈ ఈ విద్యార్థులకు దిశానిర్దేశం**

అంతకుముందు గిరిజన గురుకులాన్ని కలెక్టర్ తనిఖీ చేసి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నీట్, జే ఈ ఈ మెయిన్స్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ప్రతిరోజూ నిన్నటి కంటే మెరుగ్గా చదవాలని, కష్టమైన సబ్జెక్టులను వాయిదా వేయకుండా ముందుగా సాధన చేయాలని సూచించారు.రోజువారీ చదువుకు టైమ్‌టేబుల్ రూపొందించుకుని క్రమశిక్షణతో చదవాలని, ఒక్క రోజును కూడా వృథా చేయకుండా పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని కలెక్టర్ ప్రియాంక సూచించారు.కలెక్టర్ వెంట జిల్లా అధికారులు, గురుకుల ప్రిన్సిపాల్ ఎం. రాజారాం, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

**బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్**

**ఉట్కూర్ ఆగస్టు 14 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎం భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత. సమగ్రతను చాటి చెప్పాలని బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్. ఉట్కూరు సర్పంచ్ ఎం. రేణుక భరత్. బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి పిలుపు మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా ఉట్కూరు మండల కేంద్రంలోని శ్రీరాంనగర్ వీధుల్లో వారు జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం స్థానికులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు.



ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని. దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. స్వతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. యువత విద్యార్థులు ప్రజలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. భాస్కర్. సర్పంచ్ ఎం. రేణుక భరత్. బిజెపి మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ్. మాజీ ఎంపీటీసీ హనుమంతు. ఉప సర్పంచ్ రమేష్. జిల్లా నాయకులు ఆశప్ప. కొండన్ గోపాల్. పట్టణ అధ్యక్షుడు తిమ్మప్ప. మాజీ మండల అధ్యక్షుడు రమేష్. మండల ప్రధాన కార్యదర్శులు. తార కృష్ణ. రణవీర్. నాయకులు. కార్యకర్తలు లక్ష్మణ్. అశోక్ గౌడ్. బాలాంజనేయులు. రవి. మహేష్. సహదేవ్. తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ ఐటీలో ఘనంగా 22వ ఓరియంటేషన్ డే

**ఏఐపై పట్టు సాధించాలి: మల్లారెడ్డి,**

**హైదరాబాద్ ఆగస్టు 14 (స్పైన్యూస్ ):** కండ్లకోయలోని సీఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీఎంఆర్ఐటీ)లో 2026--27 విద్యా సంవత్సరానికి కొత్తగా చేరిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం 22వ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు.మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, సీఎంఆర్ఐటీలో చదివిన పలువురు విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. కొత్త విద్యార్థులు నాలుగేళ్లలో మంచి ప్లేస్‌మెంట్స్ సాధించి ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. భవిష్యత్ ఏఐదేనని, విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పట్టు సాధించాలని సూచించారు.సీఎంఆర్ గ్రూప్ సెక్రటరీ డా. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు నెలకోసారి కళాశాలకు వచ్చి పిల్లల అటెండెన్స్, అకడమిక్ పనితీరును తెలుసుకోవాలని సూచించారు. సీఈఓ అభినవ్ రెడ్డి విద్యార్థులు వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌ల వైపు అడుగులు వేయాలని అన్నారు.అతిథులు ప్రతిష్య శర్మ, ప్రతుష్ మేత,ఇన్వెస్కో ఇండియా హెచ్ఆర్ హెడ్ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించాలని సూచించారు. సీఎంఆర్ఐటీ డైరెక్టర్ డా. జంగారెడ్డి కష్టపడి పనిచేస్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చని, తల్లిదండ్రులు పిల్లలను సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని అన్నారు.ఫ్రెష్‌మెన్ ఇంజినీరింగ్ హెచ్ఓడీ డా. రాధాకృష్ణ రెడ్డి విద్యార్థులు పాటించాల్సిన నియమ నిబంధనలు, క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్ఓడీలు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.ం




# కోమటిరెడ్డికి మహేష్ గౌడ్ వార్నింగ్

**హైదరాబాద్, ఆగస్టు 14:**తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్‌లో ఇప్పుడు స్వపక్షంలోనే విమర్శల పర్వం మొదలైంది. ఒకవైపు ప్రభుత్వం తన పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంటే, మరోవైపు సీనియర్ నేతల మధ్య మొదలైన మాటల యుద్ధం గాంధీ భవన్‌లో సెగలు పుట్టిస్తోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి ప్రతిగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన కౌంటర్లు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారాయి. చాలా కాలంగా వివిధ వేదికలపై కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్స్ కాంగ్రెస్‌లో కాక రేపుతున్నాయి. సమయం చిక్కినప్పుడల్లా తనకు మంత్రి కావాలనో, లేదా కాంగ్రెస్‌లో సీనియర్లకు గుర్తింపు లేదనో మాట్లాడుతూ వార్తల్లో ఉంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాను ముమ్మాటికీ కాంగ్రెస్ సైనికుడినే అని, రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పని చేస్తానని చెబుతూనే పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. పార్టీతో ఏ మాత్రం సంబంధం లేని వారు ప్రస్తుతం ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారని, ఏళ్ల తరబడి జెండా మోసిన అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు, పాత కాంగ్రెస్ శ్రేణులను అణచివేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లకే దక్కుతుందని, సీమాంధ్ర పాలకుల మీడియా చేతుల్లో ప్రభుత్వం ఉండకూడదని ఆయన సూటిగా విమర్శించారు. పేదల ఇందిరమ్మ ఇళ్లకు వందల కోట్ల కోట్లేలు పెడుతున్నారని, అదే సమయంలో బడా ప్రాజెక్టుల పేరుతో దోపిడీ జరుగుతోందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. చాలా కాలంగా మంత్రి పదవి కోసం చాలా కాలంగా రాజగోపాల్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరగనుంది. అందుకే తన వాక్ స్పీడ్ పెంచారని పార్టీలో గట్టిగా వినిపిస్తుంది. ఈసారి మంత్రివర్గంలో తన పేరు కచ్చితంగా ఉండాలనే వ్యూహాత్మక ఒత్తిడి పెంచుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే టైంలో తన జిల్లా రాజకీయాల్లో తగ్గుతున్న ప్రాధాన్యతను ఆయన ప్రశ్నిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరినైనా సహించేది లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి నుంచి సామాన్య కార్యకర్త వరకు అందరికీ ఒకే రూల్ బుక్ వర్తిస్తుందని, ఎవరూ పార్టీ కంటే పెద్దవారు కాదని ఆయన స్పష్టం చేశారు. ఎక్కడా నేరుగా రాజగోపాల్ రెడ్డి పేరు ప్రస్తావించలేదు. ఆయన చెప్పిన అభిప్రాయం సరైందేనని కానీ, హద్దులు దాటి మాట్లాడటం సరికాదని అన్నారు. మంత్రిపదవులు, లేదా ఇతర పదవులపై తుది నిర్ణయం హైకమాండ్‌దేనని, అందరి కోరికలను ఒకేసారి తీర్చడం ఎవరికీ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి లేదా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సంకేతాలు ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాత కాంగ్రెస్, కొత్తగా వచ్చిన వారు మధ్య ఒక కోల్డ్‌వార్ నడుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వారికి సరైన గుర్తింపు దక్కం లేదనే భావన కొంతమంది సీనియర్లలో ఉంది. ఈ క్రమంలోనే రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ఆత్మగౌరవ కార్డును బయటకు తీశారని మరికొందరు ఆరోపిస్తున్నారు.



## ఎన్టీఆర్ కళాశాలలో అవయవదానంపై
# అవగాహన సదస్సు

**మహబూబ్‌నగర్, ఆగస్టు 14(స్పైన్యూస్ )**స్థానిక ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ ఆ పీజీ కళాశాల (అటానమస్)‌లిలో అఖిల భారత అవయవదాతల సంఘం సమన్వయంతో, జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అవయవదానంపై అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా పాల్గొన్న అఖిల భారత అవయవదాతల సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ వి. నటరాజ్ మాట్లాడుతూ, "మరణం తర్వాత శరీరం మట్టిలో కలిసిపోతుంది. కానీ అవయవాలను దానం చేస్తే అవి మరొకరి శరీరంలో జీవిస్తాయి. ఒక కుటుంబం తీసుకునే ధైర్యమైన నిర్ణయం మరో కుటుంబానికి కొత్త ఆశను, సరికొత్త జీవితాన్ని అందిస్తుంది. అందుకే ఇది సాధారణ దానం కాదు, జీవితాన్ని అందించే మహాదానం" అని అన్నారు.తమ సంఘం ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ మరియు ఎస్.వి.ఎస్. మెడికల్ కాలేజీకి 273 కళ్లను, 18 డెడ్ బాడీలను దానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, "మన జీవితం ఒకరోజు ముగుస్తుంది. కానీ మన మానవత్వాన్ని ముగింపు ఉండకూడదు. మన హృదయం ఆగిపోయినా, మన మంచి నిర్ణయం మరొకరి జీవితంలో కొనసాగవచ్చు. మన కళ్ళు ఈ ప్రపంచాన్ని చూడకపోయినా, మరొకరు ఈ అందమైన ప్రపంచాన్ని చూడగలరు. అందుకే అవయవదానం చేయండి. జీవితాన్ని పంచండి. ఆశను పంచండి" అని అన్నారు.కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ, "సమాజంలో అవయవదానంపై ఎన్నో అపోహలు ఉన్నాయి. విద్యావంతులుగా, సైన్స్ విద్యార్థులుగా ఆ అపోహలను తొలగించాల్సిన బాధ్యత మనపై ఉంది. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల కుటుంబ సభ్యుల ధైర్యంగా ముందుకు వచ్చి అవయవదానం చేస్తే ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నిండుతాయి. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మనం తెలుసుకున్న విషయాలను మన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు మరియు సమాజానికి చేరవేద్దాం. అవయవదానంపై అవగాహన పెంచుదాం, మానవత్వాన్ని చాటుకుందాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ వేణుగోపాల్, బాలురెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, రఘువీర్ గుప్త, అబితాజ్, సనీంభాను, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సీ. హెచ్. శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పి.ఎం. శ్రీ పాఠశాలల్లో కేంద్ర నిధులను
# నిబంధనల ప్రకారం సక్రమంగా వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్ నగర్, ఆగస్టు 1(స్పైన్యూస్ ):**శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పి.ఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ పాఠశాలల్లో కేంద్ర నిధుల వినియోగం, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పి.ఎం.శ్రీ ద్వారా పాఠశాలలకు అందిన నిధులను పాఠశాల అవసరాలకు అనుగుణంగా వినియోగించి, ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచేలా పి.ఎం.శ్రీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధులను వచ్చే వారంలోపు పూర్తిస్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. పాఠశాలల్లో డ్రైనేజ్, గేట్లు, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, లైట్లు, ర్యాంపులు తదితర సౌకర్యాల్లో చిన్నపాటి లోపాలు కూడా లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా బాలికల మరుగుదొడ్లలో తలుపులు, లైట్లు వంటి సౌకర్యాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తరగతి గదుల్లోని అన్ని ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని సూచించారు. దెబ్బతిన్న తలుపులు, కిటికీలు, ర్యాంపులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. పి.ఎం.శ్రీ పాఠశాలలకు నిధుల విషయంలో ఎలాంటి సమస్య లేదు. కేవలం నిధులు ఖర్చు చేసినట్లు చూపించడం కాకుండా, వాటి వినియోగంతో పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్ అన్నారు. త్వరలో పి.ఎం శ్రీ పాఠశాలలను క్షేత్రస్థాయిలో సందర్శించనున్నట్లు ఆమె తెలిపారు. వచ్చే వారం నుంచి తన పర్యటనల్లో పీఎం శ్రీ పాఠశాలలకు ప్రాధాన్యం ఇస్తామని, ప్రధానోపాధ్యాయులు పాఠశాల వారీగా అవసరాలను ముందుగానే గుర్తించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

**ఖర్చుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలి**

పి. ఎం .శ్రీ నిధులతో చేపట్టిన ప్రతి పనికి సంబంధించిన ఖర్చుల వివరాలను పాఠశాల రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. మరమ్మతు పనులకు ముందు, పనులు పూర్తయిన తర్వాత ఫోటోలు తీసి, వాటితో పాటు తేదీ, జీపీఎస్ కోఆర్డినేట్ల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ పనులకు సంబంధించిన ఫైళ్లలో కూడా బిఫోర్--ఆఫ్టర్ ఫోటోలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.విద్యార్థులకు అందిస్తున్న స్వీయ రక్షణ శిక్షణను కేవలం నిధుల వినియోగం కోసం నిర్వహించే కార్యక్రమంగా చూడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. విద్యార్థులకు వాస్తవంగా స్వీయ రక్షణ నైపుణ్యాలు అందుతున్నాయా లేదా పరిశీలించాలని, శిక్షణ సామగ్రి, ఇతర వసతులను సమర్థవంతంగా వినియోగించి కార్యక్రమాన్ని ప్రయోజనకరంగా నిర్వహించాలని సూచించారు. పాఠశాలలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సక్రమంగా నిర్వహించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు పరస్పరం తమ అనుభవాలు, ఉత్తమ విధానాలను పంచుకుని, ఒక పాఠశాలలో విజయవంతమైన కార్యక్రమాలను ఇతర పాఠశాలల్లోనూ అమలు చేసేలా సహకారం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని తదితరులు పాల్గొన్నారు.



## ఇవాళ్టి నుంచి స్మార్ట్ సెక్యూరిటీ కార్డు





**హైదరాబాద్, ఆగస్టు 14:**తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఒక చారిత్రాత్మక మార్పునకు సిద్ధమైంది. రాష్ట్రంలో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, నకిలీ కార్డుల బెడదను శాశ్వతంగా తొలగించేందుకు ప్రభుత్వం 'స్మార్ట్ సెక్యూరిటీ కార్డు'ను తీసుకొచ్చింది. ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం ఏంటంటే, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉచిత రేషన్ బియ్యం క్షేత్రస్థాయిలో ఉన్న నిజమైన నిరుపేద కుటుంబాలకు మాత్రమే అందాలి. గతంలో ఉన్న పేపర్ ఆధారిత లేదా సాధారణ ప్లాస్టిక్ కార్డుల స్థానంలో ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ స్మార్ట్ కార్డులు పంపిణీకానున్నాయి. ఆగస్టు 15న దేశవ్యాప్తంగా జరుపుకునే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఈ వినూత్న కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించే అధికారిక పతాకవిష్కరణ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్డులను లబ్ధిదారులకు స్వయంగా అందజేసి పథకాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా పాల్గొననున్నారు. తొలి విడతలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు కార్డులు ఇచ్చి, తదుపరి దశలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కొత్త రేషన్ కార్డు కేవలం ఒక గుర్తింపు పత్రం మాత్రమే కాదు, ఇది చూడటానికి ఆధునిక డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు ఏటీఎం కార్డు మాదిరిగానే ఉంటుంది. కార్డుపై ఎడమవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కుడివైపు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చిత్రాలు ముద్రించారు. కార్డుపై రేషన్ కార్డు నెంబర్, కుటుంబ యజమాని పేరు, చౌకధరల దుకాణం సంఖ్య, గ్రామం, మండలం, జిల్లా, ఇంటి చిరునామా వివరాలు స్పష్టంగా ఉంటాయి. కార్డుల్లో కుటుంబ యజమానిగా మహిళల పేర్లనే ముద్రించడం ఒక కీలక అంశం.సాధారణ వ్యక్తులు ఈ కార్డును జిరాక్స్ చేయడం లేదా క్లోనింగ్ చేయడం అసాధ్యం అయ్యేలా, బ్యాంకు నోట్లు, పాస్‌పోర్టుల్లో వాడే అత్యంత శక్తివంతమైన సెక్యూరిటీ టెక్నాలజీని ఇందులో పొందుపరిచారు. కార్డుపై ఉన్న గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అనే అక్షరాలు సాధారణ ప్రింటింగ్‌లా కాకుండా కొంచెం ఉబ్బెత్తుగా ఉంటాయి. కార్డును చేతితో తడిమినప్పుడు ఈ స్పర్శ స్పష్టంగా తెలుస్తుంది. ఇది దృష్టి లోపం ఉన్నవారు కూడా కార్డు అసలైనదో కాదో గుర్తించడానికి ఉపయోగపడుతుంది. కార్డుపై అత్యంత సూక్ష్మ పరిమాణంలో అక్షరాలను ముద్రించారు. వీటిని కేవలం భూతద్దం లేదా మైక్రోస్కోప్ ద్వారా మాత్రమే చూడగలం. ఈ అక్షరాలను డిజిటల్ స్కానర్లు కాపీ చేయలేవు. ఒక వేళ ఎవరైనా జిరాక్స్ తీయడానికి ప్రయత్నిస్తే, ఆ భాగం మసకగా లేదా కేవలం ఒక గీతలా మారిపోతుంది.ప్రతి కార్డు వెనుక భాగంలో ఒక ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఇందులో లబ్ధిదారుడి కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు, సీరియల్ నంబర్, డిజిటల్ ఐడీ భద్రంగా ఉంటాయి. ఈ సమాచారాన్ని కేవలం పౌరసరఫరాల శాఖ సాఫ్ట్‌వేర్ మాత్రమే చదవగలదు. దీని వల్ల డేటా భద్రత ఎటువంటి ఢోకా ఉండదు.కార్డుపై సాధారణ కంటికి కనిపించని ఒక రహస్య గుర్తు ఉంటుంది. దీనిని అతినీలలోహిత కాంతి కింద ఉంచినప్పుడు మాత్రమే ప్రభుత్వం చిహ్నం వెలుగులతో కనిపిస్తుంది. తనిఖీ అధికారులు కార్డును వేగంగా వెరిఫై చేయడానికి ఇది సహాయపడుతుంది.కార్డును కాంతికి ఎదురుగా ఉంచి చూసినప్పుడు కార్డు లోపలి పొరల్లో ముద్రించిన తెలంగాణ ప్రభుత్వ ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది.తెలంగాణ ప్రభుత్వ అధికారిక ముద్రితో కూడిన త్రీడీ హోలో గ్రామ్ కార్డుపై అతికించి ఉంటుంది. దీనిని తీసి వేరొక కార్డుకు మార్చడానికి లేదు.నిర్దిష్ట కోణంలో చూసినప్పుడు మాత్రమే ఒరిజినల్ లేదా గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ అనే పదాలు కనిపించేలా రెండు చిత్రాలను పొందుపరిచారు.కార్డు జారీ చేసే అధికారి అయిన పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిజిటల్ సంతకాన్ని కార్డుపై అధికారిక ముద్రగా పొందుపరిచారు.కార్డు అంచుల్లో, లోపలి భాగంలో సంక్లిష్టమైన పేటెన్ ఉపయోగించారు. ఇవి కార్డు ప్రామాణికత పెంచుతాయి.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ స్మార్ట్ కార్డులు రాష్ట్ర సంక్షేమ రంగంలో ఒక కీలక మైలురాయిగా నిలవనున్నాయి. అయితే లబ్ధిదారులు తమ కార్డులపై ఉన్న క్యూఆర్ కోడ్ లేదా హోలోగ్రామ్ దెబ్బతినకుండా జాగ్రత్త వహించాలి. కార్డు పోయినా లేదా ఇతర మార్పుల కోసం నేరుగా మీ సేవ లేదా తహసీల్దార్ కార్యాలయాన్ని మాత్రమే సంప్రదించాలి

## రెంటికి చెడ్డ రేవడిలా ఆ 10 మంది

**హైదరాబాద్, ఆగస్టు 14:**రాజకీయాల్లో గోడ దూకిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పరిస్థితి ప్రస్తుతం ముందు నుయ్యి.. వెనుక గొయ్యి లా తయారైంది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి తమ నియోజకవర్గాలను డెవలప్ చేసుకుందామనో, లేక రాజకీయ భవిష్యత్తును సురక్షితం చేసుకుందామనో భావించి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న ఈ పది మంది ఎమ్మెల్యేల్లో ఒక్కరంటే ఒక్కరు కూడా ప్రస్తుతం సంతోషంగా లేరనేది పొలిటికల్ వర్గాల్లో సాగుతున్న ప్రచారం. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వంటి కొందరు నేతలు తమ ఆవేదనను బహిరంగంగానే వెళ్లగక్కుతుండగా, మిగిలిన వారు లోలోపల రగిలిపోతూ ఉక్కపోతకు గురవుతున్నారు.ఈ ఎమ్మెల్యేల ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన మూలకారణం.. వీరిని కాంగ్రెస్ పార్టీ సాంకేతికంగా, చట్టబద్ధంగా, అధికారికంగా తమలో విలీనం చేసుకోలేకపోవడమే. వీరు కాంగ్రెస్‌లో చేరలేదని స్పీకర్ తీర్పిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ మా ఎమ్మెల్యేలు అయితే మా పార్టీ సమావేశాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నిస్తోంది. కోర్టులు, ఎన్నికల సంఘం లేదా సాంకేతిక వివాదాలు ముందుకు వచ్చినప్పుడు.. మేము కాంగ్రెస్‌లో చేరలేదు, కేవలం మా నియోజకవర్గాల అభివృద్ధి నిధుల కోసమే ముఖ్యమంత్రిని వివిధసత్రాలతో కలిశాం అని స్వయంగా వాంగ్మూలాలు ఇచ్చుకోవాల్సిన విచిత్రమైన, ఆత్మవంచన చేసుకునే పరిస్థితి వీరికి ఏర్పడింది.కాంగ్రెస్‌లో అనధికారికంగా చేరడం వల్ల వీరు బీఆర్ఎస్ పార్టీలో దశాబ్దాలుగా అనుభవించిన హోదా, హక్కులు, కార్యకర్తలపై ఉన్న పట్టును పూర్తిగా కోల్పోయారు. మరోవైపు, అధికారికంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే అనే ముద్ర పడకపోవడంతో ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రత్యేక ప్రాధాన్యత లభించడం లేదు. ఇటు బీఆర్ఎస్‌పై హక్కు లేక, అటు కాంగ్రెస్‌లో చట్టబద్ధమైన గుర్తింపు రాక రాజకీయంగా వీరు పూర్తిగా 'రెంటికి చెడ్డ రేవడి'లా మారిపోయారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు వస్తాయని, పనులు శరవేగంగా జరుగుతాయని ఆశించిన ఈ నేతలకు నిరాశే ఎదురవుతోంది. సొంత కాంగ్రెస్ నియోజకవర్గాలకే నిధుల కొరత వేధిస్తున్న తరుణంలో, ఈ ఫిరాయింపు ఎమ్మెల్యేల ప్రాధాన్యత లభించడం లేదు. చివరకు తమ నియోజకవర్గాల చిన్న చిన్న పనుల కోసం మంత్రులను, అధికారులను కలవాలన్నా, లేదా చివరకు నిధుల కోసం ఫోన్ చేసినా అధికారులు, కాంగ్రెస్ పెద్దలు ఫోన్లు ఎత్తడం లేదని సదరు ఎమ్మెల్యేలు తమ అనుచరుల వద్ద తీవ్ర వేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పది మందిలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వంటి వారు పరిస్థితి తీవ్రతను ముందే గ్రహించి, మెల్లగా కాంగ్రెస్ కార్యక్రమాలకు దూరమై తిరిగి బీఆర్ఎస్ వైపు అడుగులు వేశారు. మున్సిపల్ ఎన్నికల్లో తన నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల్ని గెలిపించారు. కానీ, దానం నాగేందర్, పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్, ప్రకాశ్ గౌడ్ వంటి మిగిలిన నేతలు ఇటు వెనక్కి వెళ్లలేక, అటు ముందుకు సాగలేక తీవ్రమైన మానసిక సంఘర్షణను అనుభవిస్తున్నారు. కాంగ్రెస్ కేడర్ కూడా వీరిని తమ సొంత నేతలుగా స్వీకరించలేకపోవడం, పాత కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌లు వీరికి వ్యతిరేకంగా గ్రూపులు కట్టడం వీరి పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది.సొంత పార్టీని వీడి అధికార పక్షంలోకి వెళ్లే అన్నీ బాగుంటాయని అనుకున్న ఈ ఎమ్మెల్యేలకు ప్రస్తుత పరిణామాలు ఒక పెద్ద రాజకీయ పాఠంగా మారాయి. ప్రజామోదం పొందిన పార్టీకి దూరమై, సాంకేతిక చట్టాల చిక్కుల్లో పడి, అధికారంలో ఉన్న పార్టీలో సరైన గుర్తింపు పొందని ఈ పది మంది ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ప్రస్తుతం తీవ్ర అనిశ్చితిలో పడిపోయింది.

# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వం

**విజయవాడ, ఆగస్టు 14:**ఆంధ్రప్రదేశ్‌లో దశాబ్ద కాలంగా లక్షలాది కుటుంబాలను కుంగదీస్తున్న అతిపెద్ద ఆర్థిక కుంభకోణం అగ్రిగోల్డ్ . తమ కష్టార్జితాన్ని దాచుకుని మునిగిపోయిన చిన్న తరహా డిపాజిటర్లకు రాబోయే ఆరు నెలల్లో డబ్బులు చెల్లించడమే లక్ష్యంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేబినెట్ సబ్‌కమిటీ ఏర్పాటు చేసి, ప్రత్యేక కోర్టుల ద్వారా వేగవంతం చేయడంతో ఈ సుదీర్ఘ పోరాటానికి ఒక ముగింపు లభిస్తుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి. అగ్రిగోల్డ్ గ్రూప్ ఆఫ్ కంపెనీలు రియల్ ఎస్టేట్ ప్లాట్లు, అధిక వడ్డీల ఆశచూపి ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి సుమారు 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి దాదాపు 6,380 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరించాయి. అందులో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు 19.5 లక్షల మంది బాధితులు ఉన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రూ.10,000, రూ.20,000 లోపు ఉన్న చిన్న డిపాజిటర్లకు కొన్ని వందల కోట్లు చెల్లించినప్పటికీ, ఇంకా వేలాది మంది మీడియం, పెద్ద డిపాజిటర్లకు వేల కోట్ల రూపాయలు బకాయిపడి ఉన్నారు.అగ్రిగోల్డ్ గ్రూప్ కొనుగోలు చేసిన వేలాది ఎకరాల వ్యవసాయ భూములు, ప్లాట్లు, నివాస సముదాయాలు, గుంటూరు సమీపంలోని హాయ్‌లాండ్ అమ్యూజ్‌మెంట్ పార్క్ వంటి ఆస్తులను సీఐడీ , ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేశాయి. ప్రెజెంట్ మార్కెట్ వాల్యూ ప్రకారం చూస్తే, ఈడీ, సీఐడీల వద్ద స్వాధీనంలో ఉన్న అగ్రిగోల్డ్ ఆస్తుల విలువ




6,000 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. ఈ ఆస్తులను పారదర్శకంగా విక్రయిస్తే డిపాజిటర్ల బకాయిలు దాదాపుగా చెల్లించడానికి సరిపోతాయని అధికార యంత్రాంగం భావిస్తోంది.గతంలో 2014-19 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలోనే అగ్రిగోల్డ్ ఆస్తులను ఈ-వేలం ద్వారా విక్రయించి డిపాజిటర్లకు సొమ్ము చెల్లించేందుకు హైకోర్టు పర్యవేక్షణలో ప్రయత్నాలు జరిగాయి. అయితే, ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ నేతలు, వారికి అనుకూల వర్గాలు కోర్టుల్లో వివిధ రకాల పిటిషన్లు వేయడం, ఆస్తుల విలువను తక్కువ చేసి చూపుతున్నారంటూ వివాదాలు రేపడం వల్ల వేలం ప్రక్రియ వేగం పుంజుకోలేకపోయింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కూడా దఫాల వారీగా కొంతమందే చెల్లింపులు చేయగలిగింది తప్ప, అటాచ్ చేసిన ప్రధాన ఆస్తులన్నింటినీ వేలం వేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేకపోయింది.ఆస్తులను అమ్మి బాధితులకు డబ్బులు పంచడం చూడానికి సులువుగా కనిపించినా.. దీని వెనుక సంక్లిష్టమైన లీగల్ చిక్కులు ఉన్నాయి. పీఎంఎల్‌ఏ చట్టం కింద ఈడీకి ఉన్న హక్కులు, రాష్ట్ర సీఐడీ పరిధిలోని చట్టం కింద ఉన్న అటాచ్‌మెంట్ల మధ్య సమన్వయం సాధించి ఆస్తులను రిలీజ్ చేయించడం. అగ్రిగోల్డ్ యాజమాన్యం వివిధ బ్యాంకుల వద్ద ఆస్తులను కుదువబెట్టి రుణాలు తీసుకుంది. వాటి కోసం డెట్ రికవరీ ట్రిబ్యునల్ ద్వారా బ్యాంకులు తమకే మొదటి హక్కు ఉందంటూ హైకోర్టును ఆశ్రయించాయి. కంపెనీ ప్రమోటర్ల కుటుంబ సభ్యులు, బెనామీల పేర్లపై పెట్టిన ఆస్తులపై వచ్చిన లీగల్ ఛాలెంజెస్ ను కూడా అధిగమించాల్సి ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక కోర్టుల ఏర్పాటును వేగవంతం చేసి, కేబినెట్ సబ్‌కమిటీ ద్వారా బాధితుల డేటాబేస్‌ను సరి చూస్తోంది. పెద్ద పెద్ద ల్యాండ్ పార్సెళ్లను చిన్న ప్లాట్లుగా విభజించి వేలం వేయడం ద్వారా ఎక్కువ రాబడి రాబట్టవచ్చని ప్రతిపాదనలు ఉన్నాయి. ప్రభుత్వం గనుక చట్టపరమైన అడ్డంకులను అధిగమించి, రాబోయే ఆరు నెలల గడువులోగా వేలం ప్రక్రియను పూర్తి చేసి డిపాజిటర్ల చేతికి డబ్బులు అందిస్తే.. అది ఒక చారిత్రాత్మక విజయంగా నిలుస్తుంది. దశాబ్ద కాలంగా నమ్మకం కోల్పోయిన లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది కొండంత అండగా మారడమే కాకుండా.. కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మైలేజ్ తెచ్చిపెడుతుంది.

# మిల్లర్ల గోడువినేది ఎవరు..?

**బియ్యం రాక మిల్లర్ల నరకయాతన**

**ధాన్యం కొనుగోలు మిల్లర్లు చేస్తేనే మేలు**



**హన్మకొండ:**ప్రభుత్వం నిర్దేశించిన బియ్యం దిగుబడి రాక మిల్లర్లు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల మెడపై కత్తి పెట్టి ధాన్యం దిగిమతి చేయిస్తుందన్నారు. ఎవరో కొంతమంది మిల్లర్లు చేసిన పొరపాటు వలన జిల్లాలోని మిల్లర్లు అందరిపై ఆర్థిక భారం పడుతుందని దాని వలన ఆయా కుటుంబాలు మనోవేదనకు గురవుతున్నాయని కొంతమంది మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం మిల్లర్ల వద్ద నుండి బ్యాంకు డిపాజిట్ పేరుతో లక్షల రూపాయలని ముందస్తుగా వసూలు చేస్తుందన్నారు. బ్యాంకులలో డిపాజిట్ చేసిన మిల్లర్లకే ప్రభుత్వం ధాన్యం దిగుమతికి అవకాశం ఇస్తుందని వారు వాపోతున్నారు. ఇటీవల హన్మకొండ జిల్లాలోని శాయంపేట మండలంలోని రైస్ మిల్ పై సంబంధిత అధికారులు దాడి చేసి ధాన్యం లోటును గుర్తించారు. ఆ క్రమంలో ఆ మిల్లుల నిర్వహకులను ఇటీవల జైలుకు పంపిన విషయం తెలిసింది. 2024 , 2025 , 2026 సంవత్సరానికి గాను ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. దీంతో ఆ మిల్లులు ప్రభుత్వం ఐకెపి ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని దిగుమతి దిగుమతి చేసుకున్నాయి. వర్షాకాలంలో దిగుమతి చేసుకున్న వారి ధాన్యం నాణ్యత పరంగా బాగుంటుందని మిల్లర్లు అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన ప్రతి క్వింటల్ ధాన్యానికి 68 కిలోల బియ్యం రావడం కష్టమని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి మిల్లరు ఆ లోటును పూడ్చడానికి తీవ్రంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితిలు ఉన్నాయని అంటున్నారు. ఒక్కోసారి ఆ లోటును పూడ్చలేక ఇల్లు భూములు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లో అంటున్నారు. ఎంత ఎక్కువగా ధాన్యాన్ని దిగిన చేసుకుంటే అంత ఎక్కువగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. ధాన్యాన్ని పట్టే సమయంలో వచ్చే తౌడు , ఉను క ,నూకలు , పరం లాంటి వస్తువులను బయట అమ్మి లోటును పూడ్చవలసిన దుస్థితి ఏర్పడుతుందని మిల్లర్లు అంటున్నారు. ధాన్యాన్ని పట్టే క్రమంలో విద్యుత్ చార్జీ మిల్లులో పనిచేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఉంటున్నాయని మిల్లర్లు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న కమిషన్ సకాలంలో మిల్లర్లకు అందించినట్లయితే నెత్తిపై పడే భారాన్ని కాసింత తగ్గించుకోవచ్చని మిల్లర్లు తెలిపారు.

**ధాన్యం కొనే అవకాశం మిల్లులకే ఇవ్వాలి**

రైతులు పండించిన పరిధాన్యాన్ని కకొనుగోలు చేసే అవకాశం మిల్లులకు ఇవ్వాలని మిల్లర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దానివలన నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని మిల్లర్లు తెలిపారు. కనీస మద్దతు ధర నిర్ణయించి ప్రభుత్వం మిల్లర్లు వచ్చే కొనే అవకాశం ఇచ్చినట్లయితే నష్టం తాలూకు భారాన్ని తగ్గించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఐకేపీ ద్వారా కొనే విధానం వలన కొన్ని సెంటర్లలో రాజకీయ ప్రమేయాలు చోటుచేసుకుని నాణ్యమైన ధాన్యం దిగుమతి కాకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే నాణ్యమైన ధాన్యాన్ని రైతులు మిల్లర్ల వద్దకు తేవడం లేదని పేర్కొన్నారు. రైతుల పండించిన ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కొనుగోలు చేయకపోయినా వాటి అనుమతులను రద్దు చేయాలని కొంతమంది మిల్లర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారు. రైతులు ధాన్యం పూర్తిగా ఎండకు ముందే మిల్లర్లకు తేవడం వల్ల వాటిలో దిగుమతి రావడం లేదని పేర్కొన్నారు.

**డిపాజిట్ రూపంలో అదనపు భారం.**

ధాన్యం దిగుమతి చేసుకోవాలంటే ప్రతి మిల్లర్ విధిగా బ్యాంకులో డిపాజిట్ చేయాలన్న నిబంధన మిల్లర్ల పాలిట గుదిబండగా మారింది అంటున్నారు. దిగుమతి చేసుకున్న ధాన్యములో 10% బ్యాంకులో డిపాజిట్ చేస్తేనే ప్రభుత్వం అనుమతినిస్తుందని వారు తెలిపారు. మిల్లుల నిర్వహణ గతంతో పోలిస్తే కష్టసాధ్యంగా మారిందని యజమానులు ఆపోతున్నారు. రైతులకు నష్టం జరగకుండా మిల్లు యజమానులకు నష్టాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని కొంతమంది మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# విశాఖలో ఫుడ్ బ్యాంకులు


**విశాఖపట్టణం, ఆగస్టు 14:**విశాఖపట్నంలో పోలీసులు కమ్యూనిటీ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో నగరంలో ఆగస్టు 15న ఈ ఫుడ్ బ్యాంకులు ప్రారంభిస్తున్నారు. విశాఖ నగర సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనతో నగరంలోని ఐదుచోట్ల ఈ ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో వీటిని నిర్వహిస్తారు. అలాగే ఎవరైనా ఆహారం తీసుకొచ్చి ఫ్రిజ్‌లో పెట్టొచ్చు. ఈ ఫుడ్ ఫ్రీ.. ఎవరైనా తినొచ్చు. నగరంలో ఎవరూ ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో కమ్యూనిటీ ఫ్రిజ్‌లకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఈ నెల 15న నగరంలో ఐదుచోట్ల ఫ్రిజ్‌లతో ఈ ఫుడ్ బ్యాంకుల్ని ప్రారంభించబోతున్నారు. నగరంలోని హోటల్స్, కేటరింగ్ నిర్వాహకులుతో పాటుగా ఎవరైనా ప్రత్యేక సందర్భాల్లో ఫుడ్ డొనేట్ చేసేందుకు ముందుకు వచ్చేవారి సహకారంతో వీటిని నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి ఐదుచోట్లు ప్రారంభిస్తున్నా.. రాబోయే రోజుల్లో నగరంలో మరికొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.ఈ నెల 15న నగరంలోని రైల్వే స్టేషన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్ బస్‌స్టేషన్, మద్దిలపాలెం, గాజువాక ప్రాంతాల్లో ప్రారంభిస్తున్నారు. ఈ ఐదుచోట్ల ప్రత్యేకంగా ఒక షెడ్ ఏర్పాటు చేసి.. అక్కడ ఓ రిఫ్రిజిరేటర్‌ను అందుబాటులో ఉంచుతారు. అక్కడ నాణ్యమైన, తాజా ఆహారాన్ని అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేశారు. ప్రతిరోజూ హోటల్స్, కేటరింగ్ నిర్వాహకుల సాయంతో మూడు పూటలా ఆహారాన్ని అక్కడ ఉంచుతారు. ఆయా ప్రాంతాల్లో ఇలా ఫుడ్ బ్యాంకులకు ఆహారం అందించేవారిని గుర్తించారు. ఒకవేళ ఎవరైనా బర్త్ డే, పెళ్లిరోజు, ఇతర ముఖ్యమైన సందర్భాల్లో ఫుడ్ పంపిణీ చేయాలనుకుంటే.. ఫుడ్‌బ్యాంక్ ద్వారా అవసరమైన వారికి అందజేస్తారు. మిగిలిపోయిన, పాడైపోయిన, సగం తినేసి వదిలేసిన ఆహారాన్ని తీసుకురావద్దని బోర్డులు ఏర్పాటు చేస్తారు.ఈ ఫుడ్‌బ్యాంకులకు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతల్ని స్థానికంగా ఉండే కంట్రోల్ రూమ్ సీఐలకు సీపీ అప్పగించారు. ఒకవేళ ఎవరైనా ఫుడ్ బ్యాంకుకు ఆహారం అందజేయాలి అనుకుంటే స్థానికంగా ఉండే పోలీసుల్ని, ప్రత్యేకంగా ఒక మొబైల్ నంబర్ కేటాయించి ఫుడ్ బ్యాంకుల దగ్గర బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఆకలితో



ఇబ్బందిపడేవారికి ఈ ఫుడ్ బ్యాంకులు ఎంతో ఉపయోగంగా ఉంటాయని భావిస్తున్నారు. అందుకే ఈ హంగర్ ఫ్రీ వైజాగ్ పేరుతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విశాఖపట్నం సీపీ శంఖబ్రతబాగ్చి ఆలోచనపై విశాఖవాసులు ప్రశంసలు కురిపిస్న?న్నారు.

## డివైడర్ను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

**మహబూబ్ నగర్:**మహబూబ్నగర్ జిల్లా 44వ జాతీయ రహదారిపై భూత్పూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాదు నుంచి పాండిచ్చేరి వెళ్తున్న బస్సు డివైడర్నుర్ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఘటనలో పదిమందికి గాయాలు అయ్యాయి.



నలుగురి పరిస్థితి సీరియస్ గా వేంది. అందరిని జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 38 మంది ప్రయాణికులు వున్నారు. ఎస్పీ జానకి .. ఘటన స్థలాన్ని పరిశీలించారు.

## ధర్నా చౌక్ దగ్గర అయూష్ వైద్య విద్యార్థుల ధర్నా...

**హైదరాబాద్:**రాష్ట్రంలో గత బిఆర్ఎస్ పదేండ్ల కాలం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల ప్రజా పరిపాలనకు దగ్గర వస్తున్నా కూడా తెలంగాణ ఆయుష్ హౌస్, జూస్త్ర వైద్యులు, హోమియోపతి, అల్లోపతి వైద్యులకు స్టైఫండ్ లను ఇవ్వడంలో ప్రభుత్వం జాప్యం ఎందుకు చేస్తుందని తెలుగుదేశం అధికార ప్రతినిధి జోత్స్న ప్రశ్నించారు.హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద ఆయుష్ వైద్యులు మహాధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పలు పార్టీ నాయకులు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అధికార ప్రతినిధి జ్యోత్స్న మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో ఉండి ప్రజలకు వైద్యం అందిస్తున్న ఆయుష్ వైద్యులకు స్టీఫండ్ పెంచడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నుండి నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్లు విద్యార్థులపై చిన్న చూడటం సరికాదన్నారు. ఎన్సీఐసీయూ (అఖఆఎబ) స్టైఫండ్ ఇవ్వాలని అనుమతులు ఇచ్చిన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ వద్ద బడ్జెట్ లేదని ఇవ్వలేమని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. పక్క రాష్ట్రంలో 68 వేల స్టైఫండ్ ఇస్తే మన రాష్ట్రంలో ఇవ్వకపోవడం ఏమిటని నిలదీశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు స్టైఫండ్ పెంచి ఇవ్వాలని అలాగే పెండింగ్ బకాయిలను కూడా తీర్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

## 15 ఆగస్టు నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో తనిఖీలు

**సికిందరాబాద్:**15 ఆగస్టు నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి పోలీసుల విస్తృత చెకింగ్ జరిపారు. రైల్వే స్టేషన్లో ప్రయాణికులు, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక నిఘా వుంచారు. 15 ఆగస్టు సందర్భంగా పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేసారుఉ. సికింద్రాబాద్ ఆర్పీఎస్ ఇన్స్పెక్టర్ బి. సాయిశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి.

# తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్

**తిరుమల, ఆగస్టు 14:**తిరుమల శ్రీవారి భక్తుల వసతి కష్టాలకు చెక్ పెడుతూ టీటీడీ కొత్తగా నిర్మించిన రెండు వసతి సముదాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. తిరుపతిలో భక్తుల కోసం నిర్మించిన శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ రెండు వసతి సముదాయాలలో దాదాపు 10,000 మంది భక్తులకు వసతి కల్పించవచ్చు. మొత్తం వెయ్యికిపైగా గదులు అందుబాటులోకి రానున్నాయి.. తిరుమలలో 60 వేల మంది యాత్రికులకు వసతి కల్పించేలా 7600 గదులు, 5 పీఏసీలు ఉన్నాయి. తిరుమలలో ప్రస్తుతం ఉన్న వసతి గదులు భక్తులకు సరిపోవడం లేదు.. అలాగని కొత్తగా అక్కడ సముదాయాలు నిర్మించలేని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ తిరుమలలో వసతి గదులు దొరకకపోతే భక్తుల కోసం తిరుపతిలో శ్రీనివాసం, మాధవం, విష్ణునివాసం, పద్మావతి అతిథి గృహం ఉన్నాయి. శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వసతి గదులు సరిపోవడం లేదు.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా కొత్తగా నిర్మించిన మరో



రెండు వసతి సముదాయాలు అందుబాటులోకి రాబోతున్నారు.తిరుపతి రైల్వే స్టేషన్ వెనుక గోవిందరాజస్వామి సత్రాల స్థానంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాల పనులు ముగింపు దశకు వచ్చాయి. ప్రధాన భవనాలు, గదుల నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో జరగబోయే బ్రహ్మోత్సవాల సమయంలో వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. శ్రీపాదం, అచ్యుతం వసతి సముదాయాలను దాదాపు రూ.600 కోట్ల వ్యయంతో, అధునాతన వసతులతో నిర్మిస్తున్నారు. ఈ శ్రీపాదం, అచ్యుత భవనాలు తొమ్మిది అంతస్తులతో నిర్మిస్తున్నారు. ఒక్కో భవనంలో 532 గదులు చొప్పున మొత్తం 1064 గదులు ఉంటాయి.. ఈ రెండు సముదాయాలలో కలిపి 10వేల మంది భక్తులకు వసతి కల్పించవచ్చు.అచ్యుతం, శ్రీపాదం వసతి సముదాయాల్లోని భవనాల్లో రిసెప్షన్, అన్నదానం, డార్మెటరీలు కూడా ఏర్పాటు చేస్తున్నారు.. దాదాపు 7వేల మంది భక్తులకు సరిపోయేలా లాకర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి రానుంది. ఈ రెండు వసతి సముదాయాల నిర్మించాలని 2022లో అప్పటి టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది. కానీ నిర్మాణ పనులు 2024 మార్చిలో ప్రారంభంకాగా.. 2026 ఏప్రిల్‌కు పూర్తి చేయాలని భావించారు. కానీ పనులు కాస్త ఆలస్యం కావడంతో బ్రహ్మోత్సవాల సమయంలో ప్రారంభించాలని ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

# కుప్పం ఎయిర్ పోర్టుపై తమిళ రాజకీయాల్లో చర్చ

**తిరుపతి, ఆగస్టు 14:**ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో నిర్మించనున్న విమానాశ్రయం ప్రాజెక్టు ఇప్పుడు పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ రాష్ట్రంలోని హోసూరు విమానాశ్రయ నిర్మాణానికి ఆటంకం కలుగుతోందని, దీని వెనుక పొరుగు రాష్ట్రాల ప్రమేయం ఉందనే ఆరోపణలతో తమిళనాడు అసెంబ్లీలో ప్రకంపనలు రేగాయి. తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా డిఎంకే ఎమ్మెల్యే శ్రీనివాసన్ లేవనెత్తిన అంశం రాష్ట్రంలో రాజకీయ దుమారాన్ని రేపింది. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టును దెబ్బతీయడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు కావాలనే అడ్డుపుల్లలు వేస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. హోసూరు వంటి కీలక ప్రాంతంలో విమానాశ్రయం రావడం వల్ల పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని, అయితే పొరుగు రాష్ట్రాలు వ్యూహాత్మకంగా ఆ ప్రాజెక్టును ఆపేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారుఈ ఆరోపణలపై తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన స్పందిస్తూ, రాజకీయ ప్రేరేపిత ఆరోపణలను ఖండించారు. పొరుగు రాష్ట్రాలు హోసూరు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ఆమె స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న అసంబద్ధమైన వార్తలను నమ్మి అసెంబ్లీ వేదికపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆమె ఎమ్మెల్యేకు హితవు పలికారు. పరిపాలనాపరమైన సమస్యలను రాజకీయ రంగు పులుమడం వల్ల అభివృద్ధి ప్రాజెక్టులకు నష్టం జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. హోసూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యలను పరిశీలిస్తే, అందులో ప్రధానంగా సాంకేతికపరమైన అడ్డంకులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. హోసూరు ప్రాంతం బెంగళూరుకు భౌగోళికంగా చాలా దగ్గరగా ఉండటం ఒక ప్రధాన సవాలు అంటున్నారు. ఇప్పటికే బెంగళూరులోని కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం ఈ ప్రాంతానికి సేవలందిస్తోందని, నిబంధనల ప్రకారం, ఒక ప్రధాన విమానాశ్రయం ఉన్న నిర్దిష్ట పరిధిలో మరొక విమానాశ్రయాన్ని నిర్మించాలంటే అనేక విమానయాన నియమాలను పాటించాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీనితో పాటు, హోసూరులో ఉన్న హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ రక్షణ సౌకర్యాలు, అడ్డంకులు విమానాల రాకపోకలకు అనుమతులు లభించడంలో ప్రధాన ఆటంకాలుగా మారాయంటున్నారు. మరోవైపు, కుప్పం విమానాశ్రయం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో వేగంగా ముందుకు సాగుతోందని చెబుతున్నారు. భౌగోళికంగా కుప్పం కూడా బెంగళూరుకు దగ్గరగానే ఉన్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందాలతో ముందడుగు వేసిందని అంటున్నారు. బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంతో సమన్వయం చేసుకుని, షరతులతో కూడిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందడంలో ప్రభుత్వం సఫలీకృతమైందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు కోసం 1,788 ఎకరాల భూమి అవసరమని గుర్తించగా, ఇప్పటికే దాదాపు 1,300 ఎకరాల భూసేకరణ పూర్తికావడం ప్రాజెక్టు పురోగతికి నిదర్శనంగా చెబుతున్నారు. కుప్పంను లాజిస్టిక్స్ హబ్‌గా మార్చడం ద్వారా చిత్తూరు జిల్లా పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## బిజినెస్

### అపోలో హాస్పిటల్స్ లాభం 610 కోట్లు

**న్యూఢిల్లీ :** అపోలో హాస్పిటల్స్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.610.4 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.441 కోట్ల లాభంతో పోలిస్తే 38.4 శాతం వృద్ధి కనబరిచింది. సమీక్షాకాలంలో సంస్థ కన్సాలిడేటెడ్ ఆదాయం రూ.5,842.1 కోట్ల నుంచి రూ.7,043.5 కోట్లకు చేరుకున్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. వీటిలో హెల్త్‌కేర్ సేవల నుంచి రూ.3,619 కోట్ల ఆదాయం సమకూరగా, డిజిటల్ హెల్త్, ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్ నుంచి రూ.2,977 కోట్లు సమకూరాయి. అలాగే రిటైల్ హెల్త్, డయాగ్నోస్టిక్ సెగ్మెంట్ నుంచి మరో రూ.499 కోట్లు లభించాయి.

### క్యాప్‌స్టన్ హోమ్ సర్వీసెస్ యాప్



**కొండాపూర్ :** మానవ వనరుల సేవా రంగంలో రెండు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన క్యాప్‌స్టన్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థ క్యాప్‌స్టన్ హోమ్ సర్వీసెస్ యాప్‌ను ఆవిష్కరించింది. ఈ యాప్‌ను ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై మార్కెట్లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్‌నకు ఆయన ప్రచారకర్తగా కూడా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐపీఎస్, సంస్థ చైర్మన్ డాక్టర్ సీఆర్ నాయుడు మాట్లాడుతూ... యాప్ ద్వారా బ్యూటీ, క్లీనింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఏసీ సర్వీసింగ్, కార్పెంటర్, పెస్ట్ కంట్రోల్ తదితర గృహ సేవలను పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన సిబ్బందితో అందించనున్నట్టు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రారంభమైన సేవలను త్వరలో ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రధాన నగరాలకు విస్తరించనున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ కొడాలి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధరల సూచీ మరింత పైపైకి..

# జూలై నెలలో 4.45 శాతంగా నమోదు



**న్యూఢిల్లీ :** ధరల సూచీ మరింత భగ్గుమన్నది. ఆహార పదార్థాల ధరలు భగ్గుమనడంతో జూలై నెలకుగాను రిటైల్ ధరల సూచీ 4.45 శాతానికి ఎగబాకింది. ప్రధానంగా ఉల్లి, అల్లంతోపాటు ఇతర ఆహార పదార్థాల ధరలు రిజర్వు బ్యాంక్ అంచనావేసిన దానికంటే అధికంగా ఉండటంతో వరుసగా రెండోనెలలోనూ దూసుకుపోయింది. జూన్ నెలలో రిటైల్ ధరల సూచీ 4.38 శాతంగా ఉంది. గత నెలలో ఆహార ద్రవ్యోల్బణ సూచీ 5.32 శాతం నుంచి 5.52 శాతానికి ఎగబాకినట్టు జాతీయ గణాంకాల శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. జూన్ నెలలో 4.73 శాతంగా ఉన్న ఉల్లి ధరల సూచీ ఆ మరుసటి నెలలో ఏకంగా నాలుగింతలు పెరిగి 22.54 శాతానికి ఎగబాకింది. అలాగే అల్లం ధరల సూచీ 83.62 శాతానికి చేరుకోగా..వెల్లుల్లి ధరలు కూడా భారీగా పుంజుకున్నాయి. మరోవైపు, బంగాళాదుంప, బెండకాయ, టమాట ధరలు మాత్రం భారీగా పడిపోయాయి. రిజర్వుబ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ నెల మొదట్లో చమురు, ఆహార పదార్థాల కారణంగానే ధరల సూచీ భారీగా పెరుగనున్నట్టు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి మరింత పెరిగే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు.

**తెలంగాణలో అత్యధికం..**

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ధరల సూచీ గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. జూలై నెలలో రాష్ట్రంలో ధరల సూచీ 6.32 శాతానికి ఎగబాకింది. మిజోరాంలో అత్యంత తక్కువ స్థాయి 1.84 శాతంగా నమోదైంది. క్రిసిల్ సీనియర్ డైరెక్టర్ దీప్తి దేశ్‌పాండే మాట్లాడుతూ..ఆహార పదార్థాల ధరల పెరుగుదల మందగించడం, ఆహారేతర ఉత్పత్తుల ధరలు స్థిరంగా ఉండటంతో జూలై నెలకుగాను ద్రవ్యోల్బణ విషయంలో కొంత ఉపశమనం లభించిందన్నారు. ఆహార ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం, అధిక వంటనూనెల ధరలు, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో క్రమంగా తగ్గుముఖం పట్టిందని, ముఖ్యంగా రవాణా ఖర్చులు వంటి ముడిసరుకుల వ్యయాలు క్రమంగా వినియోగదారులపై పటడం వంటి అంశాలు రాబోయే నెలల్లో ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతాయని అంచనావేస్తున్నట్టు చెప్పారు.

# హైదరాబాద్‌లో ట్రంప్ టవర్స్..

# రూ.2 వేల కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

**హైదరాబాద్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన రియల్ ఎస్టేట్ సంస్థ..తెలంగాణ రాష్ట్రంలో అడుగుపెట్టింది. దక్షిణాదిలో తన తొలి హౌజింగ్ ప్రాజెక్టును హైదరాబాద్‌లో త్వరలో ప్రారంభించబోతున్నట్టు ప్రకటించింది. రూ.2 వేల కోట్ల పెట్టుబడితో నిర్మించతలపెట్టిన ఈ లగ్జరీ హౌసింగ్ ప్రాజెక్టును కోకాపేట్‌లోని గోల్డెన్ మైల్ రోడ్డులో నిర్మించబోతున్నది. 65 అంతస్తుల రెండు టవర్లలో 450 అపార్ట్‌మెంట్లు, 16 పెంట్‌హౌస్‌లను 22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నది. త్వరలో భూమి పూజ చేయనున్న ఈ లగ్జరీ ప్రాజెక్టును ట్రిబెకా డెవలపర్స్, ఐరా రియల్టీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఐదేండ్లలో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ముంబైకి చెందిన ట్రిబెకా డెవలపర్స్ వర్గాలు వెల్లడించాయి. +వశీస్త్రత్ముజూష్త్రఅష =వటవతీవఅఎవ

భారత్‌లో ట్రంప్ బ్రాండెడ్ ప్రాజెక్టులను ఈ రియల్ ఎస్టేట్ సంస్థనే నిర్మిస్తున్నది. ఇప్పటికే ఎనిమిది ప్రాజెక్టులను పుణె, ముంబై, కోల్‌కతా, గురుగ్రామ్‌ల్లో నిర్మించినట్టు ట్రిబెకా డెవలపర్స్ ఫౌండర్ కల్పేష్ మెహతా తెలిపారు. దక్షిణాదిలో నిర్మిస్తున్న తొలి రెసిడెన్షియల్ ప్రాజెక్టు ఇదేనని ఆయన వెల్లడించారు. ఈ లగ్జరీ ప్రాజెక్టునకు రెరా అనుమతులు కూడా లభించాయన్నారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.1,700 కోట్ల నుంచి రూ.1,800 కోట్ల వరకు పెట్టుబడి పెడుతున్నట్టు, అలాగే భూమి కోసం అదనంగా రూ.250 కోట్ల నిధులను వెచ్చించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తైన తర్వాత అపార్ట్‌మెంట్ల విక్రయం ద్వారా రూ.3,500–4,200 కోట్ల వరకు ఆదాయం సమకూరవచ్చునని పేర్కొన్నారు. ఇప్పటికే ఎనిమిది పెంట్‌హౌస్‌లు అమ్ముడయ్యాయని, వీటి మొత్తం విలువ రూ.250 కోట్లని వెల్లడించారు. అలాగే రూ.62 కోట్ల విలువైన మరో పెంట్‌హౌజ్ కూడా అమ్ముడైందన్నారు.

**ట్రంప్ టవర్స్ వివరాలు**

65 అంతస్తులతో రెండు టవర్ల నిర్మాణం



దీంట్లో 450 అపార్ట్‌మెంట్లు, 16 పెంట్‌హౌస్

ఒక్కో అపార్ట్‌మెంట్ ధర రూ.5 కోట్లుగా నిర్ణయించింది.

3, 4,5 బీహెచ్‌కే ఫ్లాట్లు నిర్మిస్తున్నారు.

# సిరాజ్‌పైనే పేస్ భారం..

## బుమ్రా గైర్హాజరీలో బౌలింగ్ దళాన్ని నడిపించనున్న మియాభాయ్

శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సమయం దగ్గరపడుతుండగా.. గాలె, కొలంబోలో స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లు, లంక స్పిన్నర్లతో ఎదురయ్యే సవాల్ గురించే ప్రధాన చర్చ నడుస్తోంది. ఆతిథ్య స్పిన్నర్లకు భారత బ్యాటర్లకు ఎలా కౌంటర్ ఇస్తారు? మన స్పిన్ బౌలర్లు ప్రత్యర్థులను ఎలా కట్టడి చేస్తారు? అన్న విశ్లేషణల నడుమ తన పేస్ పవర్‌తో మ్యాచ్ ఫలితాలను మార్చేందుకు 32 ఏండ్ల హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ నిశ్శబ్దంగా సిద్ధం అవుతున్నాడు. ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా అందుబాటులో లేకపోవడంతో భారత పేస్ సారథిగా అతను బాధ్యతలు చేపట్టనున్నాడు. శనివారం మొదలయ్యే తొలి టెస్టులో యువ పేసర్లు ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్‌కు దిశానిర్దేశం చేస్తూనే, పేస్ దళాన్ని ముందుం డి నడిపించే భారాన్ని భుజాలపై వేసుకోనున్నాడు.

**బుమ్రా లేకుంటే మరింత డేంజర్**

బుమ్రా లేని సమయంలో జట్టు బాధ్యతలను భుజానకెత్తుకోవడం సిరాజ్‌కు కొత్తేమీ కాదు. గతేడాది ఇంగ్లండ్‌తో జరిగిన బర్మింగ్‌హామ్ టెస్టులో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రా విశ్రాంతి తీసుకోగా.. హైదరాబాదీ తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 6 వికెట్లు తీసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఆ సిరీస్‌లో ఏకంగా 1113 బంతులు విసిరి 23 వికెట్లు పడగొట్టాడు. గాలె, కొలంబోలో



ఫ్లాట్, టర్నింగ్ వికెట్లపై సిరాజ్ ఇప్పుడు అన్ని బంతులు వేయాల్సిన అవసరం లేకపోయినా సిరీస్‌లో తన పాత్ర భారత్‌కు కీలకం కానుంది. అయితే, ఇంకో ఎండ్‌లో బుమ్రా లేని టైమ్‌లో ఈ హైదరాబాదీ పేసర్ మరింత పవర్‌ఫుల్‌గా మారుతాడు. తన కెరీర్‌లో బుమ్రాతో కలిపి ఆడిన 29 టెస్టుల్లో సిరాజ్ 32 సగటుతో 90 వికెట్లు తీశాడు. అదే బుమ్రా లేకుండా పేస్ దళపతిగా బరిలోకి దిగిన 17 టెస్టుల్లో ఏకంగా 25.4 మెరుగైన సగటుతో 50 వికెట్లు పడగొట్టాడు. లీడ్ బౌలర్‌గా ఉన్నప్పుడు సిరాజ్ ఎంత ప్రమాదకరంగా ఉంటాడో చెప్పేందుకు ఈ గణాంకాలే నిదర్శనం.

**భారత్‌కు ట్రంప్ కార్డ్**

లంకలో తేమతో కూడిన వాతావరణం, ఫ్లాట్ పిచ్‌లపై పేసర్లకు పెద్దగా సహకారం లభించదు. అలాంటి పరిస్థితుల్లోనూ ఒకే తీవ్రతతో బౌలింగ్ చేయడం.. వికెట్ అవసరమైనప్పుడు విభిన్నమైన లైన్ అండ్ లెంగ్త్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను తికమక పెట్టే సిరాజ్ నైజం అతనికి ప్లస్ పాయింట్ కానుంది. బ్యాటర్లను నిస్సహాయులుగా మార్చే తన మార్కు మ్యాజిక్ ఇన్‌కమింగ్ డెలివరీ, అప్పుడప్పుడు ఇన్‌సైడ్ ఎడ్జ్‌ను రాబట్టగల సాధారణ ఫుల్ లెంగ్త్ బంతులే ఇక్కడ అతనికి ఆయుధాలు కానున్నాయి. 'సిరాజ్ ఎప్పుడూ తలవంచడు. ఎలాంటి సవాలునైనా స్వీకరిస్తాడు. రోజులో తొలి బంతి అయినా, ఆఖరి బంతైనా ఒకే తీవ్రతతో బౌలింగ్ చేయడం అతని నైజం. టెన్నిస్ బాల్ క్రికెట్ నేపథ్యం నుంచి రావడం వల్ల సుదీర్ఘంగా బౌలింగ్ చేసే సత్తువ అతనికి ఉంది' అని హైదరాబాద్‌లో సిరాజ్ చిన్ననాటి మెంటర్ మహ్మూద్ అహ్మద్ చెప్పాడు. బౌలింగ్‌లోనే కాకుండా లోయర్ ఆర్డర్‌లో బ్యాటర్‌గానూ సిరాజ్ ఈ సిరీస్‌లో జట్టుకు కీలకం కానున్నాడు. కొలంబోలో శ్రీలంక క్రికెట్ ఎలెవన్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో 15 బంతుల్లోనే అజేయంగా 32 పరుగులు చేసిన అతను వరుసగా మూడు సిక్సర్లు బాది జట్టుకు ఊహించని విజయాన్ని అందించాడు. తోటి ఆటగాళ్లు మియా భాయ్ అని ముద్దుగా పిలిచే సిరాజ్ ఈ సిరీస్‌లో భారత్‌కు ట్రంప్ కార్డ్‌గా మారే అవకాశం ఉంది.

### ఐఎస్ఎస్ఎఫ్ ర్యాంకుల్లో అగ్రస్థానం

**ఢిల్లీ :** హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ ర్యాంకుల్లో అదరగొట్టింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ కేటగిరీలో ఇషా.. 6,384 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఇటీవలి కాలంలో నిలకడగా రాణిస్తున్న ఇషా.. ఈ ఏడాది ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ సర్క్యూట్‌లో భాగంగా మునిచ్, హాంగ్జౌలో స్వర్ణాలు గెలిచి సత్తాచాటింది. పతకాలతో పాటు తాజాగా ఆమె తన ర్యాంకునూ మెరుగుపరుచుకుని అగ్రస్థానానికి చేరుకోవడం గమనార్హం. కాగా ఐఎస్ఎస్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌కు చేరడం ఇషాకు ఇదే తొలిసారి. అంతేగాక మహిళల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలోనూ ఇషా.. 4,961 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.




## స్పోర్ట్స్

### సెప్టెంబర్‌లో అఫ్గాన్‌తో టీ20 సిరీస్



**ఢిల్లీ :** కొద్దిరోజుల క్రితం టీమిండియాతో వన్డే సిరీస్ ఆడేందుకు ఇక్కడకు వచ్చిన అఫ్గానిస్థాన్.. వచ్చేనెలలో మరోసారి భారత్‌కు రానుంది. సెప్టెంబర్‌లో మెన్ ఇన్ బ్లూతో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పోటీపడేందుకు కాబూలీలు భారత్‌కు రానున్నారు. ఈ మేరకు బీసీసీఐ, అఫ్ఘానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) బుధవారం సంయుక్తంగా ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించాయి. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఇరుజట్లూ ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా మూడు టీ20లు ఆడతాయని తెలిపాయి.

### తొలి టెస్టుకు లంక జట్టు ప్రకటన




**గాలె :** సొంతగడ్డపై భారత్‌తో ఈనెల 15 నుంచి జరుగబోయే తొలి టెస్టుకు శ్రీలంక తమ జట్టును ప్రకటించింది. ధనంజయ డి సిల్వ సారథ్యంలోని 16 మంది సభ్యులు గల ఈ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ నిరోషన్ డిక్‌వెలాతో పాటు అన్‌క్యాప్డ్ ఆఫ్ స్పిన్నర్ నువాంత కేశర చోటు దక్కించుకున్నారు. 2023లో న్యూజిలాండ్‌తో చివరగా టెస్టు ఆడిన డిక్‌వెలా.. రెగ్యులర్ వికెట్‌కీపర్ కుశాల్ మెండిస్ గాయం కారణంగా సిరీస్ నుంచి తప్పుకోవడంతో 33 ఏండ్ల వయసులో అవకాశాన్ని దక్కించుకున్నాడు. వీరితో పాటు యువ బ్యాటర్ పసిందు సూరియబండారా, లెఫ్టార్మ్ పేసర్ దిల్షాన్ మధుశంక సైతం జట్టులోకి వచ్చారు.

# మాస్ మహారాజా రవితేజ 'ఇరుముడి' ట్రైలర్ వచ్చేసింది..



ఆగస్టు 21న గ్రాండ్ రిలీజ్!

మాస్ మహారాజా రవితేజ హీరోగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఇరుముడి' ట్రైలర్ తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజనీరింగ్ కాలేజీలో అత్యంత భారీ స్థాయిలో నిర్వహించిన ప్రత్యేక లాంచ్ ఈవెంట్‌లో చిత్ర యూనిట్ ఈ ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ ఆద్యంతం సినిమాపై భారీ అంచనాలను పెంచేలా ఉంది. రవితేజను ఇప్పటివరకు ఎన్నడూ చూడని సరికొత్త డిఫరెంట్ వేరియేషన్‌లో ఈ చిత్రంలో చూపించబోతున్నట్లు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఒకవైపు అదిరిపోయే మాస్ యాక్షన్ ఎలిమెంట్స్, మరోవైపు తండ్రీకూతుళ్ల మధ్య ఉండే హృదయానికి హత్తుకునే ఎమోషనల్ బాండింగ్, అలాగే కథకు తగ్గట్టుగా జోడించిన డివైన్ టచ్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్ మరియు టీ-సిరీస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా, ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 21న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# కొలమానం లేని సరదాలు



అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ సంస్థ తెరకెక్కిస్తున్న చిత్రం 'రోమాంచకం'. సుమంత్‌ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా వేణుగోపాల్ రెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రణయ్‌రెడ్డి వంగా నిర్మాత. సెప్టెంబర్ 3న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో మ్యూజికల్ ప్రమోషన్స్ వేగం పెంచారు. బుధవారం టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు. 'ఈ లోకం ఎంతో కొత్తగా, మారిపోయే ఈ దినం, లోకంలో ఉందీ కేవలం నువ్వు నేను ఇద్దరం, గడియారం లేని సమయాలు, కొలమానం లేని సరదాలు, అంతా మనకు సొంతాలు' అంటూ చంద్రబోస్ రచించిన ఈ పాటకు వాసుకీ వైభవ్ స్వరాల్ని అందించారు. మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలబోసిన కథాంశమిదని మేకర్స్ తెలిపారు.

## టాలీవుడ్‌కు శ్రీలీల దూరమవుతోందా? అసలు కారణం ఇదేనా!



ఒకప్పుడు వరుస సినిమాలతో టాలీవుడ్‌లో బిజీగా ఉన్న శ్రీలీల ప్రస్తుతం తెలుగు ప్రాజెక్టుల విషయంలో కాస్త నెమ్మదించినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త తెలుగు సినిమా ఏదీ లేకపోవడంతో, టాలీవుడ్‌లో అవకాశాలు తగ్గాయా అనే చర్చ మొదలైంది. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'పెళ్లి సందడి'తో గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల, ఆ తర్వాత చాలా మంది అగ్ర హీరోల సరసన వరుస అవకాశాలు అందుకుంది. అయితే 'రాబిన్‌హుడ్', 'మాస్ జాతర', 'ఉస్తాద్ భగత్ సింగ్' వంటి సినిమాల ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఆమె కెరీర్‌పై తీవ్ర ప్రభావం చూపినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే శ్రీలీల పూర్తిగా టాలీవుడ్‌కు దూరమవుతున్నారని చెప్పడం తొందరపాటే. ప్రస్తుతం ఆమె తమిళం, హిందీ చిత్రాలపై ఎక్కువగా దృష్టి పెడుతోంది. తమిళ నటుడు ధనుష్‌తో ఓ తమిళ సినిమాలో నటిస్తుండగా, బాలీవుడ్‌లోనూ కార్తీక్ ఆర్యన్, ఇబ్రహీం అలీ ఖాన్ వంటి హీరోలతో ప్రాజెక్టులు చేస్తోంది. తెలుగులో వరుసగా సినిమాలు చేసిన తర్వాత శ్రీలీల ప్రస్తుతం ప్రాజెక్టుల సంఖ్య కంటే విభిన్నమైన కథలు, మంచి పాత్రల కోసం ఇతర భాషల్లో అవకాశాలపై దృష్టి పెడుతున్నట్లు కనిపిస్తోంది. చాలా కాలంగా వరుసగా కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా శ్రీలీల కనిపించింది. ఇప్పుడు ఇతర పరిశ్రమల్లో తన పరిధిని విస్తరించుకోవడం ద్వారా కొత్త ఇమేజ్‌ను సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.



# 'రాకా'లో గిరిజన రాణిగా?

అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'రాకా' ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. పురాణ, వేద, వర్తమాన కాలాల్ని అనుసంధానిస్తూ సాగే కథాంశమిదని, పునర్జన్మ, ప్రతీకారం అంశాలు ప్రధానంగా ఉంటాయని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాలో దీపికా పదుకోన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. అయితే కథారీత్యా మరో ఇద్దరు నాయికలకు చోటుందని చెబుతున్నారు. బాలీవుడ్ నుంచి వెలువడుతున్న వార్తల్ని బట్టి ఈ సినిమాలో జాన్వీకపూర్, రష్మిక మందన్న కీలక పాత్రల్లో కనిపించబోతున్నారని తెలిసింది. వారి పాత్రల తీరుతెన్నుల గురించి కూడా బాలీవుడ్ మీడియాలో ఆసక్తికరమైన కథనాలొస్తున్నాయి. జాన్వీకపూర్ గిరిజన రాణి పాత్రలో కనిపిస్తుందని, 'రాకా' కథా ప్రపంచంలో ఆమె పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెబుతున్నారు. ఇక రష్మిక మందన్న పురాణకాలం నాటి రక్షకురాలి పాత్రలో కనిపిస్తుందని సమాచారం. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనా? వీటిలో ఏమైనా వాస్తవం ఉందా? అనే విషయాల్లో స్పష్టత రావాలంటే చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సిందే అంటున్నారు. 'రాకా' షూటింగ్ ప్రస్తుతం ముంబయిలో జరుగుతున్నది. వచ్చే ఏడాది డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలకానుంది.

# పార్లమెంట్‌లో పోటాపోటీ నిరసనలు



జులై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గందరగోళం మధ్య ముగిశాయి. గురువారం ఉభయ సభలు ప్రారంభమైన కొద్దిసేపటికే నిరవధికంగా వాయిదా పడ్డాయి. సమావేశాల ముగింపు కూడా అధికార, విపక్షాల మధ్య తీవ్ర రాజకీయ ఘర్షణకు వేదికగా మారింది. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద బీజేపీ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నిరసనలు చేపట్టారు. గురువారం ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే జాతీయ గీతం వందేమాతరంలోని మొత్తం 6 చరణాలను ఆలపించారు. ఆ వెంటనే సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సాధారణంగా సమావేశాలు ముగిసే రోజున సభ పనితీరును, ఉత్పాదకతను వివరిస్తూ స్పీకర్ చేసే ముగింపు ప్రసంగం ఈసారి జరగలేదు. సభ వాయిదా పడిన సమయంలో ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభలో కొద్దిసేపు ఉన్నారు.

ఝార్ఖండ్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ పార్టీ స్పందించడం లేదంటూ బీజేపీ నేతలు ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీరును నిరసిస్తూ మకర్ ద్వార్ వద్ద బీజేపీ ఎంపీలు ఆందోళన చేపట్టారు. ప్రజా సమస్యలపై విపక్షం బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండగా, సభా కార్యకలాపాలను అడ్డుకోవడానికే ప్రాధాన్యం ఇస్తోందని అధికార పక్షం విమర్శించింది. బీజేపీ నిరసనకు కొద్దిసేపటికే విపక్ష ఎంపీలు కూడా అక్కడే ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేడా నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో ఓ బొమ్మ కోతిని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. '56 అంగుళాల చిన్న కోతి లోపలికి రా' అంటూ చేసిన నినాదాలు రాజకీయంగా వివాదానికి దారితీశాయి. అధికార పక్ష నేతలు ఈ నిరసన తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

**'సభ నడపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే'**

సభ సజావుగా సాగకపోవడానికి విపక్షాన్ని నిందించడం సరికాదని ప్రతిపక్షాలు ఎంపీలు అన్నారు. పార్లమెంట్‌ను నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ ఎంపీ సౌగత రాయ్ అని స్పష్టం చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన వినేందుకు విపక్షం సిద్ధంగా లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. ఝార్ఖండ్ అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరామని, ఎవరి ఆదేశాలతో పెల్లెట్ గన్ కాల్పులు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశామని తెలిపారు. కానీ ప్రభుత్వం నుంచి సరైన వివరణ రాలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ ఔజ్లా కూడా సభ వాషౌట్‌కు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. గత 20 రోజులుగా పార్లమెంట్‌లో ఉండి సమస్యలపై చర్చకు ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశాలు ముగియడానికి చివరి రోజు మాత్రమే కేంద్ర హోంమంత్రి చర్చకు సిద్ధమని చెప్పడం వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీశారు.

**విపక్షమే సభను అడ్డుకుందని బీజేపీ ఆరోపణ**

మరోవైపు అధికార పక్షం కూడా విపక్ష ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనే సభా కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపించారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ మాట్లాడుతూ, పార్లమెంటరీ వ్యవస్థ ప్రకారం సభ నడుస్తుందని, దానిని ఎవరి వ్యక్తిగత వ్యవహారంలా మార్చలేరని అన్నారు. రాహుల్ గాంధీ తన రాజకీయ ప్రభావంతో వరుసగా కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రి రాజీనామా చేయాల్సి వస్తుందని భావించడం సరికాదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో నిర్ణయాలు వ్యవస్థ ప్రకారమే జరుగుతాయని చెప్పారు.

**వరుస అంతరాయాలతోనే సమావేశాలు**

ఈసారి వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో తరచూ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అధికార, విపక్షాల ఆందోళనలతో సభలు దద్దరిల్లాయి. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై లాఠీచార్జ్, అయోధ్య విరాళాల చోరీ వంటి అంశాలపై నిరసిస్తూ ప్రతిపక్షాలు సభను అడ్డుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులపై లాఠీచార్జ్ ఘటనపై హోంమంత్రి అమిత్ షా జవాబు చెప్పాలని విపక్షాలు చేసిన డిమాండ్ సభను కుదిపేసింది. మరోవైపు ఝార్ఖండ్ నిరసనలపై రాహుల్ గాంధీ స్పందించాలంటూ బీజేపీ ఎంపీలు నిరసలు చేశారు. సభ లోపలే కాకుండా పార్లమెంట్ ప్రాంగణంలోనూ ఇరు పక్షాలు పరస్పర నిరసనలకు దిగాయి. చివరి రోజు కూడా అదే పరిస్థితి కొనసాగడంతో సభలు నిరవధిక వాయిదా వేశారు. దీంతో చర్చలు, రాజకీయ ఆరోపణలు, నిరసనల మధ్య సాగిన వర్షాకాల సమావేశాలకు అధికారికంగా తెరపడింది. అయితే గురువారం చివరిరోజు కావడంతో అమిత్‌షా ఈ అంశంపై సమాధానం చెబుతారని అంతా భావించారు. ఆయన కూడా విపక్షాల ప్రతీ ప్రశ్నకూ సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుధవారం ప్రకటించారు. అందుకు సమయం కేటాయించాలని స్పీకర్‌ను సైతం కోరారు. అయినప్పటికీ, సభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్ఎస్ఎస్, బీజేపీలు ఒక జోకర్ల గుంపు




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, బీజేపీపై గురువారం విరుచుకుపడ్డారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్?కు వ్యతిరేకంగా విద్యార్థులు చేసిన నిరసనలను ప్రభుత్వం అణచివేసిన తీరుపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ బాధను వ్యక్తం చేయాలని విద్యార్థులు అనుకుంటుంటే, ఆ ప్రభుత్వం మాత్రం నిబంధనల పేరుతో వారి గొంతు నొక్కేస్తోందని ఆరోపించారు. కేంద్రంలోని అధికార పక్షం కేవలం కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే ప్రయోజనం చేకూర్చే విధంగా దేశంపై ఒక కఠినమైన వ్యవస్థను బలవంతంగా రుద్దడమే వారి రాజకీయ తత్వమని దుయ్యబట్టారు. గురువారం దిల్లీలో జరిగిన 'రచనాత్మక కాంగ్రెస్ జాతీయ సదస్సు'లో ఆయన మాట్లాడారు.

**అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం**

అయితే, అధికార పార్టీకి భిన్నంగా కాంగ్రెస్ సిద్ధాంతం ఉంటుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశ ప్రజలు తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజలపై బలవంతంగా రుద్దుతున్న నిబంధనలను కాంగ్రెస్ పార్టీ బద్దలు కొడుతుందని వ్యాఖ్యానించారు. నాలుగేళ్ల క్రితం ఉత్తరాఖండ్‌లో అత్యాచారానికి గురై ప్రాణాలు కోల్పోయిన ఓ యువతి తల్లి తనను కలిసి కన్నీరు పెట్టుకుందని రాహుల్ గుర్తుచేసుకున్నారు. బాధితురాలు తన ఆవేదనను వ్యక్తపరచడానికి ప్రయత్నిస్తుంటే, ప్రస్తుత వ్యవస్థ మాత్రం ఆమెను మాట్లాడనివ్వడం లేదు మండిపడ్డారు. ఆమె మాట్లాడితే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని అంటున్నారు. మరోవైపు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ దౌత్య విధానంపై రాహుల్? తీవ్ర విమర్శలు గుప్పించారు. అంతర్జాతీయ నాయకులను కౌగిలించుకోవడం కాకుండా దేశ ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ పని అని హితవు పలికారు. కేవలం స్నేహం, బహిరంగ ఆత్మీయ ప్రదర్శనలపై ఆధారపడకుండా, అంతర్జాతీయ సంబంధాలకు జాతీయ ప్రయోజనాలను పరిరక్షించాలని తెలిపారు.

"కాంగ్రెస్ పార్టీ, ఇతర ప్రతిపక్షాలు కలిసి తమ గళాన్ని వినిపించడం ప్రారంభించాయి. ఇక దీన్ని ఎవరూ ఆపలేరు. నరేంద్ర మోదీ రాజీనామా చేసి, అమిత్ షా పదవి నుంచి తప్పుకునే వరకు మేం వదిలిపెట్టం. చివరికి వారు 'మమ్మల్ని క్షమించండి, మమ్మల్ని వదిలేయండి' అని అంగీకరించి చేతులెత్తేసే వరకు మేం వారిని నిద్రపోనివ్వం. అయితే, ఇదంతా ద్వేషం, హింస లేకుండా ప్రజాస్వామ్య బద్ధంగానే ఎదుర్కొంటాం. దేశ విలువలు, సంస్కృతి కోసం మావంతు ఈ పోరాటం చేస్తున్నాం. మన దేశం, ఆప్యాయత, ప్రేమ, సోదరభావం, అహింస కలిగిన దేశం. ఈ విషయాన్ని మేం అందరికీ నిరూపిస్తాం."

**ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ కీలక వ్యాఖ్యలు**

మరోవైప, రాష్ట్రీయ స్వయం సేవక్? సంఘ్?(ఆర్ఎస్ఎస్)పై కూడా రాహుల్? ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆర్?ఎస్?ఎస్? నాయకులకు ప్రస్తుత భారతదేశంపై ఎలాంటి అవగాహన లేదని ఎద్దేవా చేశారు. గతంలో మనం బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడామని, కానీ ప్రస్తుతం మనం పోరాడుతున్నది మన దేశ చరిత్ర, సిద్ధాంతాలపై కనీస అవగాహన లేని కొందరు జోకర్లతో అని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని అర్థం చేసుకోవాలంటే 3,000 ఏళ్ల నాటి విషయాలు కాదు, ప్రస్తుత భారతదేశాన్ని, ఇక్కడి ప్రజల భావాలను అర్థం చేసుకోవాలని ఆయన హితవు పలికారు. ఒకప్పుడు ఆర్ఎస్ఎస్ అంటే దేశంలోని చిన్న వ్యాపారులు, స్వర్ణకారులు, నగల వ్యాపారులకు ప్రాతినిధ్యం వహించారని రాహుల్ పేర్కొన్నారు. కానీ ఆ కాలం నాటి ఆర్ఎస్ఎస్ ఎప్పుడో కనుమరుగు అయిపోయిందని అన్నారు. ప్రస్తుత ఆర్ఎస్ఎస్ పూర్తిగా రూపాంతరం చెంది పెద్ద పెద్ద కార్పొరేట్ శక్తులు, బడా పెట్టుబడిదారుల చేతుల్లో ఒక సాధనంగా మారిపోయిందని ఆరోపించారు. చేతుల్లో కర్రలు పట్టుకుని తిరుగుతూ వారు తమను తాము హాస్యాస్పదంగా మార్చుకుంటున్నారని దుయ్యబట్టారు.

# 'చైనా ముప్పు'ను అడ్డుకునేందుకు సరిహద్దుల్లో అభివృద్ధి మంత్రం

సరిహద్దు గ్రామాలు అంటే ఒకప్పుడు దేశ పటంలో చివరి అంచున ఉన్న ప్రాంతాలుగానే చూసేవారు. అక్కడికి రోడ్డు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు చేరడమే పెద్ద సవాలుగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. దేశ సరిహద్దులోని గ్రామాల్ని చివరి గ్రామాలుగా కాకుండా, దేశపు తొలి గ్రామాలుగా చూడాలన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాల్ని చేపడుతోంది. కానీ సరిహద్దు గ్రామాలకు రోడ్లు, భవనాలు, విద్యుత్ అందిస్తేనే అక్కడి ప్రజలు ఆగిపోతారా? ఉపాధి లేకపోతే యువత తిరిగి నగరాలవైపు వెళ్లిపోరా? ఈ ప్రశ్నలకు అరుణాచల్ ప్రదేశ్‌లోని రెండు సరిహద్దు ప్రాంతాలు రెండు భిన్నమైన సమాధానాల్ని చూపిస్తున్నాయి. ఒకవైపు అభివృద్ధితో మారుతున్న తవాంగ్ జిల్లాలోని జెమితాంగ్; మరోవైపు మౌలిక వసతులు ఉన్నా ప్రజల వలసలతో వెలవెలబోతున్న లిమేకింగ్ తక్సింగ్.

చైనాతో అత్యంత సున్నితమైన సరిహద్దును పంచుకుంటున్న అరుణాచల్ ప్రదేశ్‌లో స్థానికుల వలసల్ని అడ్డుకోవడం, సరిహద్దు గ్రామాల్ని మౌలిక వసతులతో బలోపేతం చేయడం, వాటిని ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడం, లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 2023 ఏప్రిల్‌లో 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్ (ఎవూ)' ను ప్రారంభించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా- అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల 'కిబిథూ' గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని లాంఛ్ చేశారు. 2026 ఫిబ్రవరి 20న అసోంలోని సరిహద్దు గ్రామం నుంచి రెండో విడతను కూడా విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. రానున్న స్వాతంత్ర్య దినోత్సవం వేళ అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుల్లోని 'జెమితాంగ్', 'లిమేకింగ్- తక్సింగ్' గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందో ఈటీవీ భారత్ అందిస్తున్న ప్రత్యేక కథనం. అరుణాచల్ ప్రదేశ్ దేశంలోనే అత్యంత కీలకమైన సరిహద్దు రాష్ట్రం. ఇది చైనాతో సుమారుగా 1080 నుంచి 1200 కిలోమీటర్ల మేర సరిహద్దును (మెక్ మోహన్ లైన్) పంచుకుంటోంది. చైనా ఎప్పటికప్పుడు అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలు తమవేనని, దానిని దక్షిణ టిబెట్ అని పిలుస్తూ వివాదాలు సృష్టిస్తూ ఉంటుంది. అయితే భారత్ మాత్రం చైనా బెదిరింపుల్ని తిప్పికొడుతూ, అరుణాచల్ ప్రదేశ్ భారతదేశంలోని అంతర్భాగమేనని స్పష్టం చేస్తోంది. చైనా ఆక్రమణల్ని అడ్డుకోవాలంటే సైన్యంతో పాటు సరిహద్దు గ్రామాల్లో ప్రజలు నివసించడం కూడా చాలా ముఖ్యం. అందుకే సరిహద్దు గ్రామాల్ని ఖాళీ కాకుండా చూడటం కూడా భద్రతా వ్యూహంలో భాగంగా మారింది.

**జెమితాంగ్ సక్సెస్ స్టోరీ**

పశ్చిమ అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్ జిల్లాలో ఉన్న జెమితాంగ్ గ్రామం చైనా సరిహద్దుకు చాలా దగ్గరగా ఉంటుంది. ఇక్కడ భారత్ చేపట్టిన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వైబ్రెంట్ విలేజెస్ పథకం కింద ఇక్కడ అద్భుతమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఇక్కడ రవాణా వ్యవస్థ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు ఆర్మీ పోస్టులకు లేదా వేరే ఊళ్లకు వెళ్లాలంటే గంటల తరబడి కొండల్లో నడవాల్సి వచ్చేది. ఇంకా ప్రాణాలకు తెగించి ప్రమాదకరమైన వంతెనలు దాటాల్సి ఉండేది. కానీ ఇప్పుడు చూస్తే వాహనాలు నేరుగా చివరి ప్రాంతం వరకు వెళు_న్నాయి. రోడ్లు, విద్యుత్, తాగునీరు, వైద్యం వంటి సదుపాయాలు అందుబాటులోకి రావడంతో రోజువారీ జీవితం కూడా సులభమైంది. ఇక్కడ భారత సైన్యం కేవలం సరిహద్దు కాపలాకే పరిమితం కాలేదు. ఆపరేషన్ సద్భావ్ కింద ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ, తాగునీటి సదుపాయాలు కూడా కల్పిస్తోంది. ఐటీబీపీ బలగాలు ప్రజలతో పాటు వారి పశువులకు కూడా వైద్యం అందిస్తున్నాయి. ప్రసిద్ధ గొర్సమ్ చోర్టెన్ స్థూపం, జెమితాంగ్ లోయ అందాలు పర్యటకుల్ని ఆకట్టుకుంటున్నాయి. స్థానిక మహిళలు 'కొమోస్ కేఫ్' పేరుతో కేఫ్ నిర్వహిస్తూ తమకంటూ ఆదాయాన్ని సంపాదిస్తున్నారు. ఈసారి ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా స్టాల్స్ కూడా ఏర్పాటు చేసి మోమోస్, నూడుల్స్, చోమిన్, రాగులతో చేసిన పదార్థాల్ని కూడా అమ్మడానికి సిద్ధమవుతున్నారు. ఏటా జరిగే గొర్సమ్ ఉత్సవం సైన్యానికి, స్థానిక ప్రజలకు మధ్య అనుబంధాన్ని మరింత పెంచుతోంది.

**మేకింగ్- తక్సింగ్‌లో మరో పరిస్థితి!**

జెమితాంగ్‌లో అభివృద్ధి కనిపిస్తుంటే తూర్పున ఉన్న అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లిమేకింగ్ - తక్సింగ్ ప్రాంతం మాత్రం మరో వాస్తవాన్ని చూపిస్తోంది. ఇక్కడ స్వాతంత్ర్య దినోత్సవం సందడి కాస్త తగ్గింది. ఒకప్పుడు ఆగస్ట్ 15 వస్తే ఇక్కడ పండగ వాతావరణం ఉండేది. బ్యాండ్ మేళాలు, ఆటల పోటీలు, పరేడ్‌లు కూడా జరిగేవి. సైనికులు, అధికారులు, ఊరి జనమంతా ఉత్సాహంగా పాల్గొనేవారు. కానీ ఇప్పుడు అక్కడ జనం పెద్దగా లేక ఉత్సాహం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో ఇంకా 3 మిడిల్ స్కూళ్లు, 11 ప్రైమరీ స్కూళ్లు, కమ్యూనిటీ హాళ్లు, బ్యాడ్మింటన్ కోర్టులు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించే ప్రజల సంఖ్య తగ్గిపోతోంది.

## తుది దశకు అయోధ్య రామమందిర సీఈఓ ఎంపిక ప్రక్రియ!

అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోసం పూర్తిస్థాయి ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) ఎంపిక ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు రాగా, అందులో మొదటిగా 16 మందిని సెర్చ్ కమిటీ షార్ట్‌లిస్ట్ చేసింది. ఇప్పుడు ఆ పదహారు మంది నుంచి ముగ్గురి పేర్లను ఎంపిక చేసి, సెర్చ్ కమిటీ తమకు పంపుతుందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. "షార్ట్ లిస్ట్ చేసిన పదహారు మంది అభ్యర్థుల పనితీరును సమీక్షించి, సెర్చ్ కమిటీ ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. ఆ అభ్యర్థుల జాబితాను తగిన సమయంలో ట్రస్టుకు తెలియజేస్తుంది. దీనిపై ట్రస్ట్ తుది నిర్ణయాన్ని ప్రకటిస్తుంది" అని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది.

**ఇంటర్వ్యూలు**

రిటైర్డ్ జస్టిస్ పర్మోద్ కోహ్లీ, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ వీకే చతుర్వేది, అణుశాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ హవ్రేలతో కూడిన సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రాంగణంలో ఆగస్టు 11, 12 తేదీల్లో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించింది. సెర్చ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం, సీఈఓ పోస్టు కోసం మొత్తం 5,585 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3,877 మంది అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన కవర్ లెటర్స్ (సీవీ) సమర్పించారు. నమొదటి దశలో నిర్వహణ సామర్థ్యం, భారీ స్థాయి కార్యక్రమాలను, సిబ్బందిని నిర్వహించడంలో అనుభవం, వ్యక్తిగత నైపుణ్యం, భాషా ప్రావీణ్యం, భవిష్యత్తు దృక్పథం, వ్యూహాత్మక ప్రణాళిక వంటి అంశాల ఆధారంగా అభ్యర్థులను వడపోశారు. రెండో దశలో అభ్యర్థులు సమర్పించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సుమారు 111 మంది అభ్యర్థులను ఆన్?లైన్?లో ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వారి కమ్యునికేషన్ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవం, దృక్పథం, వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి అంశాలను ఇందులో అంచనా వేశారు. మూడో దశలో ముఖాముఖి ఇంటర్వ్యూల కోసం 16 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ ఫైనలిస్టుల్లో ఆర్మీలో పనిచేసిన మాజీ సైనికులు, పదవీ విరమణ చేసిన ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసిన నిపుణులు సహా విభిన్న నేపథ్యాలకు చెందిన నిష్ణాతులున్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రాముఖ్యత కలిగిన సంస్థకు ప్రధాన కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పారదర్శకంగా ఎంపిక చేయడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని కమిటీ పేర్కొంది.

**మూడేళ్ల కాంట్రాక్ట్**

ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ట్రస్ట్ సీఈఓను మూడేళ్ల కాంట్రాక్ట్‌పై నియమిస్తారు. పనితీరు ఆధారంగా ఈ పదవీ కాలాన్ని పునరుద్ధరించే అవకాశం ఉంది. అయితే ఈ పదవికి సంబంధించిన జీతం, ఇతర ప్రయోజనాలను చర్చల ద్వారా నిర్ణయిస్తారు. ట్రస్ట్ ప్రత్యక్ష నిర్వహణలో పనిచేస్తూ, సీఈఓ పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తారు. ఆర్థిక విషయాల్లో పారదర్శకతను పాటిస్తారు. ప్రభుత్వ ఏజెన్సీలతో భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తారు. మతపరమైన ఆచారాలు, పండుగలను పర్యవేక్షిస్తారు. భక్తుల భద్రతను, సౌకర్యాలను చూసుకుంటారు. విశిష్ట అతిథుల కోసం ఏర్పాట్లు చేస్తారు. ట్రస్ట్ రోజువారీ కార్యకలాపాలను కూడా పర్యవేక్షిస్తారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

అయోధ్య రామమందిరానికి వచ్చిన విరాళాలు చోరీకి గురయ్యాయని, కానుకల నిర్వహణలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆలయ నిర్వహణ కోసం ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ)ను నియమించాలని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలోనే సెర్చ్ కమిటీ సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టింది. కాగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై జూన్?లో ఎఫ్?ఐఆర్? నమోదైంది. ఇప్పటి వరకు ఈ కేసులో కనీసం 8 మందిని అరెస్టు చేశారు.

## ప్రతి కేసుకు ఒకే టైమ్‌పీరియడ్ సాధ్యం కాదు

దేశవ్యాప్తంగా పెరుగుతున్న కేసుల పెండింగ్ సమస్యకు పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కోర్టులు, కాలపరిమితితో కూడిన విచారణలు అవసరమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. అయితే అన్ని రకాల కేసులకు ఒకే కాలపరిమితిని నిర్ణయించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కేసుల స్వభావాన్ని బట్టి తగిన సమయాన్ని నిర్ణయించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక అంశాలపై మాట్లాడారు.

**ప్రతి కేసుకూ ఒకే గడువు కాదు**

దేశంలోని న్యాయస్థానాల్లో కేసుల పెండింగ్ కొనసాగుతుండటం పెద్ద సవాలేనని సీజేఐ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నుంచి జిల్లా, సెషన్స్ కోర్టుల వరకు ఈ సమస్య ఉందన్నారు. న్యాయవ్యవస్థలో ఇప్పటికే అనేక మార్పులు వచ్చినప్పటికీ ప్రతి కేసు నిర్ణీత సమయంలో త్వరగా పరిష్కారం కావాలన్న ప్రజల ఆకాంక్ష సమంజసమేనని చెప్పారు. అయితే ప్రతి కేసుకు ఒకే కాలపరిమితిని వర్తింపజేయడం సాధ్యం కాదన్నారు. కేసుల స్వభావం, సంక్లిష్టత, అంశాల ఆధారంగా విచారణకు అవసరమైన సమయం మారుతుందని వివరించారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల ఆధారంగా కేసులకు తగిన కాలపరిమితులను నిర్ణయిస్తామని తెలిపారు.

**ప్రత్యేక కోర్టులతో వేగవంతమైన తీర్పులు**

కేసుల పరిష్కారంలో ప్రత్యేక కోర్టులు కీలక పాత్ర పోషిస్తున్నాయని సీజేఐ అన్నారు. ప్రభుత్వ సహకారంతో తీవ్రమైన నేరాలకు సంబంధించిన విచారణల కోసం ఏడాది వ్యవధిలోనే ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయగలిగామని చెప్పారు. వివాహ, కుటుంబ వివాదాల కోసం ఫ్యామిలీ కోర్టులు, వాణిజ్య వివాదాల కోసం కమర్షియల్ కోర్టులు, వివిధ అంశాలపై ప్రత్యేక ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఒకే రకమైన కేసులను ఆయా అంశాల్లో నైపుణ్యం కలిగిన న్యాయస్థానాలు విచారిస్తే వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. భిన్న రకాల కేసులను ఆయా రంగాల్లో నిపుణత కలిగిన కోర్టులు నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**న్యాయమూర్తుల సంఖ్య పెరగాలి**

కేసుల పెండింగ్‌ను పూర్తిగా తగ్గించడంలో న్యాయవ్యవస్థ ఇంకా పూర్తి విజయం సాధించలేదని సీజేఐ అంగీకరించారు. న్యాయమూర్తుల నియామకాలు, ముఖ్యంగా జిల్లా కోర్టుల్లో న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వంటి అంశాలు దీనికి కారణమని చెప్పారు. తాను సీజేఐగా బాధ్యతలు స్వీకరించినప్పుడు కేసుల నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే 'డాకెట్ మేనేజ్‌మెంట్'పై దృష్టి పెట్టినట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా భారీ ప్రభావం చూపే, అత్యంత కీలకమైన కేసులను ముందుగా పరిష్కరించే విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనాల ఏర్పాటు, ఒకే తరహా కేసులను సమూహాలుగా విచారించడం ద్వారా పెండింగ్‌ను తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

**న్యాయమూర్తికి సహాయకారిగానే!**

న్యాయవ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంచుతున్నప్పటికీ అది న్యాయమూర్తి స్థానాన్ని భర్తీ చేయకూడదని సీజేఐ స్పష్టం చేశారు. న్యాయాధికారులు యాంత్రికంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి రాకూడదన్నారు. టెక్నాలజీని న్యాయమూర్తికి సహాయక సాధనంగా మాత్రమే ఉపయోగించాలి తప్ప సాంకేతికతే తీర్పు చెప్పే స్థాయికి వెళ్లకూడదని పేర్కొన్నారు. రాష్ట్రాలు లేదా నిర్దిష్ట ప్రాంతాలకు సంబంధించిన అంశాలపై నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించే విధానంపైనా సీజేఐ స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రభావం చూపే అంశాలను సుప్రీంకోర్టు విచారించవచ్చని కానీ ఒక రాష్ట్రం లేదా నిర్దిష్ట ప్రాంతానికి సంబంధించిన అంశాలను ముందుగా సంబంధిత హైకోర్టు ముందు ఉంచాలని సూచించారు. భారత రాజ్యాంగంలో హైకోర్టులకు అత్యంత కీలకమైన స్థానం ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు, ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు రాజ్యాంగపరమైన అధికారాలు ఉన్నాయని వివరించారు. కొన్ని అంశాల్లో ఆర్టికల్ 226 కింద హైకోర్టులకు ఉన్న అధికార పరిధి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టుకు ఉన్న పరిధి కంటే విస్తృతంగా ఉంటుందని చెప్పారు. ప్రజలకు న్యాయం వారి ప్రాంతానికి దగ్గరగా అందాలనే ఉద్దేశంతోనే ప్రతి రాష్ట్రానికి హైకోర్టు ఉండేలా రాజ్యాంగ నిర్మాతలు వ్యవస్థను రూపొందించారని సీజేఐ అన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137